

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 200 పేజీలు: 12 వెల: 6.50


**సిజెపిపై పోలీసు చర్య.. విచారణ కమిటీ ఏర్పాటు**

**ఇమ్రాన్‌కు తక్షణమే ఆస్పత్రికి తరలించండి: పాక్ సుప్రీం**

9లో

# జయహో బిసి



గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

## రమాదేవి, రామయ్య

**విజయవాడ,ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ గవర్నర్ కోటా ఎం ఎల్‌సీలను ఖరారు చేసింది. ఎప్పటి నుంచో పార్టీకి విధేయంగా ఉంటున్న వర్ల రామయ్య, దళవాయి రమాదేవి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఖరారయ్యారు. వర్ల రామయ్య ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు ఎస్సీ కోటాలో మండలిలో ప్రాతినిధ్యం కల్పించనున్నారు. వర్లరామయ్య గతంలో అనేక పర్యాయాలు ప్రజాప్రాతినిధ్య పదవిని అడుగుతూ వచ్చారు. పార్టీ ఆయన ఎం ఎల్‌ఏ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినప్పటికి గెలవలేకపోయారు. పార్టీ తగిన బలం లేనప్పటికి అసెంబ్లీ నుంచి రాజ్యసభకు పోటీ ఓటమి పాలయ్యారు. టీడీపీ హయంలో ఆయన ఆర్టీసీ చైర్మన్‌గా చేసారు. ఇక అనంతపురంలో డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా ఉన్న రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఆమె బీసీ మహిళ, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఈ నియామకంతో పనిచేసే వారికి పదవులు దక్కుతాయని టీడీపీ సంకేతం పంపింది. ఈ మేరకు ప్రభుత్వం లోక్‌భవన్‌కు దస్త్రం పంపింది.

**హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్** 2లో

**స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్**

**నిబంధనలకనుగుణంగా పెంపు**

**28జిల్లాలకూ జిల్లా పరిషత్‌లు**

**మేయర్, చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు**

**అసెంబ్లీలో సభ్యుల హర్షాతిరేకాల మధ్య మంత్రివర్గ నిర్ణయాన్ని ప్రకటించిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** జయహో బిసి అంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దద్దరిల్లింది. సభ్యుల హర్షాతిరేకాల మధ్య స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి, బిసి సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షి గా స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బిసిలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సిఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని పరిమితులకు లోబడి స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకు న్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33శాతం మేర రిజర్వేషన్‌లను బిసి వర్గాలకు వర్తింప చేయనున్నట్టు అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు ముఖ్యమంత్రి సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పని చేయడం వల్లే ఎర్రన్నాయుడు, కెఇ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణ, దేవేందర్ గౌడ్, అయ్యన్న పాత్రుడు వంటి లెజండరీ నాయకత్వం బిసి వర్గాల నుంచి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌లను 24శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బిసి నేతలకు రాజకీయాల్లో అవకాశాలు దక్కలేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయం గా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్‌లను వర్తింప చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థిరమైన పాలన కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు:** ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతో పాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత >>2

## అక్టోబర్ లోగా లోకల్ పోల్స్

**ప్రత్యక్ష పద్ధతిలోనే మేయర్, చైర్మన్ల ఎన్నిక**

**జిల్లాల విభజనకనుగుణంగా జడ్పీలు**

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్‌లో నిర్ణయం**

**57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం**

**10,060 పోస్టులతో జాబ్ కేలెండర్‌కు ఓకే**

**బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్లు**

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్రఆర్థికసంఘం నుంచి రావాల్సిన >>2



మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం



**పుల్లెల గాయత్రి, ధనుష్ శ్రీకాంత్ సహా**

## 17 మందికి 'అర్జున' అవార్డులు

**ముగ్గురికి 'ద్రోణాచార్య'**

**ఈ సారికూడా లేని ఖేల్‌రత్న**

**జాతీయ క్రీడాపురస్కారాలు ప్రకటించిన కేంద్రం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన >>2

# డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

**రూ.5వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం**

**5వేల మందికి ప్రత్యక్షంగా, 25వేల మందికి పరోక్షంగా ఉపాధి**

**3నెలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కమిటీ చర్యలు**

**కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు**

**కర్నూలు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఓర్వకల్లు డ్రోన్ సిటీని దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన డ్రోన్ తయారీ, పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సాంకేతిక సేవల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో డ్రోన్ సిటీని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఓర్వకల్లు డ్రోన్ సిటీలో డ్రోన్ పరిశ్రమలకు చెందిన సుమారు 150 మంది ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. డ్రోన్ సిటీలో మొత్తం 600 ఎకరాలు కేటాయించగా, తొలి దశలో 12ప్లాట్లకుగాను 8 ప్లాట్లను ఇప్పటికే కంపెనీలకు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 55ఎకరాల్లో వివిధ సంస్థలు తయారీ యూనిట్లు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నాయన్నారు. డ్రోన్ పరిశ్రమ ప్రతిని ధులు టెస్టింగ్, శాండ్‌బాక్స్ సదుపాయాలతో పాటు >>2



మంగళవారం ఓర్వకల్లులో డ్రోన్లను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

## గ్రామగ్రామానికి పార్టీ జెండా

# అదే బిజెపి అజెండా




మంగళవారం విశాఖలో జరిగిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపి పురందేశ్వరి

**ప్రజలతో నిరంతరం మమేకం కావాలి**

**పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి**

**వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా పనిచేయండి**

**పార్టీ శ్రేణులకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు**

**విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కేవలం పార్టీసమావేశాలకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల్లో కి వెళ్లి వారితో నిరంతరం మమేకం కావాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి బిజెపి క్షేత్రస్థాయి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. విశాఖపట్నం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బిజెపిని ప్రతి గ్రామానికి, ప్రతి బూత్‌కు తీసుకెళ్లాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సేవా కార్యక్రమాల ద్వారా వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంపర్కం, సంభాషణ, సంబంధం అనే విధానంతో ప్రజల మధ్య నిరంతరం ఉండాలని పిలుపునిచ్చారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి జాతీయ స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు వంటి నాయకుల ప్రస్థానం బిజెపి ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. పదవులు కాకుండా ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయేకు ప్రజలు ఇచ్చిన అపూర్వ విజయాన్ని అభివృద్ధి, ప్రజాసేవకు వేదికగా మార్చాలని అన్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమికి 21 లోక్‌సభ >>2




మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్న ఢిల్లీ విద్యాశాఖమంత్రి సర్దార్ మన్‌జిందర్‌సింగ్ శిర్సా

**మెగా డిఎస్సీ నిర్వహణ**

# అభినందనీయం

**16వేల టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేశారు**

**టీచర్ రిక్రూట్‌మెంట్ అంటే ఢిల్లీలో కోర్టులు, కేసుల చిక్కులే**

**విద్యా మంత్రి నారా లోకేష్‌ను ప్రశంసించిన ఢిల్లీ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా**

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌పై ప్రశంసలు కురిపించారు. మంగళవారం ఆయన ఆర్‌టిజిఎస్‌లో విద్యా, ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిఎస్సీ ద్వారా 16వేల మంది ఉపాధ్యాయులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎలా నియామకాలు చేపట్టగలిగారని ఆయన మంత్రి నారా లోకేష్‌ని ఆసక్తిగా అడిగారు. ఢిల్లీలో టీచర్ రిక్రూట్మెంట్ అంటేనే కోర్టులో కేసులు, ఫిర్యాదులు, గందరగోళాలు సృష్టించేసి దాని జోలికెళ్లాలంటే జడిపించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిలో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా టీచర్ రిక్రూట్మెంట్ పూర్తి చేసిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ తాము డిఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న పొరబాట్లకు తావు లేకుండా 16వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామన్నారు. దీనిపైన కూడా ప్రతిపక్ష పార్టీ చాలా ఆరోపణలు చేసి విఫలమైందన్నారు. కోర్టుల్లో సైతం వారు ఎక్కడా చిన్న అక్రమం జరిగినట్లు ఆధారాలు చూపించలేక పోయారన్నారు. త్వరలో మరో 3వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ తనకు ఎంతో ఇష్టమైన శాఖని, విద్యాశాఖలో వినూత్న విధానాలు అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. మొట్టమొదటి సారి ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఉపాధ్యాయుల కార్యకలాపాలు, విద్యాశాఖలో మొత్తం కార్య కలాపాలన్నీ పర్యవేక్షించడానికి లీప్ యాప్ రూపొందించామన్నారు. >>2



**ఎఐ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు**

**అల్లుడిని చంపింది సాధిక్కేనా?** 3లో





**సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్** 2లో



మంగళవారం హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న కల్తీనెయ్యి రసాయనాలను పరిశీలిస్తున్న సిపి సజ్జనార్

**తినేదంతా నెయ్యేనా?**

**హైదరాబాద్‌లో విస్తరిస్తున్న కల్తీనెయ్యి మాఫియా** 9లో

19-8pg2exHMNWJQEL_19-8pg2exHMNWJQEL.qxd 19/Aug/26 12:40 AM Page 1





మంగళవారం ఓర్వకల్లులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఒప్పందపత్రాలు

# డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

>> డ్రోన్లను గగనతలంలో పరీక్షించేందుకు అవసరమైన అనుమతులు వేగంగా లభించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారని మంత్రి తెలిపారు. ఈ అంశాలపై నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎ, నాణ్యతా మండలి తదితర విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, మూడు నెలల కాలపరిమితిలో అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ పరిశ్రమ ద్వారా రానున్న కాలంలో ఓర్వకల్లులో రూ.5 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.130 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. డ్రోన్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే 5 వేల మందికి ప్రత్యక్షంగా, 25 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో అన్ని ప్లాట్ల కేటాయింపులు పూర్తి చేసి డ్రోన్ తయారీ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశుద్ధం, శాంతిభద్రతలు, భూసర్వే, విపత్తుల నిర్వహణ, మౌలిక వసతుల పరిశీలన, వైద్య సేవలు తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 6 లక్షలకు పైగా డ్రోన్ల అవసరం ఉండగా ప్రస్తుతం 40 వేలకుపైగా డ్రోన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ భారీ మార్కెట్‌ను దేశీయ తయారీ ద్వారా సద్వినియోగం చేసుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక యువతకు డ్రోన్ తయారీ, నిర్వహణ, ఆపరేషన్, సాంకేతిక సేవలు, పైలట్ శిక్షణలో నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలను పెంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.120 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కర్నూలు విమానాశ్రయం నుంచి భవిష్యత్‌లో బెంగళూరుకు విమాన సేవలు ప్రారంభించే అంశంపై కృషి చేస్తానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయంలో విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా పైలట్ శిక్షణకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. మెల్‌స్టార్ విమాన శిక్షణ సంస్థ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, మరో సంస్థ కూడా ఏర్పాటు కానుందని తెలిపారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీని కేవలం తయారీ కేంద్రంగా కాకుండా పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సేవలు వంటి అన్ని విభాగాలతో కూడిన సమగ్ర డ్రోన్ పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడుల ను ఆకర్షించేందుకు చేస్తున్న కృషికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు.

# 17మందికి 'అర్జున' అవార్డులు

>> తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:** అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది) తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్), నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్), విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్), లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ),సుర్జీత్, పూజ (కబడ్డీ), ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్), ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెయోరాన్ (షూటింగ్) అర్జున అవార్డు (జీవన సాఫల్యం), అరుమై నాయగం (ఫుట్‌బాల్), ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)వీరేందర్ కుమార్ (రెజ్లింగ్) రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే ఈ పురస్కారాలు వరించాయి.

# మెగా డిఎస్సీ నిర్వహణ అభినందనీయం

>>అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్

## రూ.2 లక్షలు లంచంతో పట్టుబడిన శివశంకర్

## మరో నలుగురిని విచారిస్తున్న సిబిఐ అధికారులు

## క్వారీల భద్రతా తనిఖీలు, ప్రమాదాలపై ఆరా

**ఒంగోలు(క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఒంగోలులో మైనింగ్ శాఖ అధికారిపై సిబిఐ అధికారులు పక్కా ప్రణాళికతో నిర్వహించిన ట్రాప్ తీవ్ర కలకలం రేపింది. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ యు.శివశంకర్ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా మంగళవారం తెల్లవారుజామున సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో భద్రతా ప్రమాణాల తనిఖీల కోసం శివశంకర్ సోమవారం బల్లికురవ ప్రాంతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడి క్వారీలను పరిశీలించిన అనంతరం చీమకుర్తి ప్రాంతంలోని పలు క్వారీలను తనిఖీ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. చీమకుర్తిలోని వాసవి గోల్డెన్ గ్రానైట్ క్వారీతో పాటు మరికొన్ని క్వారీల్లో భద్రతా ప్రమాణాలు, గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు, క్వారీల నిర్వహణ తీరుపై పరిశీలన చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తనిఖీలకు ముందే క్వారీ నిర్వాహకులతో శివశంకర్ సంప్రదింపులు జరిపినట్లు సిబిఐ అధికారులు గుర్తించినట్లు సమాచారం. భద్రతా తనిఖీల్లో కొన్ని అంశాలను అనుకూలంగా మార్చడం, క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు సంబంధించిన వ్యవహారాలను సెటిల్ చేయడం వంటి అంశాల కోసం లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.2 లక్షలు చెల్లించేందుకు క్వారీ నిర్వాహకులు అంగీకరించినట్లు సమాచారం. లంచం డిమాండ్ వ్యవహారంపై ముందస్తు సమాచారం అందుకున్న సిబిఐ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి ట్రాప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. డబ్బులు అందజేసే ప్రదేశాన్ని కూడా అధికారులు పర్యవేక్షిస్తూ, లంచం స్వీకరించే సమయంలోనే అధికారిని పట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఒంగోలులోని ఓ రెస్టారెంట్‌లో నగదు అందజేసేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అక్కడ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ట్రాప్ అనంతరం అధికారులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి, నగదు లావాదేవీకి సంబంధించిన వివరాలను నమోదు చేసినట్లు సమాచారం. లంచం స్వీకరణకు సంబంధించి అవసరమైన ఆధారాలను కూడా సిబిఐ అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి గ్రానైట్ వ్యాపారులు సిద్దా సురేష్, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌తో పాటు సర్వేయర్ శుభాష్కర్‌ను కూడా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం ఇచ్చే వ్యవహారంలో వీరి పాత్ర ఏమిటి, నగదు ఎవరి సూచనల మేరకు సమకూర్చారు, క్వారీ యాజమాన్యాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. క్వారీ యాజమాన్యాలు, మైనింగ్ అధికారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సమావేశాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను కూడా సిబిఐ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. చీమకుర్తి ప్రాంతంలోని రెండు గ్రానైట్ క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలోనే శివశంకర్ తనిఖీలకు వచ్చినట్లు సమాచారం. ఒంగోలులోనే శివశంకర్‌ను సిబిఐ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం అరెస్టయిన మైనింగ్ అధికారితో పాటు అదుపులోకి తీసుకున్న క్వారీ నిర్వాహకులు, సర్వేయర్‌ను తదుపరి న్యాయ ప్రక్రియ కోసం విజయవాడకు తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ కేసుకు సంబంధించిన తదుపరి ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం.

# హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం లో ఆమోద ముద్ర వేయడం జరిగిందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకుఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు.హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు.

>>అందించాలని కూటమి నేతలను కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బిసిలే వెన్నెముక:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసాయాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బిసి సమాజమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బిసిల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బిసి రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తామన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని,ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణాలు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. బిసి రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే ఎన్డియే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బిసి అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎంపిటిసి నుంచి ఎంపిగా అవకాశం:** 1984లో ఎన్టీఆర్ స్థానిక

# జయహో బిసి

సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బిసిలకు 20శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5' కింద బిసిలకు 34శాతం మేర రిజర్వేషన్లు పెంచామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదుగుతారని, కర్నూలు జిల్లాకు చెందిన ఎంపిటిసి బస్తిపాటి నాగరాజును ఎంపిగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బిసిలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే:** శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసిపి కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మెగా డిఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసిపి నేతలు హాజరవుతారని భావించానని, కానీ రాకపోవడం దారుణమని సిఎం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకుల పై కేసులు 20యేళ్లుగా కింది కోర్టుకు, హైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2019లో గత పాలకులు బిసి రిజర్వేషన్ల విషయంలో 176 జిఒ తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీం కోర్టుకు కూడా అప్పీలు చేయకుండా వదిలేశారని సిఎం విమర్శించారు. 559, 560 జిఒల ద్వారా రిజర్వేషన్‌లను 34శాతం నుంచి 24.15శాతానికి తగ్గించి, 16,800 మంది బిసి నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బిసిలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్ వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బిసిలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని సిఎం తెలిపారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బిసి నేతలపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టిడిపికి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తుచేశారు. చివరికి బిసి కార్పొరేషన్ల ఏర్పాటు చేసినా కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో

# అక్టోబర్‌లోగా లోకల్ పోల్స్

>> సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఎపి పంచాయతీరాజ్ చట్టం1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు.మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బిసి రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే ప్రధాన అజెండాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశమైంది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో సభా విరామ సమయంలో జరిగిన ఈ భేటీలో దాదాపు అన్ని అజెండా అంశాలపై చర్చ కొనసాగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకుంది.

ఇటీవల 20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన 25 ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణ యం తీసుకున్నారు. బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది.

**ప్రత్యర్థుల కువిమర్శలు తిప్పికొట్టండి**

మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణా మాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. డిఎస్సీ2025తో సహా, శాంతి భద్రతలపై ప్రత్యర్థి పక్షం చేస్తున్న చర్చలను బలీయంగా తిప్పికొట్టాలని సిఎం ఆదేశించారు. సామాజిక మాధ్యమంలో వస్తున్న తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాల న్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# గ్రామగ్రామానికి పార్టీ జెండా అదే బిజెపి అజెండా

>> అసెంబ్లీ సీట్లు లభించాయని నితిన్ నబిన్ గుర్తుచేశారు. ఈ విజయం గర్వించడానికి మాత్రమే కాదని, ప్రజలు పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. బిజెపి- టిడిపి - జనసేన కూటమి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. బిజెపి కేవలం అధికారం కోసం ఏర్పడిన పార్టీ కాదని నితిన్ నబిన్ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయవాదం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయం, అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన బాటలో పార్టీ ఎదిగిందన్నారు. త్యాగం, తపస్సు, సిద్ధాంతం, దేశ ప్రథమ భావన బిజెపికి పునాదులని చెప్పారు. "నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్" అనే సిద్ధాంతంతో పనిచేసే పార్టీ బిజెపి అని పేర్కొన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని కార్యకర్తలకు నబిన్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తోందని నితిన్ నబిన్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి అభివృద్ధి, రాయ్‌పూర్- విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఎఎంసిఎ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. భారత్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నితిన్ నబిన్ అన్నారు. యువతను ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వాతావరణాన్ని కేంద్రం కల్పిస్తోందన్నారు. స్టార్టప్‌లు, మేక్ ఇన్ ఇండియా, పరిశోధన, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో అవకాశాలను యువతకు వివరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా కొత్త తరంతో నిరంతరం సంభాషించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రారంభోపన్యాసం చేస్తూ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "మన ఊరు-మన జెండా' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగరాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న నిధులు, రహదారులు, కాలువలు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్య కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 13,219 గ్రామ పంచాయతీల్లో బిజెపి ప్రజాప్రతినిధులు గెలిచేలా కార్యాచరణ రూపొందించాలని పివిఎన్ మాధవ్ అన్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చైర్మన్, మేయర్ వరకు బిజెపి ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, ప్రతి జిల్లాలో పర్యటించి పార్టీ బలాన్ని పెంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. 'ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని మండల స్థాయికి తీసుకెళ్లాలని మాధవ్ అన్నారు. ప్రజలు బిజెపిని ఆశ్రయిస్తే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కల్పించాలన్నారు. ప్రతి బూత్‌లో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యువతకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విజయాలను పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక పరిణామమని పివిఎన్ మాధవ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,414 కోట్ల రివైవల్ ప్యాకేజీ



మంగళవారం విశాఖలో జరిగిన సభలో నితిన్ నబీన్‌తో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్

అందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు గూగుల్ సెంటర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్ వంటి పెట్టుబడులు రావడం అభివృద్ధికి సంకేతమన్నారు. పోలవరం.. ఉత్తరాంధ్రకు నీళ్లుపోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి సాగునీటి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని మాధవ్ అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా-గోదావరి జలాల సమన్వయంతో రాయలసీమకు దక్కాల్సిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17న 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకోనున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహించాలని పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బిజెపి కార్యక్రమాలు రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని సాగాలని మాధవ్ అన్నారు. సంత్ రవిదాస్ జయంతి, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలతో పాటు నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత, గీత కార్మికులు, యాదవులు, కుమ్మరి, కమ్మరి తదితర వర్గాలతో విస్తృతంగా అనుసంధాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'వికసిత్ భారత్ - యువ సంవాద్' వంటి కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయిలో విస్తృతంగా నిర్వహించి యువతను బిజెపికి మరింత చేరువ చేయాలని మాధవ్ అన్నారు. సమావేశంలో బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్, జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపిలు సిఎం రమేష్, పాకా వెంకటసత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, నడికుడి ఈశ్వర రావు, శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, పోతుల సునీత, జాతీయ సెల్స్ కోకన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో దళితులపై మోడీ రాజకీయ కుట్ర

## నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్

**బొబ్బిలి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణతో దళితులపై బిజెపి మోడీ రాజకీయ కుట్ర చేస్తున్నారని నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. బొబ్బిలి సూర్య రెసిడెన్సీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేస్తున్న వర్గీకరణ ఆయన వ్యతిరేకిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై బీజేపీ మోడీ రాజకీయ కుట్ర దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణతో పూర్తిగా ఉనికి కోల్పోయిన మాల సామాజిక వర్గం.

ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర!! ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుంది. మిత్రు లారా అసలు ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణకు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో 12కి బెనిఫిట్ జరుగుతోంది, ఇది కూడా అధికారిక లెక్క కాదు, ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు? మోడీ అలాగే ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తున్నాను, సామాజిక న్యాయం దళితులకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమేనా ఈ దేశ సంపదలో అక్కర్లేదా మోడీ చంద్రబాబు రేవంత్ రెడ్డి క్యాబినెట్లో మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా మాల వర్గంపై కుట్ర చేస్తుంటే, ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు.

# నైపుణ్యాల సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయనగరం (భోగాపురం), ఆగస్టు 18 ప్రభాతవార్త :** యువత తమకిష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, నిరంతరం శ్రమిస్తే జీవితంలో తిరుగులేని విజయాలు సాధించవచ్చని భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు భోగాపురంలో ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి సౌకర్యాలను అభినందించారు. ఓ వైపు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో దేశానికే తలమానికంగా విమానాశ్రయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తనకు మిత్రుడైన జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఎన్. రావుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ వంటి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో స్వయం ఉపాధి శిక్షణ అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, మొబైల్ మెకానిజం, ఐటీ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ద్వారా యువత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.

**ప్రసంగంలోని ముఖ్య ముఖ్యాంశాలు:**

'ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది లేదు' అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ నిత్యం గుర్తుంచుకోవాలని, చేసే పని పట్ల అంకితభావం, నైపుణ్యం కలగలిస్తేనే నిజమైన శక్తిమంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. మాతృభాష కంటిచూపు లాంటిదని, ఇతర భాషలు కళ్లద్దాల వంటివని స్పష్టం చేశారు. పరభాషలను నేర్చుకోవడంలో తప్పులేదు కానీ సొంత భాషను, సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ విస్మరించకూడదని హితవు పలికారు. ప్రపంచం భారతదేశాన్ని గౌరవించడానికి ఇక్కడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థే మూలకారణమని గుర్తుచేశారు. యువత ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అయితే పూర్తిగా యంత్రాలపై ఆధారపడకుండా మానవ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకంగా, సానుకూల దృక్పథంతో ఆలోచించాలని, సమాజంలో ఒకరికొకరు సహాయపడుతూ టీమ్ స్పిరిట్‌తో పని చేయాలని పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

19-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.సప్తమి రా.7.23
న.స్వాతి ఉ.6.47
వ. మ.12.56-మ.2.42
దు.ఉ.11.45-మ.12.36
రాహు.మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఇంటియందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. పుస్తక పఠనం యందు ఆసక్తిగా ఉంటారు. వస్త్ర లాభం.

**వృషభం :** పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. సభలలో పాల్గొంటారు.

**మిథునం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**సింహం :** సంబంధాలు మెరుగుపడతాయి. మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. వాహన యోగం కలదు.

**కన్య :** అనుకోని అవకాశాలు దగ్గరకు వస్తాయి. దూరపు ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వస్త్ర లాభం

**వృశ్చికం :** కుటుంబ పురోభివృద్ధి. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. స్పెక్యు లేషన్ లాభించదు.

**ధనుస్సు :** కార్యాలయంలో సెలవు కోసం మీరుచేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు ప్రయాణాలు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మధ్యవర్తిత్వాలు చేయడం, మానుకోవడం చెప్పదగిన సూచన. శుభ ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**కుంభం :** ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు మీకు అనుకూలంగా మారుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

19-8Pg3fG_19-8Pg3fG.qxd 18/Aug/26 11:59 PM Page 1



## ఎఇ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు

# అల్లుడిని చంపిందీ సాధిక్కేనా?

- పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి చంపాడంటూ ఫిర్యాదు
- కోచ్ సాధిక్‌ఖాన్‌పై మరో కేసు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. షూటింగ్ కోచ్ షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ కారణంగానే కుటుంబం తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సాధిక్‌ఖాన్‌పై మరో హత్య కేసు నమోదు కావడం కేసులో కొత్త మలుపుగా మారింది. కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన తిల్లపూడి నూకరాజు(61) పిఠాపురంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. వచ్చే జనవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆయన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఏడాది జూలై 2న ఆయన కుమార్తె సౌజన్య(38) భర్త జగదీశ్‌రెడ్డి మృతి చెందారు. దీంతో భర్తను కోల్పోయిన సౌజన్య తన పదేళ్ల కుమారుడు రియాన్స్ కార్తికేయరెడ్డితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ సమయంలో కాకినాడలో ప్రో రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వహిస్తున్న షేక్ సాధిక్‌ఖాన్‌తో కుటుంబానికి పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సౌజన్యకు అండగా ఉంటానని నమ్మించినా నూకరాజు కుటుంబం అంగీకరించకపోవడంతో సాదిక్‌ఖాన్ తరువాత వేధింపులకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఆరోపణలు. కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ బంగారం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, లాకర్ వివరాలు తన ఆధీనంలోకి తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు. సాధిక్‌ఖాన్ వేధింపులను తట్టుకోలేక నూకరాజు కుటుంబం తీవ్రనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు:** సౌజన్య భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై కూడా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. జులై 2న తన కుమారుడికి సాధిక్‌ఖాన్ పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేశాడని నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో మరో వ్యక్తి పాత్ర కూడా ఉందని ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు సాధిక్‌ఖాన్‌పై మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌజన్యకు చెందిన ద్విచక్ర వాహనంలో లభించినట్లు చెబుతున్న లేఖలు కూడా కేసులో కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉంది. తన భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు ఉన్నాయని, సాధిక్‌ఖాన్ తనను బెదిరించి ఆస్తులు, బ్యాంకు లాకర్ తదితర వివరాలు తీసుకున్నాడని ఆమె లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. తనపై మతం మారాలని ఒత్తిడి తెచ్చాడని కూడా అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

**ప్రత్యేక బృందాలతో గాలింపు:** ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో మాట్లాడి సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్‌ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరారీలో ఉన్న సాధిక్‌ఖాన్ కోసం పోలీసులు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యలు, బెదిరింపులు, వేధింపులు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడకుండా పోలీసులను, న్యాయవ్యవస్థను ఆశ్రయించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. మరోవైపు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడి పరిస్థితి హృదయవిదారకంగా మారింది. పూర్తి స్థాయి దర్యాప్తుతో ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఎపి పారిశ్రామికాభివృద్ధి విధానం భేష్



- డేటా లేక్, స్మార్ట్ గవర్నెన్స్ పాఠాలు మాకు నేర్పండి
- 'అమరావతి' ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది
- మంత్రి లోకేష్‌తో ఢిల్లీ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ తీరును చూశాం. నిజంగా ఇదొక అద్భుతం అని ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. 'ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుంది. నారా చంద్రబాబు నాయుడు విజనరీ ముఖ్యమంత్రి. అభివృద్ధికి, దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఎపి ప్రభుత్వం మార్గదర్శి. ఎపిని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాలి" అని మంత్రులు లోకేశ్, టిజి భరత్‌లతో ఢిల్లీ పరిశ్రమలు, ఆహారం, అటవీ పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా కోరారు. ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా నేతృత్వంలో ఆ ప్రభుత్వానికి చెందిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఎపిలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి రాష్ట్ర ఐటి, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌లు సాదర స్వాగతం పలికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఎపి అన్నివిధాలా అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అనుమతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్‌ల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.


### ఎపి నుంచి మేమెంతో నేర్చుకోవాలి.. ఎపి సహకారం కావాలి

పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. తాను చాలా ప్రభుత్వాలను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్థవంతంగా వినియోగించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో ఇంత పెద్ద నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని, ఆయన పుత్రులు మంత్రి నారా లోకేశ్ అని కొనియాడారు. మీ విశ్వ విద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విధానాల రూపకల్పన, డేటా డ్రివన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఎపి సహకారం అందించాలని కోరారు.

ఎపి బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారులకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తాము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేశ్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు

# గాలింపు చర్యలు



- కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ సమన్వయంతో గాలింపు ముమ్మరం
- కోనసీమ మత్స్యకారుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా మత్స్యకారులు వున్న బోటు సముద్రంలో గల్లంతయిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. మంగళవారం పొద్దుటే సీఎంఒ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ లభించేంత వరకు గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన 8 మంది మత్స్యకారులు ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఓడలరేవు జెట్టి నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బయలుదేరిన గంట తర్వాత, అంటే ఉదయం 11 గంటల వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వారి బోటులో వీహెచ్‌ఎఫ్ సెట్‌తో పాటు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపలు పట్టే ప్రదేశానికి చేరుకొని ఉండవచ్చునని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని అధికారులు సీఎంకు తెలిపారు. కోస్ట్ గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నామని, అలాగే కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకార బోట్లకు కూడా సమాచారం అందించి గల్లంతైన బోటు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను మరింత ఉధృతం చేయాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉండాలని, గాలింపు వివరాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ ధైర్యం చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని స్పష్టం చేశారు.

# చంద్రబాబు బిసిల పక్షపాతి, ఆ నిర్ణయం చరిత్రాత్మకం

- శాసనసభలో బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం



మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**విజయవాడ,ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలపటం పట్ల అసెంబ్లీ వేదికగా తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎంఎల్ఏలు హర్షం వ్యక్తం చేసారు. సీఎం చంద్రబాబును ఆయనను సభలో కలిసి వారంతా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీసీలకు స్దానిక సంస్దలలో 34శాతం రిజర్వేషన్లు కల్పించడంపై శాసనసభలో గళమెత్తారు. తమ మనోభావాలను వ్యక్తం చేసారుజగత ప్రభుత్వం రిజర్వేషన్ తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారన్నారు. ఎన్టీఆర్ బాటలోనే నడిచి బీసీలకు మరింత అండగా నిలిచిన వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యేలు గుర్తు చేసుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న కూటమి పార్టీల ఎమ్మెల్యేలు స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల విధానం తెచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వచ్చిన తర్వాతే బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలను చట్టసభలకు పంపిన పార్టీ టీడీపీ అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. బలహీనవర్గాలు ఎప్పుడూ టీడీపీకు అండగా ఉంటున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. 1987లో మొదటిసారి ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1995లో చంద్రబాబు వాటిని 34 శాతానికి తీసుకొచ్చారు. 2020 వరకు స్థానిక సంస్థల్లో ఏ ఎన్నికలు జరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. 2019లో జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి శని పట్టింది. బీసీలపై దమనకాండ జరిగింది. ఆ వర్గాల నేతలపై దాడుల చేసి హింసించారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీకి బీసీలు అండగా నిలిచారు. అందుకే జగన్ కక్షగట్టారు. చట్టసవరణ చేయకుండా రిజర్వేషన్లు పెంచారు. బీసీలకు మాయమాటలు చెప్పారు. పెంచిన రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించి వాటిని అమలు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. బాధ్యత గల ప్రభుత్వం అయితే అప్పుడే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. కానీ అలా జరగలేదు. ఆదరాబాదరాగా 24 శాతంతో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. దీంతో బీసీలకు చాలా అన్యాయం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మేయర్ పదవులు చాలా వరకు బీసీలకు దక్కలేదన్నారు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, బండారు సత్యానంద్, షాజహాన్ బాషా మాట్లాడుతూ బీసీలు అంటేనే టీడీపీ, టీడీపీ అంటేనే బీసీలు అన్నారు. టీడీపీ వచ్చాకే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కిందన్నారు. 2016లో బీసీలకు సబ్‌ప్లాన్ తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. బీసీలకు సబ్‌ప్లాన్‌ను ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలని, బీసీ పథకాలకు ఎందుకు రద్దు చేశారని, బీసీల రిజర్వేషన్లపై జగన్ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు నిలదీశారు. రిజర్వేషన్ల పెంపు వల్ల బీసీల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయన్నారు. ఈ నిర్ణయంతో చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లికి వందనం పేరుతో బీసీ విద్యార్థులు చదువుకునేలా అండగా ఉన్నారని, గ్రామస్థాయి నుంచి బీసీలకు రాజకీయ అవకాశాలు ఇచ్చే నిర్ణయమన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీదేనని తెలిపారు. గ్రామం నుంచి వచ్చిన సామాన్య కార్యకర్తను కూడా టీడీపీ మంత్రిగా చేసిందన్నారు. ఎందరో బీసీలను చట్టసభ సభ్యులు చేసిన ఘనత ఎన్టీఆర్‌దని, టీడీపీ చొరవ వల్లే అనేకమంది బీసీ వ్యక్తులు సభలో ఉన్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో సామాజిక న్యాయం ఉండాలని టీడీపీ కోరుకుంటోందన్నారు. జగన్ హయాంలో అనేక బీసీ పథకాలను నిర్వీర్యం చేశారని, బీసీ నాయకులను అణగదొక్కారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో అనేకమంది బీసీలు మంత్రులు అయ్యారన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. టీడీపీకి, బీసీలకు విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,800 పదవులను బీసీలు కోల్పోయారని మంత్రి సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు గీత కార్మికులు, వడ్డెరలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, మత్స్యకారులకు పలు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించిందన్నారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామని, నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం శుభవార్త అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీలను అణచివేయాలని ప్రయత్నించారని చెప్పారు. టీడీపీ బీసీ నేతలపై కేసులు పెట్టారని ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రయ్యను నడిరోడ్డుపై హత్య చేశారని నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్‌ను చంపేశారన్నారు.


## AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
| --- | --- | --- |
| (రుణ ఖాతా నం.) 25660000083308, కొపల్లె జనవయ్య (రుణగ్రహీత), కొపల్లె అనిత (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ. 6,13,299/- రూపాయలు ఆరు లక్షల పదమూడు వేల రెండు వందల తొంభై తొమ్మిది మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** గుంటూరు జిల్లా, తెనాలి వెస్ట్ SRO, తెనాలి మండలం, సంగం జాగర్లమూడి గ్రామ పంచాయితీ, సంగం జాగర్లమూడి గ్రామం, సర్వే నం. 190-A1, LP నం. 356, అసెస్‌మెంట్ నం. 1220, డోర్ నం. 9-9. విస్తీర్ణం: 145 చదరపు గజాలు లేదా 121.23 చదరపు మీటర్ల స్థలం; దీనిపై 280 చదరపు అడుగుల విస్తీర్ణంలో RCC నివాస గృహం మొదటి అంతస్తు మరియు 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ACC షెడ్ మొదటి అంతస్తు నిర్మించబడి ఉన్నాయి. సరిహద్దులు: తూర్పున - ఇతరుల ఆస్తి, పడమరన - నలుకుర్తి అలవనస్ ఆస్తి, ఉత్తరాన - పంచాయితీ బజార్, దక్షిణాన - రేపూడి జయరామ్ ఆస్తి. | | |
| (రుణ ఖాతా నం.) 22630000028849, తాడిశెట్టి రాఘవ (రుణగ్రహీత), తాడిశెట్టి వెంకాయ్యమ్మ (సహ-రుణగ్రహీత), తాడిశెట్టి యేసుబాబు (సహ-రుణగ్రహీత) | 27-మే-25 రూ. 16,86,799/- పదహారు లక్షల ఎనభై ఆరు వేల ఏడు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే 26-మే-25 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్-డిస్ట్రిక్ట్, నంబూరు గ్రామ పంచాయతీ, నంబూరు గ్రామం, సర్వే నం. 448, ఇంటి నం. 7-36/1, అసెస్‌మెంట్ నం. 1834; మొత్తం 323 చదరపు గజాలలో 130 చదరపు గజాల విస్తీర్ణం గల ఆర్‌సిసి భవనం. సరిహద్దులు: తూర్పున - సర్కార్ బజార్ స్థలం 23 అడుగులు, పడమరన - సర్కార్ బజార్ స్థలం 23 అడుగులు, ఉత్తరాన - వాసా వెంకయ్య మరియు నాగేంద్రం స్థలం 51 అడుగులు, దక్షిణాన - కందురి సుబ్బయ్య స్థలం 51 అడుగులు. | | |
| (రుణ ఖాతా నం.) 24630000069327, షేక్ హబీబున్నీసా (రుణగ్రహీత), షేక్ జానీ బాషా (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 రూ. 20,37,271/- ఇరవై లక్షల ముప్పై ఏడు వేల రెండు వందల డెబ్బై ఒక రూపాయి మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** స్థలం: గుంటూరు జిల్లా, గుంటూరు SRO పరిధి, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, గుంటూరు నగరం, ఇందిరా ప్రియదర్శిని కాలనీ 11వ లైన్, తూర్పు వైపున గుంటూరు గ్రామం, సర్వే నం. 1169/C2, అసెస్‌మెంట్ నం. 1021096251, ఇంటి నం. 19-15-355/2; 45.28 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం. 37.85 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించబడిన, RCC పైకప్పు కలిగిన నివాస గృహం (విద్యుత్ మీటర్, విద్యుత్ పరికరాలు, చెక్క సామాగ్రి మరియు ఇంటికి సంబంధించిన ఇతర అనుబంధ వస్తువులతో సహా. దీని సరిహద్దులు: తూర్పున - పట్టెల సుబ్బారావు గారి ఆస్తి 20.6 అడుగులు, పడమరన - బత్తుల కుమారి గారి స్థలం 20.3 అడుగులు, ఉత్తరాన - తొక్కుల పూర్ణ చంద్రరావు గారి స్థలం 20.0 అడుగులు, దక్షిణాన - 18 అడుగుల వెడల్పు గల రోడ్డు 20.0 అడుగులు. | | |
| (రుణ ఖాతా సంఖ్య) 24660001993970, కదమ కోటేశ్వర రావు (రుణగ్రహీత), కదమ అనసూయ (సహ-రుణగ్రహీత), | 15-డిసెంబర్-25 రూ. 10,61,425/- పది లక్షల అరవై ఒక్క వేల నాలుగు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే 12-డిసెంబర్-25 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు నగరం, ఆర్. అగ్రహారం మున్సిపల్ ప్రాంతం, వార్డు నం. 16, బ్లాక్ నం. 11, టి.ఎస్. నం. 657, గుంటూరు డోర్ నం. 24-21-23/1 పాత అసెస్‌మెంట్ నం. 33198, కొత్త అసెస్‌మెంట్ నం. 1021099725. ఇందులో 28.11 చదరపు గజాలు లేదా 23.50 చదరపు మీటర్ల ఖాళీ స్థలం మరియు దానిపై ఉన్న 759 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన G+2 RCC భవనం మొత్తం 252.99 చదరపు అడుగుల విస్తీర్ణంతో, ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాలతో సహా. సరిహద్దులు: తూర్పున 20 అడుగుల వెడల్పు గల రోడ్డు 11 అడుగులు, పడమరన షేక్ మౌలా బక్షు స్థలం 11 అడుగులు, ఉత్తరాన కదమ శివ స్థలం 23 అడుగులు, దక్షిణాన కదమ చిన కోటేశ్వరరావు స్థలం 23 అడుగులు. | | |
| (రుణ ఖాతా నం.) 22660001225771, జరుగుమిల్లి లక్ష్మి (రుణగ్రహీత), జరుగుమిల్లి రత్తయ్య (సహ-రుణగ్రహీత) | 29-డిసెంబర్-25 రూ. 4,43,591/- నాలుగు లక్షల నలభై మూడు వేల ఐదు వందల తొంభై ఒకటి మాత్రమే 24-డిసెంబర్-25 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** గుంటూరు జిల్లా నల్లపాడు ఉప జిల్లా చిన్నపలకలూరు గ్రామపంచాయత్ చిన్నపలకలూరు గ్రామ సర్వే D నం 65/1D డోర్ నెం 3-595 విస్తీర్ణం 54 1/2 చదరపు గజాల RCC ధాబా సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి నడవ 15-6 అడుగులు, 15-6 అడుగులు, పశ్చిమం: బాకీ రాజా ఆస్తి, ఉత్తరం: జరుగుమల్లి పిచ్చయ్య ఆస్తి 31-6 అడుగులు, దక్షిణం: జరుగుమల్లి లుద్దు మారి మొదలైన ఆస్తి 31-6 అడుగులు | | |
| (రుణ ఖాతా నం.) 25630000003271, గుర్రం రవి (రుణగ్రహీత), గుర్రం సంధ్య (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ. 15,31,531/- పదిహేను లక్షల ముప్పై ఒక్క వేల ఐదు వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 14-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ:** ఐటమ్ నం. 1: గుంటూరు జిల్లా, దుగ్గిరాల SRO, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల గ్రామ పంచాయతీ, దుగ్గిరాల గ్రామం, సర్వే నం. 402-B3 విస్తీర్ణం 1.39 సెంట్లు, బ్లాక్ నం. 3, డోర్ నం. 3-9. ఇందులో 55.55 చదరపు గజాల లేదా 46.45 చదరపు మీటర్ల స్థలంలో 510 చదరపు అడుగుల విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్ RCC పైకప్పుతో మరియు 510 చదరపు అడుగుల విస్తీర్ణంతో మొదటి అంతస్తు RCC పైకప్పుతో నిర్మించబడ్డాయి; వీటితో పాటు ఫర్నిచర్, ఫిక్చర్లు మరియు విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్లు 3651, 2249 ఉన్నాయి. ఐటమ్ నం. 2: గుంటూరు జిల్లా, దుగ్గిరాల SRO, దుగ్గిరాల మండలం, దుగ్గిరాల గ్రామ పంచాయతీ, దుగ్గిరాల గ్రామం, సర్వే నం. 402-B3 విస్తీర్ణం 1.39 సెంట్లు, బ్లాక్ నం. 3, డోర్ నం. 3-9. ఇందులో 21.35 చదరపు గజాల లేదా 17.87 చదరపు మీటర్ల స్థలంలో 166 చదరపు అడుగుల విస్తీర్ణంతో ACC షీట్ల పైకప్పు కలిగిన ఇల్లు నిర్మించబడింది; అన్ని ఈజ్‌మెంట్ హక్కులు వర్తిస్తాయి. సరిహద్దులు - తూర్పున: 1) 2వ ఐటమ్ స్థలం 11.6 అడుగులు, 2) పర్వతనేని ప్రభావతి గారి ప్రహరీ గోడ; పడమరన: 1) శ్రీ షిర్డీ సాయి ITI కళాశాల ఆస్తి (13.6 అడుగులు), 2) 1వ ఐటమ్ ఆస్తి; ఉత్తరాన: 1) సర్కారు రోడ్డు 40.0 అడుగులు, 2) సర్కారు రోడ్డు; దక్షిణాన: 1) పర్వతనేని ప్రభావతి గారి ప్రహరీ గోడ 40.0 అడుగులు, 2) పర్వతనేని ప్రభావతి గారి ప్రహరీ గోడ 40.0 అడుగులు. | | |
| (రుణ ఖాతా నం.) 24660000902491, ఒరిపిల్లి శామ్యూల్ (రుణగ్రహీత) | 08-డిసెంబర్-25 రూ. 5,87,336/- ఐదు లక్షల ఎనభై-ఏడు వేల మూడు వందల ముప్పై-ఆరు మాత్రమే 06-డిసెంబర్-25 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** బాపట్ల S.R.O. వద్ద 17-02-2024న నమోదైన సెటిల్మెంట్ డీడ్ నం. 6357/2024 కలిగిన ఆస్తి. బాపట్ల జిల్లా - బాపట్ల R.D. - బాపట్ల గ్రామ పంచాయతీ - అదవి గ్రామం, D.No. 497/3C - విస్తీర్ణం ఎకరం 0-03 1/2 సెంట్లు లేదా 169.4 చదరపు గజాలు - D.No. 10-58 - అసెస్‌మెంట్ నం. 226 - RCC ఇల్లు మరియు స్థలం. ఈ సరిహద్దుల మధ్య ఎకరం 0-03 1/2 సెంట్లు లేదా 169.4 చదరపు గజాలు / 141.63 చదరపు మీటర్లు స్థలం ఉంది; ఇందులో 240 చదరపు అడుగుల RCC భవనం మరియు 210 చదరపు అడుగుల ACC గది అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులతో సహా ఉన్నాయి. కొలతలు: తూర్పు-పడమర 27.09 అడుగులు మరియు ఉత్తర-దక్షిణ 14.10 అడుగులు, మొత్తం 381.96 చదరపు అడుగుల విస్తీర్ణం మరియు అందులో ఉన్న ప్రస్తుత, భవిష్యత్తు నిర్మాణాలతో సహా. సరిహద్దులు: తూర్పున పిక్కి నూకరాజు గారి ఇంటి స్థలం, పడమరన చేపల మేసియ్య గారి ఇంటి స్థలం, ఉత్తరాన ఒరుపుల ప్రసాద్ గారి ఇంటి స్థలం, దక్షిణాన పంచాయతీ రోడ్డు. | | |
| (రుణ ఖాతా నం.) 23630000050164, గాలి లక్ష్మి (రుణగ్రహీత), గాలి వెంకటరావు (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ. 9,64,113/- తొమ్మిది లక్షల అరవై నాలుగు వేల నూట పదమూడు రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** బాపట్ల జిల్లా, చీరాల సబ్-డివిజన్, చిన్నగంజాం మండలం, కడవకుదురు గ్రామ పంచాయతీ, బ్లాక్ నం. 5, ముస్లిం ఏరియా, కడవకుదురు గ్రామం, సర్వే నం. 370/4 లోని 109 చదరపు గజాల స్థలం ఇందులో డోర్ నం. 5-60, అసెస్‌మెంట్ నం. 643 కలిగిన RCC ఇల్లు మరియు స్థలం ఉన్నాయి. ఈ ఆస్తి పరిధిలో 109 చదరపు గజాల లేదా 91.124 చదరపు మీటర్ల స్థలంలో 690 చదరపు అడుగుల RCC ఇల్లు మరియు 40 చదరపు అడుగుల ACC ఇల్లు, అలాగే అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులు ఉన్నాయి. సరిహద్దులు: తూర్పున ఉమ్మడి దారి, పడమరన మర్రి శ్రీను ఆస్తి, ఉత్తరాన గాలి రాఘవయ్య ఆస్తి, దక్షిణాన గాలి హనుమంతరావు ఆస్తి. | | |
| (రుణ ఖాతా నం.) 24660001873546, కుక్కల శ్రీనివాస రెడ్డి (రుణగ్రహీత), కుక్కల రామలక్ష్మి (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ. 4,57,926/- నాలుగు లక్షల యాభై ఏడు వేల తొమ్మిది వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** బాపట్ల జిల్లా, చీరాల సబ్-డివిజన్, చిన్నగంజాం మండలం, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడిపేధిపాలెం గ్రామం/మోటుపల్లి గ్రామం, సర్వే నం. 255/6, బ్లాక్ నం. 6, ఇంటి నం. 6-30. ఇందులో 141 చదరపు గజాల స్థలం అసెస్మెంట్ నం. 801 మరియు దానిపై ఉన్న ఇంటి నిర్మాణం ఉన్నాయి. సరిహద్దుల మధ్య 141 చదరపు గజాలు లేదా 117.87 చదరపు మీటర్లు విస్తీర్ణం గల స్థలం, అందులో 285 చదరపు అడుగుల ఇంటి నిర్మాణం అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులతో సహా ఉన్నాయి. సరిహద్దులు: తూర్పున పంచాయతీ రోడ్డు, పడమరన కుక్కల బ్రహ్మారెడ్డి గారి ఆస్తి, ఉత్తరాన కుక్కల శ్రీనివాసరెడ్డి గారి మిగిలిన స్థలం, దక్షిణాన పంచాయతీ రోడ్డు. | | |
| (రుణ ఖాతా నం.) 23660000566493, దాసరి ఉమాదేవి (రుణగ్రహీత), దాసరి రాధాకృష్ణ (సహ-రుణగ్రహీత) | 25-నవంబర్-25 రూ. 6,19,993/- ఆరు లక్షల పందొమ్మిది వేల తొమ్మిది వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే 24-నవంబర్-25 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** పర్చూరు S.R.O తేదీ: 21-04-2003న నమోదైన డాక్యుమెంట్ నం. 245/2003 కలిగిన స్థిరాస్తి. బాపట్ల జిల్లా - పర్చూరు సబ్-డివిజన్ - పర్చూరు మండలం - చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధి - చెరుకూరు గ్రామకంఠం, సర్వే నం. 612 - బ్లాక్ నం. 8 - ఉత్తరం వైపున ఉన్న ఇంటి నం. 8-72 గల ఆస్తి. సరిహద్దుల మధ్య 93 చదరపు గజాల విస్తీర్ణం... అన్ని రాకపోకల మరియు అనుభోగ హక్కులతో కూడిన 78.12 చదరపు మీటర్ల స్థలం. సరిహద్దులు: తూర్పున పంచాయతీ బజార్ వైపు 13.6 అడుగులు, పడమరన దాసరి సత్యనారాయణ గారి ఇల్లు వైపు 13.6 అడుగులు, ఉత్తరాన దాసరి మల్లయ్య మరియు ఇతరుల మిగిలిన స్థలం వైపు 62 అడుగులు, దక్షిణాన దాసరి కృష్ణమూర్తి గారి ఇల్లు వైపు 62 అడుగులు. | | |
| (రుణ ఖాతా నం.) 22660001028172, మోపర్తి జోషిల (రుణగ్రహీత), మోపర్తి సత్య భాను ప్రకాష్ (సహ-రుణగ్రహీత) | 12-ఫిబ్రవరి-26 నాటికి రూ. 4,69,823/- నాలుగు లక్షల అరవై తొమ్మిది వేల ఎనిమిది వందల ఇరవై మూడు రూపాయలు మాత్రమే 11-ఫిబ్రవరి-26 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** బాపట్ల జిల్లా - నరసరావుపేట రెవెన్యూ డివిజన్ - బాపట్ల మున్సిపాలిటీ - వార్డు నం. 10, ప్రాంతం నం. 5, పైడిసోన్‌పేట తూర్పు బాపట్ల, డోర్ నం. 671/H1, 72.6 చదరపు గజాల స్థలం మరియు డోర్ నం. 5-2-86/27 గల ఇల్లు మరియు స్థలం. సరిహద్దులు: 72.6 చదరపు గజాల లేదా 60.98 చదరపు మీటర్ల స్థలం మరియు అందులో ఉన్న 560 చదరపు అడుగుల విస్తీర్ణపు ఇల్లు అన్ని రాకపోకల, అమరికల మరియు అనుభవ హక్కులతో సహా. తూర్పున గుంటగాని అనంద్‌పాల్ ఆస్తి, పడమరన గుంటగాని భగవాన్ దాస్ ఆస్తి, ఉత్తరాన గుంటగాని భగవాన్ దాస్ ఆస్తి మరియు మున్సిపల్ రోడ్డు, దక్షిణాన గుంటగాని కోటయ్య ఆస్తి. | | |
| (రుణ ఖాతా నం.) 24660001035094, తిక్కడ గోపి (రుణగ్రహీత), తిక్కడ దేవుడమ్మ (సహ-రుణగ్రహీత) | 05-జనవరి-26 రూ. 5,07,351/- ఐదు లక్షల ఏడు వేల మూడు వందల యాభై ఒక రూపాయలు మాత్రమే 03-జనవరి-2026 నాటికి | 13-ఆగస్టు-26 |
| **తనఖా పెట్టిన ఆస్తి వివరణ** బాపట్ల జిల్లా - బాపట్ల R.D. - బాపట్ల R.O. - అదవి గ్రామ పంచాయతీ - అదవి గ్రామం, డోర్ నం. 578/2A - 121 చదరపు గజాల స్థలం - డోర్ నం. 2-236/13, అసెస్‌మెంట్ నం. 1423 గల ACC ఇల్లు మరియు స్థలం. ఈ సరిహద్దుల మధ్య 121 చదరపు గజాల లేదా 101.64 చదరపు మీటర్ల స్థలం ఉంది; ఇందులో అన్ని ఫిక్చర్లు మరియు అనుబంధ హక్కులతో కూడిన 210 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ACC ఇల్లు ఉంది. దీని కొలతలు తూర్పు-పడమర దిశలో 20.5 అడుగులు మరియు ఉత్తర-దక్షిణ దిశలో 24.5 అడుగులు; మొత్తం విస్తీర్ణం 502.25 చదరపు అడుగులు అందులో ఉన్న ప్రస్తుత మరియు భవిష్యత్తు నిర్మాణాలతో సహా. సరిహద్దులు: తూర్పున పంచాయతీ రోడ్డు, పడమరన తిక్కడ దేవుడమ్మకు చెందిన మిగిలిన స్థలం, ఉత్తరాన అవినిగడ్డ లక్ష్మీనారాయణ ఇంటి స్థలం, దక్షిణాన పంచాయతీ రోడ్డు. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002లి సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది"

ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 18/08/2026 — సం/- అధీకృత అధికారి
స్థలం : గుంటూరు / బాపట్ల, ఆంధ్రప్రదేశ్ — AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

19-8pg4_19-8pg4.qxd 18/Aug/26 10:31 PM Page 1



వార్త

మారణాయుధాలు మనల్ని నాశనం చేయకముందే మనం వాటిని నాశనం చేయడం మంచిది.

న- జాన్ కెనడీ


# కలగూరగంపలో కాలకూటం!

సంపూర్ణ ఆరోగ్యానికి బాసటగా ఉంటాయనుకున్న ఆకు కూరల్లో పురుగు మందుల్లోని రసాయనిక అవశేషాలున్నాయంటే ఒకేసారి గుండె గుభేల్‌మంటుంది. రోజువారీ భోజనంలో వండి వడ్డించుకునే ఆధరువుల్లో ఏదో ఓ కూరగాయ ఉడికించి తాళింపు వేసేవే. ఏ కూరగాయ ఎలా వండినా శరీరానికి పుష్టిచేకూర్చేవని నమ్ముతాం. టమోటాలు, వంకాయలు, క్యారెట్, క్యాబేజి, కేరట్, బీట్‌రూట్ ఏవి తిన్నా ఎన్నో పోషకాలున్న పౌష్టికాహారాన్ని తింటున్నామని భుక్తాయాసంతో తృప్తిపడతాం. తీరా వాటిల్లో పురుగు మందుల తాలూకు రసాయనిక అవశేషాలున్నాయని తెలిస్తే ఆరోగ్య బెంగ తప్పదు. తాజాగా లోక్‌సభలో తెలుగు రాష్ట్రాల్లో భారీగా పురుగు మందుల వాడకం, అదే మాదిరిగా ఇక్కడ పండించే కూరగాయల్లో రసాయనిక అవశేషాలను గురించి వివరించారు. పంట ఏదైనా, శాస్త్రజ్ఞులు వాటితో నిమిత్తం లేకుండా 'అధిక పురుగు మందు వాడకంతో అత్యధిక దిగుబడి' వస్తుందన్న ఆశతో ఎక్కువ మోతాదులో ఎరువులు,పురుగుమందులు వాడతారని అపప్రధ ఉండనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2,104 నమూనాల పరిశీలనలో 134 నమూనాల్లో అధిక రసాయనిక అవశేషాలున్నాయి. అంటే 6.36 శాతం. తెలంగాణ నమూనాలు 8198లో 486 శాంపిళ్లలో అధిక మోతాదు పురుగుమందులు కనిపించాయి. 5.92శాతం అని గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు హరియాణ నమూనాల్లో 6.41 శాతం అవశేషాలున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఒక్కదానిలో కూడా ఎలాంటి అవశేషాలు లేవు. 2005 నుంచి జాతీయ స్థాయిలో పురుగుమందుల అవశేషాల అన్వేషణ ప్రాజెక్టు ఉంది. ఏటా తమకు అందిన నమూనాల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సంస్థ ఏ మేరకు పురుగుమందుల అవశేషాలున్నాయో పరిశోధనల్లో తెలుస్తోంది. నమూనాలను సేకరించి అవశేషాలను బట్టబయలు చేయడం ఒక ఎత్తయితే పంటలకు పట్టిన తెగుళ్లను అక్కడికక్కడ విశ్లేషించి వ్యవసాయ సూచనలు చేసే ఒక ప్రత్యేక యంత్రాంగమూ ఉంటుంది. 2023 నుంచి 2026 వరకు దేశం మొత్తం మీద 70,652 పండ్లు కూరగాయల నమూనాలను పరీక్షించగా 2223 నమూనాల్లో మాత్రమే ఎఫ్‌ఎస్‌ఎఎస్‌ఐఎస్ ప్రమాణాల సంస్థ నిర్దేశిత పరిమితి కన్నా అధిక పురుగుమందుల అవశేషాలున్నట్లు గుర్తించింది. అంతేకాదు దీర్ఘకాలికంగా నిలువ ఉండిపోయే సేంద్రియ కాలుష్య కారకాలు, కొన్ని సందర్భాల్లో భారీలోహాలు ఉన్నట్లు బయటపడింది. ఇలాంటివే 'ఆహార భద్రత, ఆరోగ్య రక్షణ' వంటిఅంశాల్లో అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఒక వ్యక్తి ప్రతిరోజూ ఏదో విధంగా తక్కువ మోతాదులో వచ్చి చేరే కలుషిత ఆహారం దీర్ఘకాల దుష్ప్రయోజనం గురించి తప్పనిసరిగా తెల్చుకోవాలి. అప్పుడే మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతాడు. పరిస్థితులు చెయ్యిదాటక ఎవరూ ఏమీచేయలేరు. పురుగుమందుల్లో అవశేషాల వలన నాడీవ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులపై చెడు ప్రవాహం కన్పిస్తుంది. ఆ తర్వాత వైద్యచికిత్సలకు శరీరం లొంగకపోతే ఇక మంచమే గతి. కొన్ని రసాయనాలు కేన్సర్, హార్మోన్‌ల అసమతుల్యత, రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీయడం వంటి అనారోగ్య సమస్యలు తెచ్చిపెట్టవచ్చు. అందుకే అన్ని సందర్భాల్లోనూ సురక్షిత వ్యవసాయానికి ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు, రసాయనిక అవశేషాలు మిగలకుండా చూసే శాస్త్రీయ విధానాలను అనుసరించాల్సి ఉంది. విత్తనం నుంచి వినియోగదారునికి సాగు ఉత్పత్తులు చేరేవరకు ప్రజారోగ్య విశ్లేషణ ప్రణాళికలు ఉండాలి. రసాయన కాలుష్యం కేవలం పురుగుమందుల పిచికారీ వల్లనేరాకపోవచ్చు. కలుషిత నీటితో సాగుకూడా మంచిది కాదు. భూమిలోకి పారిశ్రామిక వ్యర్థాలుచేరడం, మురుగునీటి వాడకం, కాలుష్యభరిత మట్టిలో పంటలు పండించడం వలనకూడా కూరగాయలపై కలుషిత ప్రభావం ఉంటుంది. పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులు విచక్షణారహితంగా వాడే సింథటిక్ పురుగు మందులు కూడా వాడడంతో కలుషిత అవశేషాలు ఉండే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం అవశేషపు నమూనాల్లోసగం దక్షిణ భారతంలోని ఐదురాష్ట్రాల నుంచే కావడం ఆందోళనకరం. ఉండాల్సిన గరిష్ట పురుగు మందు పరిణామం (ఎం.ఆర్.ఎల్) ఎక్కువగా ఉంటే మానవ ఆరోగ్యానికి తీవ్రహాని కలిగిస్తుంది. ఆంధ్ర, తెలంగాణ మార్కెట్‌లలో విరివిగా లభించే వంకాయ, బెండ, టమాటా, క్యాప్సికం, ద్రాక్షలలో మోనోక్రోటోఫాస్, క్లోరోపైరిఫాస్, ప్రొఫెనోఫాస్‌లుంటాయి. ఇలాంటి అవశేషాలు తరచు మనం తినే కూరగాయల్లో ఉంటే, పది పదిహేనేళ్లలో దాని చెడు ప్రభావం 'స్లో పాయిజన్' రూపంలో శరీరానికి చేరుతుంది. సాధారణంగా నిర్దిష్ట గడువులో మందులు వాడాక పంటకోత కోస్తే, సమయంచూసుకుని కోతకు దిగాలి. అవేమీ పాటించకుండా మందు కొట్టిన వెంటనే కోతలు కోస్తే తప్పనిసరిగా అవశేష నమూనాలు వాటిని ఆశించి ఉంటాయి. దేశం ఆహార భద్రతలోనే కాకుండా విషరహిత ఆహారాన్ని వినియోగదారునికి అందించడంలోకూడా ముందడుగు వేయాలని లేకుంటే ఆరోగ్యానికి అన్నీ అనర్థాలేనని చెప్పడం తప్పదు. విషయం ఈనాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్ నుంచి వచ్చిన కూరగాయలను వంట కోసం స్వీకరించినప్పుడు ఆ కూరలను ఉప్పునీళ్లలో లేదా బేకింగ్ సోడా నీళ్లలో పదినిమిషాలు నానబెట్టి ఆ తరువాత కడిగి వంటకు ఉపక్రమించడం ముఖ్యం. తోటల్లో స్ప్రే చేసే రైతులు కూడా దాని ప్రభావం మీద పడి కేన్సర్ వంటి రోగాలకు గురవకుండా చూసుకోవాలి. అప్పుడే రైతుకు, రైతు పండించే ఉత్పత్తులకు, వాటిని వండుకునే వినియోగదారులకు ఆరోగ్య రక్ష కాగలదు.

> రచయిత మేధావిలా ఆలోచించాలి కానీ సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.
>
> అరిస్టాటిల్



> గొప్ప గొప్ప వివాదాలను పరిష్కరించగలిగేది సమర్థులు లేదా వ్యతిరేకులు మాత్రమే, తటస్థులు కాదు.
>
> సిసిరో



# భారత్ ఆచితూచి అడుగులు వేయాలి

**పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్‌పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలావరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులు వేయాలి. మన చుట్టూ ముప్పుపొంచి ఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి. భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగా ఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభం వలన ఆర్థికంగా నష్టపోతున్న విషయం విదితమే. యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏ సంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలను బట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి.**



సుంకవల్లి సత్తిరాజు

బలూచిస్తాన్ స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఇక ఇతర దేశాల గుర్తింపే మిగిలి ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ కల్లోలంగా మారింది. పిఓకే పాక్ నుండి విడిపోవడానికి సిద్ధంగా ఉంది. పాక్ పాలకుల పట్ల, మిలటరీ వ్యవస్థ పట్ల అక్కడి ప్రజల్లో కోపాగ్ని కట్టలు తెంచుకుంది. ఇవన్నీ భారత దేశానికి సానుకూల అంశాలైనప్పటికీ, ఈ అవకాశాలను ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ వినియోగించుకుంటుందా? లేక మరికొంత కాలం వేచిచూస్తుందా అనే విషయంలో స్పష్టత రావలసి ఉంది. జంతర్ మంతర్‌లో సిజెపి సాగించిన ఉద్యమం తర్వాత భారత ప్రభుత్వంఎఫ్‌సిఆర్‌ఏ, మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశ పెట్టకుండా వాయిదా వేసింది. విదేశీ విరాళాలకు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఏ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని నిర్ణయించింది. ఒకవైపుఅంతర్జాతీయ ఒత్తిళ్లు, మరోవైపు ప్రతిపక్షాల నిరసనలు, ఇంకోవైపు జన్ జి హెచ్చరికలతో కేంద్రప్రభుత్వం కొంత ఇరకాటంలో పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పాక్ విషయంలో సంయమనం పాటిస్తుందా?అనే అంశం ప్రస్తుతానికి సందిగ్ధంలోనే ఉంది. ఒకవైపు ఇరాన్ యుద్ధం వలన ఏర్పడిన ఇంధన కొరత వలన దేశం ఆర్థికంగా సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశం అనేక బాలారిష్టాలను అధిగమించి, వివిధ రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక, అణు, ఆయుధ, రక్షణ రంగాలు బలోపేతమైనాయి. అయితే శత్రుశేషం మిగిలేఉంది. అమెరికా, చైనా, పాక్, బంగ్లాదేశ్ వంటి దేశాల వైఖరి వలన భారత్ అనేక అవరోధాలు ఎదుర్కొంటున్నది. దేశంలో ఇంకా పేదరికం పోలేదు. ఆర్థిక అంతరాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉపాధి అవకాశాల కోసం యువత నానా అగచాట్లు పడుతున్నది. చమురు రంగం భారత్ ఆర్థిక పరిస్థితిని శాసిస్తున్నది. అమెరికా భారత్‌పై అసూయా ద్వేషాలతో రగిలిపోతున్నది. డ్రాగన్ తన రణవ్యూహాలకు పదును పెడుతున్నది. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న దాయాది దేశం తన భూభాగాలను చైనాకు విక్రయించడానికి ప్రయత్నిస్తుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిన చందంగా పాక్ వైఖరి దారుణంగా మారింది. సీమాంతర ఉగ్రవాదం ప్రోత్సహిస్తూ, కాశ్మీరంలో కల్లోలం సృష్టించిన పాక్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తగిన గుణపాఠం చెప్పడం ద్వారా ప్రపంచ దేశాలకు భారత్ ఆయుధ సామర్థ్యం తెలియవచ్చింది. అమెరికా, చైనా ఆయుధాల పేలవమైన ప్రదర్శన కూడా ఆయా దేశాల ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలను పునరాలోచనలో పడేశాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. పాకిస్థాన్‌కు అండగా నిలబడుతూ, వివిధ రకాలుగా భారత్ వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నది. ట్రంప్ భారత్‌పై ప్రదర్శిస్తున్నఅక్కసు వలన భారత్ ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లవలన భారత వాణిజ్యం గందరగోళంలో పడింది. ట్రంప్ ట్రేడ్ పాలసీ, టారిఫ్‌లు, వీసా నిబంధనలను పరిశీలించి, విశ్లేషించిన తర్వాత భారత్ ఇక ఏ మాత్రం అమెరికాపై ఆధారపడకూడదన్న ఆలోచనభారత ప్రభుత్వానికి స్ఫూరించే ఉంటుంది. ఇంధన రంగంలో ఏర్పడిన సంక్షోభం దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా భారత్ స్వయం సమృద్ధి సాధించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. భారత్‌కు రష్యాతోగల వాణిజ్య, స్నేహ సంబంధాలు అమెరికాకు ఇష్టం లేదు. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధానికి అమెరికా, నాటో దేశాలే కారణం. అయితే



అమెరికా ఈ విషయంలో భారత్‌పై అకారణ నింద మోపడం హాస్యాస్పదం. రష్యా, ఉక్రెయిన్ల మధ్య గత నాలుగున్నరేళ్లుగా యుద్ధం కొనసాగడానికి అమెరికాతో పాటు, ఇప్పుడు అమెరికాను విమర్శిస్తున్న నాటో కూటమి అందించిన ఆయుధ, ఆర్థిక సహకారమే కారణం. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి రష్యానుండి భారత్ అధిక మొత్తంలో క్రూడాయిల్ దిగుమతి చేసుకుని, రష్యాకు ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, అందువలనే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం చేయగలుగుతున్నదని అమెరికా వితండవాదం చేయడమే కాకుండా భారత్ ఉత్పత్తులపై 100శాతం సుంకాలు విధిస్తూ అమెరికా సెనేట్ భారీ మెజారిటీతో తీర్మానం ఆమోదించడం విడ్డూరం. ట్రంప్, మోడీలు మంచి స్నేహితులు కాబట్టి ఈటారిఫ్‌లపై వారే మాట్లాడుకుంటారని ట్రంప్ సలహాదారులు వ్యాఖ్యానించడం కొసమెరుపు. భారత్ అమెరికాల మధ్య ట్రేడ్‌డీల్ అమల్లోకి వస్తే సెనేట్ ఆమోదించిన తీర్మానానికి విలువ ఉంటుందా? ఇరాన్ పై యుద్ధం ప్రకటించి, తమకు గల ఆయుధ నిల్వలను ఖాళీచేస్తూ, ఆర్థికంగా దివాలా తీసిన అమెరికాకు ఇతర దేశాల వ్యవహారాల్లో తల దూర్చితే ఏం జరుగుతుందో ఇరాన్ యుద్ధ ఫలితాలు నిరూపించాయి. ఇరాన్ చేతిలో భంగపడి, చేతులు కాల్చుకున్న అమెరికా ఒకవైపు మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ, మరోవైపు ఇరాన్‌ను బుజ్జగించి, శాంతి ఒప్పందానికి పాక్ లాంటి దేశాల మధ్యవర్తిత్వం కోసం ఆర్థికసహాయం చేస్తూ, అంతర్జాతీయంగా అపకీర్తి మూటగట్టుకుంది. భారత్ పై అమెరికా పగబట్టి, ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తుంటే, భారత్‌కు చైనా మరోవైపు పొగబెడుతున్నది. చైనా బ్రహ్మపుత్ర నదిపై 14 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలో అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నది. జల విద్యుత్ ప్రాజెక్టు పేరుతో చైనా నిర్మిస్తున్న ఈ డ్యామ్ వలన భారత్ ఈశాన్య రాష్ట్రాలకు నీటి సరఫరా చేయకుండా నిలిపి వేయడం, వరదలు సంభవిస్తే ఈ ప్రాంతాలను ముంపుకు గురిచేసే దురుద్దేశ్యం ఇందులో దాగివుంది. భారత్ పాక్‌కు సింధు జలాలను నిలిపివేయడం వలన పాక్‌లో నీటి సంక్షోభం ఏర్పడగా మరోవైపు, పాక్‌ఆక్రమిత కాశ్మీర్, బలుచిస్తాన్ ప్రాంతాల్లో అంతర్యుద్ధం చెలరేగింది. త్వరలో బ్రిక్స్‌దేశాల సమావేశం భారత్‌లో జరగనున్న దృష్ట్యా భవిష్యత్ అవసరాలదృష్ట్యా చైనా దేశం భారత్ పట్ల సానుకూల వైఖరి ప్రదర్శిస్తుందా? అమెరికాకు వ్యతిరేకంగా భారత్‌తో చేతులు కలుపుతుందా? అనే విషయంలో ఒక స్పష్టమైన సంకేతం వెలువడే అవకాశముంది. ఏదిఏమైనప్పటికీ పొరుగు దేశాల వలన భారత్‌కు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 'యు కెన్ ఛేంజ్ ఫ్రెండ్స్ బట్‌నాట్ నైబర్స్' అంటూ అప్పటి మన ప్రధాని వాజ్ పేయి చెప్పిన మాటలు అక్షరసత్యాలు. ఈ వాస్తవం వర్తమాన భారతంలో జరుగుతున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఒకప్పుడు పాక్ ఆగడాలు, అలసత్వం, నియంతృత్వం భరించలేక భారత్ శరణు జొచ్చి, తూర్పు పాకిస్థాన్‌ను 'బంగ్లాదేశ్' ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడంలో భారత్ చేసిన కృషిని నేడుఅక్కడి పాలకులు, యువత మరచిపోవడం దురదృష్టకరం. చైనా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్ దేశాలతో భూ సరిహద్దులను పంచుకుంటున్నభారత్‌కు చైనా, పాక్, బంగ్లాదేశ్‌లతో ప్రస్తుతం బద్ధవైరం నెలకొని ఉంది. భారత్‌తో సముద్ర సరిహద్దులు గల శ్రీలంక, మాల్దీవులతో గతంలో కొన్ని విభేదాలుతలెత్తి ప్రస్తుతం సద్దుమణిగాయి. ఇప్పుడు శ్రీలంక భారత్‌తో సఖ్యంగానే ఉంటున్నా భారత్‌కు జరగవలసిన అనర్థ ఇప్పటికే జరిగిపోయింది. ఇక పొరుగునున్న నేపాల్‌లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా భారత్ పై వాటి విదేశాంగ విధానం కూడా మారుతున్నది. ఇస్లామిక్ దేశాల్లో చాలా వరకు మనకు అనుకూలత ఉన్నా, ఇతర దేశాల కుట్రలతో ఆయా దేశాలు ఎప్పుడెలా మారతాయో తెలియదు. ఇస్లామిక్ నాటో పట్ల కూడా భారత్ ఆచితూచి అడుగులువేయాలి. మన చుట్టూ ముప్పుపొంచిఉంది. సరికొత్త వ్యూహాలతో, భారత్‌ను రక్షణపరంగా శత్రు దుర్భేద్యంగా మార్చాలి. భారత్ సాంకేతికంగా, ఆయుధపరంగానూ బలీయమైన శక్తిగాఎదిగినప్పటికీ మధ్య ప్రాచ్యంలో గతకొన్ని నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాలు, ఆయిల్ సంక్షోభంవలన ఆర్థికంగా నష్టపోతున్న విషయంవిదితమే. యుద్ధాల అంచుల్లో పయనిస్తున్న ప్రపంచంలో ఎప్పుడు ఏసంక్షోభం తలెత్తుతుందో ఊహించలేం. వర్తమాన అంతర్జాతీయ పరిణామాలనుబట్టి భారత్ ఆచితూచి అడుగులువేయాలి. ●

# కోర్టులలో 5.74 కోట్లు దాటిన పెండింగ్ కేసులు!



శిరందాసు నాగార్జున

దేశంలోని న్యాయస్థానాలలో కోట్ల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. 2022 జూన్ నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో దాదాపు4.83 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వంవెల్లడించింది. ప్రస్తుతం దేశం మొత్తం కోర్టులలో పెండింగ్ కేసులు 5.74 కోట్లు దాటిపోయాయి. ఒక్క సుప్రీంకోర్టులోనే పెండింగ్ కేసులసంఖ్య 95 వేలు దాటింది. సాక్షుల గైర్హాజరు కావడం, సరైన సమయానికి ఆధారాలు అందకపోవడంతో కేసుల విచారణ ప్రక్రియ క్లిష్టంగా మారింది. లోక్ అదాలత్‌ల నిర్వహణ ద్వారా రాజీ పడదగిన కేసులను త్వరగా పరిష్కరించడం, ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయడం, ఈకోర్టుల ప్రాజెక్ట్ ద్వారా డిజిటల్ విధానంలో స్పీడ్ పెంచడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా కేసుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. జడ్జిల పోస్టులు ఖాళీగా ఉండటం కూడా ఒక కారణం. నేషనల్ జ్యుడిషియల్ డేటా ప్రకారం ఈ ఏడాది ఆగస్ట్ 17వ తేదీనాటికి దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు, రాష్ట్రాలలోని ఇతర కోర్టులలో సివిల్ కేసులు 1,58,54,896ఉండగా, క్రిమినల్ కేసులు 4,15,76,022ఉన్నాయి. మొత్తం 5,74,30,918 పెండింగ్ కేసులున్నాయి. ఇందులో 30ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టులో సివిల్ కేసులు 73,915, క్రిమినల్ కేసులు 21,653, మొత్తం 95,568 పెండింగ్ కేసులున్నాయి. రిజర్వ్ చేసిన తీర్పుల వెల్లడిలో కూడా హైకోర్టులలో తీవ్ర జాప్యం జరగడం పట్ల సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో విచారణలు, తీర్పుల వెల్లడిలో జాప్యం నివారించేందుకు సుప్రీం కోర్టు చర్యలు చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కల్పించిన విశేషఅధికారాలను ఉపయోగించి న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా, జాప్యం తగ్గించేలా పలు అంశాలపై అన్ని హైకోర్టులకు సుప్రీం కోర్టు కొన్ని సూచనలుచేసింది. సీజెఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బగ్చిలతో కూడిన ధర్మాసనం మే 29న కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఝార్ఖండ్‌కు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ సూచనలు చేసింది. రిజర్వ్‌చేసిన తీర్పులు గరిష్ఠంగా 3నెలల్లోపు వెలువరించాలి. తీర్పు ధృవీకరించిన కాపీలో తీర్పును రిజర్వ్ చేసిన తేదీ, తీర్పును ప్రకటించిన తేదీ, తీర్పును అప్‌లోడ్ చేసిన తేదీని పేర్కొనాలి. సవివరమైన తీర్పును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు, పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు ఇమెయిల్/ ఎస్ఎంఎస్ ద్వారా పంపాలి. బెయిల్ పిటిషన్లపై ఉత్తర్వులు అదే రోజు ప్రకటించి, అప్‌లోడ్ చేయాలి. బెయిల్ ఉత్తర్వులు రిజర్వ్‌చేస్తే మరుసటి రోజే ప్రకటించాలి. బెయిల్ లేదా శిక్ష సస్పెన్షన్ ఉత్తర్వులు వెంటనే అధికారులకు తెలపాలి. ఖైదీల విడుదల సాధ్యమైనంత వరకు అదేరోజు, లేకపోతే మరుసటిరోజు జరగాలి. బెయిల్ ఉత్తర్వుల అమలుపై ట్రయల్ కోర్టు హైకోర్టుకు నివేదిక ఇవ్వాలి. కస్టడీలో ఉన్న అప్పిలెంట్ల కేసుల్లో 7 రోజుల్లోపే అదనపు వివరణలు కోరవచ్చు. ఇక అత్యవసర కేసు (కూల్చివేతలు, బహిష్కరణలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, బెయిల్ తదితరాలు)ల్లో కేవలం ప్రధాన నిర్ణయం (ఆపరేటివ్ ఆర్డర్) ముందుగా ఓపెన్ కోర్టులో ప్రకటించినా, దానికిగల పూర్తికారణాలతో తీర్పును సాధారణంగా 7రోజుల్లోపు, అసాధారణ పరిస్థితుల్లో 15రోజుల్లోపు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలి. ప్రకటించిన తీర్పు 24గంటల్లోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పెండింగ్ రిజర్వ్ తీర్పులపై ప్రతి నెల ఆటోమేటెడ్ ఇమెయిల్ పంపాలి. 2 నెలలు దాటిన పెండింగ్ తీర్పులను జడ్జిల దృష్టికి తీసుకెళ్లాలని లాయర్లకు సూచన చేశారు. 3 నెలల్లో తీర్పురాకపోతే కేసు చీఫ్ జస్టిస్ దృష్టికి వెళ్లాలి. మరో 2 వారాలు ఆలస్యమైతే కేసును వేరే బెంచ్‌కు బదిలీ చేసే అవకాశం ఉంటుంది. 3 నెలలైనా తీర్పురాకపోతే పక్షాలు దరఖాస్తు చేసుకోవచ్చు. 4 నెలలు గడిచినా తీర్పురాకపోతే బెంచ్ మార్పు కోరే హక్కు పక్షాలకు ఉంటుంది. రిజర్వు చేసిన తీర్పులు వెలువరించడంలో జరిగే జాప్యాన్ని తగ్గించి న్యాయ ప్రక్రియలో వేగం పెంచాలన్నది సుప్రీంకోర్టు భావన. హైకోర్టు, దిగువ కోర్టులలో ఈసూచనలు పాటిస్తే, తీర్పుల వెల్లడిలో జాప్యం జరగదు. విచారణ ప్రక్రియ వేగంగా జరిగేలా నూతన ఆలోచనలతో, సుప్రీంకోర్టు రూపొందించవలసిన అవసరంఉంది. ●

# ప్రజావాక్కు



## ప్రత్యక్ష పెట్టుబడులు రావాలి

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, దాని పూర్తి సామర్థ్యాన్ని అందిపుచ్చుకోవడానికి కొన్ని నిర్మాణాత్మక అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉంది. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ ప్రస్తావించిన నియంత్రణ పరమైన అవరోధాలు, వాణిజ్య విధానసవాళ్లు, పెట్టుబడులకు ఎదురవుతున్న ఇబ్బందులు ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విదేశీ సంస్థలు భారత్‌లో భౌతికంగా వ్యాపారాలను స్థాపించేందుకు ఇంకా అనేక అనుమతులు, నిబంధనలు దాటాల్సి వస్తోంది. విదేశీ పెట్టుబడులు అధికంగా ప్రైవేట్ ఈక్విటీ రూపంలోకి మళ్లడం కంటే ఉత్పాదక రంగాల్లో ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగేలా వాతావరణాన్ని సులభతరం చేయాలి. ఇందుకోసం వ్యాపార నిబంధనలను సరళీకరించడం, అనవసరమైన అనుమతులను తగ్గించడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కృత్రిమ మేధ ఎగతాళి కాకూడదు!

ఈ మధ్య కాలంలో సామాజిక మాధ్యమాలు సమాజ శ్రేయస్సును నాశనంచేసే వేదికగామారుతుండటం చాలా దురదృష్టకరం. మహాత్మాగాంధీ సిగరెట్‌పట్టుకుని నాట్యం చేస్తున్నట్లుగా ఒక కృత్రిమ మేధ వీడియోను ప్రచారం చేసి జాతిపితను అవమానిస్తున్నారు. గణేష్ చతుర్థి, రాఖీ పండుగ, ఆయుధపూజ, క్రిస్మస్, స్వాతంత్ర్య దినోత్సవం వంటి ప్రతి మత, జాతీయవేడుకను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నట్లుగా రకరకాలుగా వీడియోలు వైరల్ అవుతున్నాయి. ప్రతి వేడుకకు, సంప్రదాయానికి దానికంటూ ఒక చరిత్ర ఉంటుంది. దానిని ఎగతాళి చేసి వికృతమైన ఆనందాన్ని పొందడం ఎంతవరకు సబబు? ఈ ధోరణిని అరికట్టడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## మనశ్శాంతిలో ఆత్మానుభూతి

మనశ్శాంతి అనేది బయట ఎక్కడో దొరికేది కాదు. మన ఆలోచనల్లో, మన దృక్పథంలో, మననిర్ణయాల్లో ఉంటుంది. అందుకే కొన్నిమార్చుకోవాలి. కొన్ని మర్చిపోవాలి. కొన్ని వదులుకోవాలి. కొన్ని వదిలేయాలి. అప్పుడు మనసు తేలికఅవుతుంది. జీవితం ప్రశాంతంగా మారుతుంది. గతం పాఠంగా మిగులుతుంది. వర్తమానం ఆనందంగా మారుతుంది. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. ఇదే నిజమైన మనశ్శాంతి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## ఇదేనా పారదర్శక పాలన?

ఏపీ అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబాల ప్రభుత్వ భూ ఆక్రమణలపై చర్చజరపాలి. గాలిరకాలు, పోరంబోకు వెధవలు బాబాలుగా, స్వాములవార్లుగా వేషాలు వేసినవాళ్లకు మన వాళ్ళు సాష్టాంగపడుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినా మంత్రులు అధికారులు పట్టించుకోవటం లేదు. క్విడ్ ప్రోకోనాఏమో. అసెంబ్లీలో చర్చించాలి. మంత్రాలు మహిమలు అనేవి ఈ విశ్వంలో లేవు. ఈబాబాలు తమ మహిమల వలన మన జీవితాలు బాగుపరుస్తారని చాలామంది వీరీ వద్దకు వెళ్ళి దాసోహం అంటారు. వీరి బలహీనతలను ఆధారం చేసుకొని ఈ దొంగలు రకరకాలుగా మోసం చేస్తుంటారు. ఇలాంటివారిని ది డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీ యాక్ట్ 1954 కింద అరెస్ట్ చెయ్యాలి. కానీ చెయ్యరు. ఎందుకంటే 'క్విడ్ ప్రోకో' నేను నీకు ఇది ఇస్తాను నువ్వు నాకు అది ఇవ్వు. జగన్ తెచ్చిన కొత్త పదం. అసెంబ్లీ సమావేశాలలో దొంగ బాబా భూ ఆక్రమణలపై చర్చలు జరపాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## తీరు మారాలి

హోటల్‌లో రుచికరమైన ఆహారంతినాలని అందరికీ ఉంటుంది. కానీ ఆ ఆహారం ఎంతపరిశుభ్రంగా తయారవుతోంది, ఉపయోగించే పదార్థాలు తాజాగా ఉన్నాయా అనే విషయాలను కూడా గమనించాలి. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణంలో, నిల్వ చేసిన పదార్థాలతో ఆహారం తయారవుతోంది. ఆహార తనిఖీలు జరుగుతున్నా, మంచినాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెబుతున్నా, కొందరి తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. కల్తీ పూర్తిగా తగ్గాలంటే హోటళ్ళ, రెస్టారెంట్ల యాజమాన్యాలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. వంట గదిని శుభ్రంగా ఉంచి, నాణ్యమైన తాజాపదార్థాలతో ఆహారం తయారు చేయాలి. ప్రజలు హోటల్‌కు వెళ్లినప్పుడు పరిసరాలతో పాటు పరిశుభ్రతను గమనించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పేదరికాన్ని జయిద్దాం


మన నిత్య జీవితంలో బాల్య జీవితం నుండి మొదలుకొని ఒక వయస్సు అనుకోని ఆటుపోట్లు నిరంతరం ఎదురవుతూనే ఉంటాయి. అనుకున్న లక్ష్యంపై ఏకాగ్రతతో కూడిన కఠోర సాధన చేస్తేనే జీవితం మెరుగ్గా ఉంటుంది. ఎలాంటి ఆటు పోట్లు ఎదురైనావెనకడుగు వేయకుండా ముందుకు సాగుతూ కుటుంబానికి అండగా ఉంటూ పది మందికి సాయం చేసే జీవితం గడపాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్


మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# యుపిఐ ఉచిత సేవల నుండి సుస్థిర భవిష్యత్తు వైపు



రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఆధునిక సాంకేతిక సాధంగామలిచి, నగదు రహిత లావాదేవీలలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ నేడు ఒక కీలక చారిత్రక ఘట్టానికి చేరింది. దేశంలోని కోట్లాది మంది ప్రజల దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిన ఈ డిజిటల్ మౌలిక వసతిని మరింత సమగ్రంగా నియంత్రించేందుకు, అవసరమైతే నామమాత్రపు సేవా రుసుములు లేదా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే చట్టబద్ధమైన అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తూ లోక్‌సభ ఇటీవల కీలక చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం ఆర్థిక వర్గాల్లోనూ, సామాన్య ప్రజానీకంలోనూ విస్తృత చర్చకు తెరలేపింది. అయితే, ఈ చట్ట సవరణ ఆమోదం పొందినంత మాత్రాన తక్షణమే యూపీఐ ద్వారా జరిగే ప్రతి లావాదేవీపై ఛార్జీలు అమల్లోకి వస్తాయనుకోవడం పూర్తిగా అపోహ మాత్రమే. 2016 ఏప్రిల్ మాసంలో భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) కేవలం 21 భాగస్వామ్య బ్యాంకులతో, అత్యంత సాధారణ డిజిటల్ వేదికగా యూపీఐ వ్యవస్థను ప్రారంభించింది. అప్పట్లో ఇది బ్యాంకుల మధ్య నగదు బదిలీ చేసే ఒక సరళమైన సాధనంగా మాత్రమే పరిగణించబడింది. కానీ, 2016నవంబర్‌లో జరిగిన నోట్లరద్దు, అనంతరం వేగవంతమైన స్మార్ట్‌ఫోన్, చౌకైన ఇంటర్నెట్ విప్లవం యూపీ ఐకి అపారమైన ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టాయి. క్రమంగా కూరగాయల విక్రేతలు, తేనీటి కొట్టు యజమానుల నుంచి మొదలుకొని బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఆసుపత్రి ఖర్చులు, ప్రభుత్వ పన్నుల చెల్లింపుల వరకు సమస్త ఆర్థిక వ్యవహారాలకు యూపీఐ ప్రాథమిక చోదక శక్తిగా మారింది. నేడు నెలకు సుమారు 1,300 కోట్లకు పైగా లావాదేవీలు రూ. 20లక్షల కోట్లకు పైబడిన విలు వతో జరుగుతుండటం, ప్రపంచవ్యాప్తంగా నమోదు అవు తున్న మొత్తం రియల్‌టైమ్ డిజిటల్ చెల్లింపులలో ఏకంగా 46శాతానికి పైగా వాటాతో భారతదేశం అగ్రస్థానంలో నిల వడం యూపీఐ సాధించిన అనన్యసామాన్యమైన విజయా నికి అద్దం పడుతోంది. యూపీఐ ఈ స్థాయిలో ప్రజాదరణ పొందడానికి విశ్వవ్యాప్త వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం వినియోగదారులు, వ్యాపారులపై ఎటువంటి ప్రత్యక్ష సేవా రుసుములు లేకపోవడమే. డిజిటల్




లావాదేవీలను ప్రోత్స హించడం, పారదర్శక ఆర్థిక వ్యవస్థను నిర్మించడం నగదు చలామణిని తగ్గించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం2020 జనవరి 1వ తేదీ నుండి యూపీఐ రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై 'జీరోఎండీఆర్' విధానాన్ని అమల్లోకితెచ్చింది. సాధారణంగా క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్ స్వైపింగ్ మెషిన్ల ద్వారా జరిగే చెల్లింపులపై వ్యాపారులు 1 నుండి 2 శాతం వరకు ఎండీఆర్ రుసుమును బ్యాంకులకు చెల్లించాల్సి ఉండేది. కానీ, యూపీఐ విషయంలో ఈ రుసుమును పూర్తిగా రద్దు చేయడంతో చిన్నవ్యాపారులు సైతం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా క్యూఆర్ కోడ్‌లను స్వీకరించారు. ఈ ఉచిత సేవల వల్ల వ్యవస్థకు కలిగిన నష్టాన్ని భర్తీ చేసేం దుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా బడ్జెట్‌లో రూ. 1,500కోట్ల నుండి రూ.3,000కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను బ్యాంకులకు, ఫిన్‌టెక్ సంస్థలకు కేటాయిస్తూ వస్తోంది. అయితే, లావాదేవీల సంఖ్య పరిమాణం ఏటికేడు ఊహించని రీతిలో పెరిగిపోవడంతో, ఈవ్యవస్థను నడపడానికి అయ్యే నిర్వహణ వ్యయం కూడా ఊహకందని స్థాయికి చేరింది. సురక్షితమైన సాంకేతిక మౌలికవసతులు, భారీ సామర్థ్యం కలిగిన డేటాసర్వర్లు, సైబర్ భద్రతాప్రమాణాలు, మోసాల నివారణ వ్యవస్థలు, నిరంతర నెట్‌వర్క్ విస్తరణ కోసం బ్యాంకులు, గూగుల్ పే, ఫోన్ పే, పేటీ ఎం వంటి చెల్లింపు సేవల సంస్థలు, వేలకోట్ల రూపాయలను నిరంతరం వెచ్చించాల్సి వస్తోంది. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం, ప్రతి సంవత్సరం యూపీఐ వ్యవస్థ సాంకేతిక నిర్వహణకు రూ.12,000 కోట్లకు పైగా వ్యయం అవుతోంది. ప్రభుత్వం అందించే అరకొర ప్రోత్సాహకాలు ఈ వ్యయాలకు ఏమాత్రం సరిపోకపోవడంతో, తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి గురవుతున్న బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు మర్చంట్ లావాదేవీలపై తిరిగి పరిమిత స్థాయిలో ఎండీఆర్‌ను ప్రవేశపెట్టాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంకును పదే పదే కోరుతూ వస్తున్నాయి. ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే లోక్‌సభ ఈ చట్ట సవరణకు ఆమోద ముద్ర వేసింది. ఈ చట్టం ఆమోదం పొందిన నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం నిబంధనలు తీర్చిదిద్దినప్పటికీ సామాన్య ప్రజలపై లేదా చిన్న లావాదేవీలపై ఎలాంటి భారం పడే అవకాశం లేదని స్పష్టమవుతోంది. చిన్న మొత్తాల లావాదేవీలు (ఉదాహరణకు రూ. 2,000 లోపు ఉన్నవి), వ్యక్తుల మధ్య జరిగే వ్యక్తిగత నగదు బదిలీలు, వీధి వ్యాపారుల చెల్లింపులను ఈ రుసుముల నుండి పూర్తిగా మినహాయించే అవకాశాలే మెండుగా ఉన్నాయి. కేవలం పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించే కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి ఈకామర్స్ వేదికలు మరియు పరిమితికి మించి భారీ లావాదేవీలు జరిపే వర్తకులపై మాత్రమే పరిమిత రీతిలో

# వీరాంజనేయస్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్

పొన్నూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా కలెక్టర్ పొన్నూరుకు వస్తున్నారన్న వార్త విని పలువురు మండలస్థాయి అధికారులు దేవాలయం వద్దకు వచ్చి కలెక్టర్‌కు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా వచ్చిన కలెక్టర్‌కు దేవాలయం అధికారులు, అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకస్వాములు స్వామివారి చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కార్యనిర్వహణాధికారి ఆరికెటి శ్రీనివాసరావు స్వామివారి ప్రతిమను, ప్రసాదాలను కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుప్తా, సభ్యులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖర రావు,



అర్బన్ ఎస్సై బలగాని జగన్మోహనరావు, ఎంపిఎం జోజిబాబు, మునిసిపల్ మేనేజర్ పిన్నిబోయిన పోతురాజు తదితరులున్నారు.

# గుంటూరు వార్త

# శ్రీ కనకమహాలక్ష్మీ ఆలయంలో మంగళగౌరి వ్రతాలు

గుంటూరు కల్చరల్,ఆగస్టు 18,ప్రభాతవార్త : స్థానిక సిద్ధార్థనగర్‌లోని శ్రీకనకమహాలక్ష్మీ ఆలయంలో వ్యవస్థాపకులు ఘంటసాల విజయ స్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు.విశేష హారతి మంత్ర పుష్పం అనంతరం సువాసినులకు,భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.



# గుంటూరులో వైద్య విద్యార్థుల గర్జన...

గుంటూరు మెడికల్,ఆగస్టు18(ప్రభాతవార్త) జూనియర్ వైద్యులు రాష్ట్రవ్యాప్త సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. మూడో దశ రెండో రోజు ఆందోళనలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు నిరసన కార్యక్రమాలు కొనసాగించారు.గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో జూనియర్ వైద్యులు ఉదయం సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద సమావేశమై స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. అనంతరం ఉదయం 10.30 గంటల సమయంలో సుమారు 500 మంది ఇంటర్న్ వైద్యులు, పీజీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ పీజీ వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు శాంతియుత పాదయాత్ర నిర్వహించారు.ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అత్యవసర విభాగం ద్వారం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఎంటీబీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మీదుగా తిరిగి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా జూనియర్ వైద్యులు తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.పాదయాత్రలో భాగంగా ఎంటీబీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్ వద్ద జూనియర్ వైద్యులు మానవహారాలు ఏర్పాటు చేశారు.



శాంతియుతంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలు, డిమాండ్లపై ప్రజల దృష్టిని ఆకర్షించారు. పాదయాత్రను పూర్తి క్రమశిక్షణతో

## గుంటూరులో 500 మంది జూనియర్ వైద్యులతో శాంతియుత పాదయాత్ర...
## మానవహారాలతో నిరసన..
## చర్చలకు సిద్ధమని స్పష్టం చేసిన వైద్యులు..

నిర్వహించడంతో పాటు వాహనాల రాకపోకలకు సాధ్యమైనంత తక్కువ అంతరాయం కలిగేలా చర్యలు చేపట్టారు.మధ్యాహ్నం కూడా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద జూనియర్ వైద్యులు శాంతియుత నిరసన కొనసాగించారు.

**చర్చలకు సిద్ధం...**

తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని జూనియర్ వైద్యుల సంఘం స్పష్టం చేసింది. ప్రభుత్వం వీలైనంత త్వరగా తదుపరి దఫా చర్చలు ప్రారంభించి, తమ న్యాయబద్ధమైన డిమాండ్లకు సామరస్యపూర్వక పరిష్కారం చూపాలని కోరింది. ప్రభుత్వం నుంచి తదుపరి చర్చల కోసం ఎదురుచూస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

# గుంటూరు మెడికల్ కాలేజీ సెక్షన్ అకౌంటెంట్ పై ఫిర్యాదు

## ఉద్యోగాల భర్తీ, అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని రమేష్ డిమాండ్..

గుంటూరు మెడికల్,ఆగస్టు 18(ప్రభాతవార్త ) : గుంటూరు మెడికల్ కాలేజీలో సెక్షన్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న షరీఫ్‌పై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు అందింది. ఉద్యోగాల భర్తీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ రమేష్ అనే వ్యక్తి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, అవినీతి నిరోధక శాఖ గుంటూరు అదనపు ఎస్పీ, వైద్య విద్య సంచాలకులు, గుంటూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఎన్జీవో సంఘంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెప్పుకుంటూ అధికారులను, ఉద్యోగులను బెదిరిస్తూ తన మాటే చట్టం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ప్రభుత్వ ఉత్తర్వులను మార్చడం, జిల్లా కలెక్టర్ ఆదేశాలు, న్యాయస్థానాల ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.గతంలో, ప్రస్తుతం పనిచేసిన ప్రాంతాల్లో ఉద్యోగాల భర్తీ విషయంలో అక్రమాలకు పాల్పడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని రమేష్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, ఇతర పరిపాలనా వ్యవహారాల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.ఎన్జీవో సంఘం పేరును అడ్డుపెట్టుకుని ఎలాంటి తప్పులు చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో అడ్డగోలు వ్యవహారాలు కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. షరీఫ్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించి, ఆయనపై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు.అధికారులు విచారణకు ఆదేశిస్తే తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని రమేష్ తెలిపారు. ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

# క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు క్రైమ్,ఆగస్టు18,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర వీవీఐపీలు,వీఐపీల భద్రతతో పాటు శాసనసభ పరిసర ప్రాంతాల్లో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా గుంటూరు జిల్లా పోలీసులు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు



చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐ జి తో కలిసి తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని శాసనసభ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అసెంబ్లీకి వచ్చే ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాహన తనిఖీ కేంద్రాలు, ప్రవేశ ద్వారాలు, వీఐపీ/వీవీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి వ్యక్తి, వాహనాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాల కదలికలను గుర్తించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.అసెంబ్లీ భవనం,శాసనసభ-శాసన మండలి హాళ్లు, ప్రవేశ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తమకు కేటాయించిన ప్రాంతాలను విడిచిపెట్టకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.భద్రతా పర్యవేక్షణలో డ్రోన్ నిఘా, సీసీ కెమెరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. ప్రత్యేక శాఖ, ఇంటెలిజెన్స్ విభాగాల నుంచి అందే సమాచారాన్ని నిరంతరం విశ్లేషిస్తూ ముందస్తు అప్రమత్తతతో చర్యలు చేపట్టాలని సూచించారు.అవసరమైన ప్రాంతాల్లో వీవీఐపీ/వీఐపీ రోడ్ ఓపెనింగ్ పార్టీలను, ఏరియా డామినేషన్ టీములను సమర్థవంతంగా వినియోగించాలని, అసెంబ్లీ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు.బాంబ్ డిస్పోజల్ టీమ్‌లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్లు, ఇతర ఆధునిక తనిఖీ పరికరాలను నిబంధనల ప్రకారం వినియోగిస్తూ భద్రతా తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, విలేకరులు, సిబ్బంది,ఇతర ముఖ్య వ్యక్తులతో విధి నిర్వహణలో మర్యాదపూర్వకంగా, సమన్వయంతో వ్యవహరిస్తూనే భద్రతా నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సడలించరాదని స్పష్టం చేశారు.అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో అనుమతి లేని ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు లేదా ఇతర కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సాధారణ ప్రజలు, స్థానికులు, ఉద్యోగులు, అత్యవసర సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, వాహనాల నియంత్రణ తదితర అంశాల్లో సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో వివిధ విభాగాల మధ్య త్వరిత సమాచార మార్పిడి, సమన్వయం, సమర్థవంతమైన స్పందన ఉండేలా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, ప్రతి షిఫ్ట్‌లో విధుల బాధ్యతలను తదుపరి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని ఆదేశించారు.అసెంబ్లీ సమావేశాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది అత్యంత అప్రమత్తత, క్రమశిక్షణ, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు.

# మంత్రి నారా లోకేష్ చొరవతో రూ.1,34,580 ఎల్ఓసీ చెక్కు అందజేత

మంగళగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త : నారా లోకేష్ చొరవతో మంజూరైన రూ.1,34,580 విలువైన ఎల్ఓసీ చెక్కును పెద్దవడ్లపూడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ చరణ్ భాస్కర్‌కు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అందజేశారు.ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు నారా లోకేష్ చొరవతో అవసరమైన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చరణ్ భాస్కర్‌కు రూ.1,34,580 ఎల్ఓసీ



మంజూరు కావడం ద్వారా కుటుంబానికి ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలిచి, వారికి అందాల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా చరణ్ భాస్కర్ కుటుంబ సభ్యులు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, యోమినేని సుధాకర్ బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు

స్థానిక సంస్థల్లో 34 రిజర్వేషన్ హర్షణీయం

గుంటూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త :బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు



అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ మొదట నుంచి వెన్నెముకగా నిలుస్తోందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ద్వారా మరోసారి బీసీలపై తమ చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని చెప్పారు. మున్సిపాలిటీల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ఇది తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీ కాదని, తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తోన్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా రిజర్వేషన్ల ద్వారా రాజకీయ ఉన్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. గత జగన్ హయాంలో బీసీలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైసీపీ నిర్వాకం వల్ల బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని మండిపడ్డారు.

# లక్ష విరజాజులతో అష్టలక్ష్ములకు విశేష పూజలు

గుంటూరు కల్చరల్,ఆగస్టు 18,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం నిర్వాహకులు ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో శ్రావణమాస మొదటి మంగళవారం అమ్మవార్లకు లక్ష విరజాజులు,గులాబి పువ్వులు,భక్తులు కట్టిన యాలకుల మాల,లవంగాలతో కట్టిన మాల వివిధ సుగంధ ద్రవ్యాల పువ్వులతో అమ్మవార్లకు అభిషేక పూజ నిర్వహించారు.విశేషంగా పాల్గొన్న సువాసినులచే కోటి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక హారతులు,మంత్రపుష్పం అనంతరం భక్తులకు పూజల్లో పాల్గొన్న వారికి తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా మర్రిపాటి ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణ శుక్ర,మంగళ వారాలతోపాటు కోటి కుంకుమార్చనల్లో భాగంగా ప్రతిరోజు కుంకుమార్చనలు జరుగుతున్నాయని పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులతో పాటు ఆయురారోగ్యాలు పొందాలని కోరారు.



# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రజల సహకారం అవసరం

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు,ఆగస్టు 18,ప్రభాతవార్త :గుంటూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న చర్యలు అభినందనీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం నేడు పర్యావరణానికే కాకుండా మానవాళికి, పశుపక్ష్యాదులకు తీవ్ర ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గళ్లా మాధవి ఒక సెల్ఫీ



వీడియో ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, అనేక జీవరాశుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో ఎన్నోసార్లు కోరినట్లు తెలిపారు. ఆ దిశగా జీఎంసీ అధికారులు ముందడుగు వేయడం సంతోషకరమన్నారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయదారులకు, వినియోగదారులకు ఇప్పటికే నెల రోజుల క్రితమే నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలకు లోబడని ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిషేధించాలని సూచించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందుకే జీఎంసీ అధికారులు నిబంధనలను ఉల్లంఘించిన వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్నారని చెప్పారు.అయితే కేవలం వ్యాపారులను నియంత్రించడం మాత్రమే సరిపోదని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గళ్లా మాధవి పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వ్యర్థాల కోసం ప్రత్యేక డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి సీసాలు, చిప్స్ ప్యాకెట్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి నిల్వ చేయాలని సూచించారు. వారానికి ఒకసారి వాటిని పారిశుధ్య సిబ్బందికి అప్పగించేలా అలవాటు చేసుకోవాలని కోరారు. ఇంటింటి చెత్త సేకరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలిపి ఇస్తే వాటిని తిరస్కరించే విధానాన్ని అమలు చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ప్రపంచంలోని అత్యంత పరిశుభ్రమైన నగరాలు, అభివృద్ధి చెందిన దేశాలు పరిశుభ్రతలో ముందుండటానికి ప్రభుత్వాల కఠిన చర్యలతో పాటు ప్రజల సహకారమే ప్రధాన కారణమని గళ్లా మాధవి పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యం, సహకారం పెరిగితేనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు.ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం గత కొన్ని నెలలుగా నిరంతర కృషి చేస్తున్న జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, జిల్లా కలెక్టర్ సిఎం సాయికాంత్ వర్మతో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అవగాహన కార్యక్రమాలతో పాటు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు అమలు చేస్తూ ప్లాస్టిక్ నియంత్రణకు కార్యాచరణ చేపట్టినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్కిల్స్ పెంచుకుని అవకాశాలు పొందండి

## - ఇసుజి ఇండియా ప్రతినిధి జున్ ఓహో నో

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్18, ప్రభాతవార్త: విద్యార్థులు తమలో దాగిఉన్న నైపుణ్యాలను మెరుగుపర్చుకుని ఉపాధి అవకాశాలు పొందేలా ఎదగాలని ఇసుజి మోటర్స్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ ప్రతినిధి జున్ ఓహనో సూచించారు. ఏఎన్‌యులోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం వర్క్‌షాప్‌కు ఇసుజి మోటర్స్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ సంస్థ సుమారు రూ.2.8లక్షల విలువగల ఇంజన్‌కట్ సెక్షన్, రెండు ట్రాన్స్‌మిషన్స్‌లను సిఎస్ఆర్ కింద వర్సిటీకి



అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి జున్ ఒహనో మాట్లాడారు. టెక్నికల్ స్కిల్స్, ఇన్నోవేటివ్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్ పెంచుకుని రానున్న రోజుల్లో ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. థియరీతోపాటు ప్రాక్టికల్స్ లో కూడా స్కిల్స్ పెంచుకోవాలన్నారు. వీసి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఆటోమొబైల్ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. వాటిని టెక్నాలజీ ద్వారా విద్యార్థులు పొందాలని సూచించారు. ముందుగా రూసా 2.0లో భాగంగా మఫల్ ఫర్నేస్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ శివరాం ప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.డి తౌసిఫ్ అహ్మద్, ఇసుజి మోటార్స్ నుంచి శివకుమార్ శుక్ల, మురళీగాంధీ రాజు, ఎస్.నరేష్, పి.అజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ గోపీకృష్ణ, చంద్రమౌళి, విభాగాధిపతి పూర్ణచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మినిమం టైం స్కేల్ వర్తింపచేయండి

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్18, ప్రభాతవార్త: ఏఎన్‌యులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పి.రవి, కోశాధికారి డా. తౌసిఫ్‌లు తమ సమస్యల పరిష్కారం కోసం 27రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గతంలో ఆమోదించిన యూజిసి పే స్కేల్‌ను వెంటనే మాకు వర్తింప చేయాలన్నారు. మా సేవలను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాలకమండలిలో మా సమస్యలపై చర్చించి తమ సర్వీసులను క్రమబద్ధీకరించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు. తమ వేతనాల పెంపుకోసం నియమించిన కమిటీ సిఫార్సులను అమలుచేయాలని విజ్ఞప్తిచేశారు. మినిమం టైంస్కేల్ అమలుచేసి తమకు సహకరించాలని కోరారు.


**కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్**
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా-520008.

**సంక్షిప్త డిమాండ్ నోటీసు**
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీత పేరు: వ్యాపార చిరునామా: M/s లలిత ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ అంబటి వెంకటేష్, తండ్రి: ఎ. మార్కండేయులు, డి నెం.84-50, 60 ఫీట్ రోడ్, శ్రీనివాసరావు పేట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. నివాస చిరునామా: డి నెం.25-16-43/A, 13/2, శ్రీనివాసరావు పేట, గుంటూరు-522004. హామీదారు-1: శ్రీమతి అంబటి లలిత కుమారి, భర్త: ఎ. మార్కండేయులు, డి నెం.25-16-43/A, 13/2, శ్రీనివాసరావు పేట, గుంటూరు-522004, ఆంధ్రప్రదేశ్. హామీదారు-2: శ్రీ నగరం రవి కుమార్, తండ్రి: మధుసూధన్ రావు, హెచ్ నెం.7-144/C, మెయిన్ రోడ్, లాల్‌పురం, ఏటుకూరు-522017, గుంటూరు, ఆంధ్రప్రదేశ్.
(II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం., లోన్ మొత్తము & చెల్లించవలసిన బకాయి మొత్తము: సెక్యూర్డ్ ఓవర్‌డ్రాఫ్ట్ (CODEAL) లోన్ అకౌంట్ నెం.96009317029 కొరకు రూ.33.00 లక్షలు మరియు తేది.04-08-2026 నాటికి చెల్లించలిసిన బకాయి రూ.34,83,483/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఎనభై మూడు వేల నాలుగు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మొ॥వి.
(III) డిమాండ్ నోటీసు తేది: 04-08-2026 (IV) NPA తేది: 29-07-2026
(V) స్థిరాస్తి వివరములు: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు కొత్త మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, రామచంద్రపుర అగ్రహారం, పాత సర్వే నెంబ.21, 22, రీ-సర్వే నెంబ.50/2A మరియు 50/3A) ప్రకారం, "H" బ్లాక్‌లోని ప్లాట్ నెంబ.60, 65 నందు విస్తీర్ణం 150 చ॥గ॥లు మరియు దక్షిణ వైపున ప్లాట్ నెంబ.59, 64 నందు విస్తీర్ణం 117-1/2 చ॥గ॥లు కలిపి మొత్తం విస్తీర్ణం 269 ½ చ॥గ॥ల స్థలంలో తూర్పువైపున 150 చ॥గ॥లు స్థలం మరియు అందులోని ఇల్లు అసెస్‌మెంట్ నెం.1021204549 మరియు డోర్ నెం.25-16-43/C తో కలదు. హద్దులు: తూర్పు: 25 అ॥ల వెడల్పు గల రోడ్డు - 22.6 అ॥లు, దక్షిణం: నేలకుర్తి నాగయ్య గారికి చెందిన ప్లాట్ నెంబ.60, 65లోని ఆస్తి - 60.0 అ॥లు, పడమర: విక్రేతకు చెందిన మిగిలిన ఆస్తి - 22.6 అ॥లు, ఉత్తరం: కందుల రాధాకృష్ణ మూర్తి మరియు పద్మావతి గార్లకు చెందిన ప్లాట్ నెంబ.59 & 64లోని ఆస్తి - 60.0 అ॥లు. ఈ ఆస్తి శ్రీమతి అంబటి లలిత కుమారి, భర్త: మార్కండేయులు గారి పేరున రిజిష్టర్ చేయబడిన రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2666/2019, తేది.07-03-2019, JSRO గుంటూరు.

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు/హామీదారులు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, తక్కెళ్లపాడు బ్రాంచ్, తక్కెళ్లపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణములకు పైన పేర్కొన్న ఆస్తులను హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలను అనుసరించి సకాలంలో చెల్లించకపోవటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు మీకు రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున/సక్రమమైన ఎకనాలెడ్జిమెంట్ లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున సదరు ఋణగ్రహీతలు/హామీదారులు పైన పేర్కొన్న మొత్తమును ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ చట్టం నందలి సెక్షన్ 13(4) ప్రకారం బ్యాంక్ బకాయిల ను రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

ఈ నోటీసులో తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను సర్ఫేసి సెక్షన్ 13(13) ప్రకారం అమ్మకం లేదా లీజు ద్వారా బదిలీ చేయరాదని మీరు గమనించగలరు. ఒకవేళ చేసినట్లయితే సదరు చట్టం నందలి సెక్షన్ 29 ప్రకారం మీరు శిక్షార్హులు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

తేది : 04-08-2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

# రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

**యడ్లపాడు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలైన కంది, పెసర, నువ్వులు తదితర పంటలను సాగు చేయాలని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు సూచించారు. దీంతేనపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాట్ సెంటర్, నరసరావుపేట కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నగేష్ రైతులకు పత్తి, శెనగ, కంది తదితర పంటలకు సంబంధించిన మేలైన విత్తన రకాలు, ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు పూర్తిగా రసాయనిక ఎరువులపై ఆధారపడకుండా పచ్చిరొట్ట పైర్లను సాగు చేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. అజోల్లా, అజోస్పైరిల్లం, అజటోబాక్టర్, రైజోబియం, పీఎస్‌బీ, వీఏఎం వంటి జీవన ఎరువులను వినియోగించాలని తెలిపారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నియంత్రణకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. పత్తిలో ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసి గులాబీరంగు పురుగు ఉధృతిని గుర్తించాలని తెలిపారు. పత్తి మొక్కల తలలను 80-100 రోజుల మధ్య త్రుంచడం, 5 శాతం వేపగింజల ద్రావణాన్ని పిచికారీ చేయడం, పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. పత్తి మోళ్లను ట్రాక్టర్ రోటవేటర్‌తో భూమిలో కలియదున్నడం వల్ల గులాబీరంగు పురుగు నియంత్రణకు అవకాశం ఉంటుందని చెప్పారు. కందిలో ఎల్‌ఆర్‌జీ52, ఎల్‌ఆర్‌జీ105, ఎల్‌ఆర్‌జీ484 వంటి మేలైన రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయడం ద్వారా రైతులు మంచి దిగుబడులు, ఆదాయం పొందవచ్చని సూచించారు. ఎల్‌నినో



ప్రభావంతో పంటలకు బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు పొటాషియం నైట్రేట్ లేదా నానో యూరియాను నీటితో కలిపి పిచికారీ చేయడం ప్రయోజనకరంగా ఉంటుందని కెవి శ్రీనివాసరావు తెలిపారు. ఎపిఐఎమ్ఎస్ 2.0 యాప్‌లో పంట వివరాలు నమోదు చేయాలిరైతులకు ఎపిఐఎమ్ఎస్ 2.0 (ఫార్మర్ యాప్) ద్వారా అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలు, డిజిటల్ సమాచారంపై అధికారులు అవగాహన కల్పించారు. రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి తమ పంట వివరాలను ఎపిఐఎమ్ఎస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి యూరియా, డీఏపీ ఎరువులు ఎపిఐఎమ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతుల సాగు విస్తీర్ణం, పంటల ఆధారంగా శాస్త్రీయంగా నిర్ధారించిన మోతాదుల మేరకు ఎరువులు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ జీవన్, రైతు సేవా కేంద్ర సిబ్బంది బిలాల్ (ఎడ్లపాడు-2), గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

### విజయవంతం చేసేందుకు పోలీస్ అధికారులతో సమీక్ష

**సత్తెనపల్లి (ఆగస్టు 18, ప్రభాతవార్త):** సెప్టెంబర్ 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా వీలైనంత ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు పోలీస్ అధికారులకు సూచించారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న కేసులను ముందుగానే గుర్తించి, ఇరువర్గాలతో సమన్వయం చేసుకుని పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కేసుల పరిష్కారంతో కక్షి దారులకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను గుర్తించి లోక్ అదాలత్‌కు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ అధికారులు తమ పరిధిలోని కేసులను పరిశీలించి, రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసుల వివరాలను న్యాయ సేవాధికార సంస్థకు అందించాలని కోరారు. పోలీస్ శాఖ, న్యాయ సేవాధికార సంస్థ పరస్పర సమన్వయంతో పనిచేస్తే లోక్ అదాలత్ ద్వారా మరిన్ని కేసులను పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దౌసిద్దీన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సుజన్‌కుమార్‌తో పాటు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలి

### ఏవో సంధ్యారాణి

**పిడుగురాళ్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని ఏవో సంధ్యారాణి సూచించారు. మంగళవారం మండలంలోని కరాలపాడు, వీరాపురంలో గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ నీటి వసతి, తక్కువ కాల పరిమితి గల కంది, పెసర, మినుము, అలసందలు, బుడ్డశెనగ, చిరుధ్యానాలైన రాగులు, కొర్రలు, వరిగలు, పచ్చజొన్న, సజ్జ వంటి పంటలను సాగు చేయాలన్నారు. భూములను ఎటువంటి పంటలు లేకుండా ఖాళీగా వదిలివేయవద్దన్నారు. వరి పంటకు బీమాను ఈనెల 30వ తేదీ వరకు పొడిగించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## ఉచిత నాడి వైద్య శిబిరం

**పిడుగురాళ్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** పట్టణంలోని ఆదర్శనగర్‌లో మంగళవారం ఉచిత ఆయుర్వేద నాడి వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యాన పిడుగురాళ్ల ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యురాలు మేఘమాల రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది దూదేకుల బాబు, షేక్ కరిముల్లా, పులిమెల కృపాసత్యం, ముంద్రా సాంబశివరావు, కొర్రపాటి చిన జాను, చల్లగుండ్ల దాసు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐ శివనాగరాజుకు సన్మానం

**పిడుగురాళ్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** విధి నిర్వహణ ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి మనోహర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్ఐ శివనాగరాజును మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్లో కూటమి నేతలు ఘనంగా సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



## మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యరపతినేని

### పేద విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

**పిడుగురాళ్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మాచవరం మండలం గోవిందపురంలో ఈనెల 8వ తేదీన పోతురాజు వెంకటేశ్వర్లుకు ఇచినచన మాట ప్రకారం అతని మనువరాలు నాగమల్లేశ్వరి చదువుకు అయ్యే ఆర్థికసాయంను అందించారు. నాగమల్లేశ్వరి చదువుతున్న మల్లినేని లక్ష్మయ్య కళాశాల యాజమాన్యంతో మాట్లాడి ఇంజనీరింగ్ రెండో సంవత్సరం, మూడో సంవత్సరం, నాలుగో సంవత్సరం ఫీజు మొత్తం మాట్లాడి మంగళవారం రూ.1.25 లక్షలను యాజమాన్యానికి చెల్లించారు. వెంకటేశ్వర్లు కుటుంబ ఖరుఖ్చుల నిమిత్తం రూ.50 వేలు, నాగమల్లేశ్వరి ఫీజు నిమిత్తం రూ.2.50 లక్షలు, మొత్తంగా రూ.3 లక్షల తన సొంత నిధులను ఎమ్మెల్యే యరపతినేని అందించారు.




## విధులకు ఆటంకం కలిగించిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు

**గురజాల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** విధుల్లో ఉన్న సిబ్బందికి ఆటంకం కలిగించి గొడవ పడిన రెంటచింతల కానిస్టేబుల్ మల్లాది శివశంకర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. శివశంకర్ భార్య శైలజ గురజా పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తన భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా విచారణ నిమిత్తం శివశంకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామన్నారు. స్టేషన్‌కు వచ్చిన శివశంకర్ అక్కడే ఉన్న అతని భార్య శైలజను కొట్టగా అడ్డుకోబోయిన నాగలక్ష్మి, సిబ్బంది విధులను ఆటంకపరుస్తూ గొడవ చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## యడ్లపాడులో ఘనంగా జెండా సేవ

**యడ్లపాడు, అగస్టు 18, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలోని శ్రీ రణవీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న పురాతన రావి చెట్టు వద్ద సోమవారం రాత్రి జెండా సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా గ్రామస్తులు ఈ సేవను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. భక్తులు కోరుకున్న మొక్కులు తీర్చుకోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు లేకుండా ఉండాలని స్వామివారిని ప్రార్థిస్తూ జెండా సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ సేవ మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి వీధిలో సంకీర్తనలు ఆలపిస్తూ, డప్పు వాయిద్యాలతో భక్తి గీతాలు పాడుతూ జెండా సేవ నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
పత్తి యాజమాన్యం, ఫార్మర్ ఐడీపై అవగాహన



## కోర్రమీను చేపల పెంపకంతో డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన

**రాజుపాలెం, ఆగస్టు 18 (ప్రభాత వార్త):**

రాజుపాలెం మండలం గణపవరం గ్రామంలో డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న కోర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. శిలీనిబిశి పథకం ద్వారా రూ.4.40 లక్షల విలువైన యూనిట్‌ను ళీనిళిశి, ఉదయ్ ఆక్వా ప్రాజెక్ట్ వారి సహాయ సహకారాలతో పాటు తిశిబితీ బ్యాంకు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు, పల్నాడు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి పి. ఝాన్సీ రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ట్యాంకులో కోర్రమీను చేప పిల్లలను వదిలి చేపల పెంపకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు చేపల పెంపకం ద్వారా ఆదాయం పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ యూనిట్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశిలీలిబీ శ్రీ డేవిడ్, తిశిలీలిబీ శ్రీ శ్రీనివాసరెడ్డి, తిశిబితీ బ్యాంక్ బీఎం శ్రీ కుమార్‌తో పాటు రాజుపాలెం మండల వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్, సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన

**అచ్చంపేట ఆగస్ట్ 18 (ప్రభాత వార్త):** అచ్చంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాలల భద్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంధ్యారాణి పాల్గొని విద్యార్థులకు పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. రహదారులపై అప్రమత్తంగా ప్రయాణించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకసారి ఉపయోగించే పాస్‌వర్డ్ (ఓటీపీ), పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలను



తెరవకుండా సామాజిక మాధ్యమాలను సురక్షితంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ బాలల హక్కులు, రక్షణ, మంచి స్పర్శ-చెడు స్పర్శ వంటి అంశాల ను వివరించారు. ఎలాంటి అనుచిత సంఘటన ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థుల్లో భద్రత, చట్టాలపై అవగాహన, సైబర్ భద్రత, నేరాల నివారణ, బాధ్యతాయుత ప్రవర్తనపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

## రాజుపాలెం మండలంలో ఇంట్లో భారీ చోరీ

**రాజుపాలెం, ఆగస్టు 18 (ప్రభాత వార్త):** పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని పెద్ద నెమలిపురి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు టార్గెట్ చేసి భారీ చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కంగనంపాటి అరుణ (55) ఇంట్లో ఈ చోరీ ఘటన చోటుచేసుకుంది. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి సుమారు 15 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ.4 లక్షల నగదును అపహరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన ఆమె పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ కృష్ణ చైతన్య, సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, రాజుపాలెం ఎస్సై మణికృష్ణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘటన స్థలంలో ఆధారాలను సేకరించారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్యకు అభినందనలు

### టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల హర్షం

**సత్తెనపల్లి (ఆగస్టు 18, ప్రభాతవార్త):** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దళిత జాతి ముద్దుబిడ్డ, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సీనియర్ నాయకులు శ్రీ వర్ల రామయ్యకు సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వర్ల రామయ్యను ఎమ్మెల్సీగా ఎన్నుకోవడంలో సహకరించిన జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్‌లకు సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల తరఫున మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. వర్ల రామయ్య తన అనుభవంతో శాసనమండలిలో దళితులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను బలంగా వినిపిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షి ంచారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ. 10,000 జరిమానా

### మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు శిక్ష

**దుర్గి,ఆగస్టు18, ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు దుర్గి పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒకరు పట్టుబడి జరిమానా చెల్లించారు. బొల్లాపల్లి మండలం, రావులపురం గ్రామానికి చెందిన పత్రా శ్రీకాంత్ బాబు మద్యం సేవించి వాహనం నడుపుతుండగా దుర్గి పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. అతనిపై కేసు నమోదు చేసి గౌరవ మాచర్ల ॥వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రీ. నాగభూషన్ ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు నిందితునికి రూ. 10,000/ జరిమానావిధించింది. మద్యం తాగి డ్రైవింగ్ ప్రమాదాలకు కారణంఈ సందర్భంగా దుర్గి పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. బి. గోపాల్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇది ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. దుర్గి మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## మద్యం తాగి బండి నడిపితే జైలే:

### దుర్గి ఎస్.ఐ. హెచ్చరిక

**దుర్గి,ఆగస్టు18, (ప్రభాత వార్త):** మద్యంసేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే జైలుకు పంపుతామని దుర్గి ఎస్.ఐ. బి. గోపాల్ వాహనదారులను తీవ్రంగా హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం అర్ధరాత్రి మాచర్ల-కారంపూడి ప్రధాన రహదారిపై పోలీసులు ముమ్మర నాకాబందీ (వాహన తనిఖీలు) నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 50 వాహనాలను ఆపి తనిఖీ చేయగా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 2 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 10 ఈచలాన్ కేసులు నమోదు చేశారు. అలాగే సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 7 మోటార్‌సైకిళ్లను అక్కడికక్కడే సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. బి. గోపాల్ మాట్లాడుతూ.. ప్రాణాలు పణంగా పెట్టి బైక్‌లపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారుడు తమ వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ప్రజల భద్రత కోసమే ఈ తనిఖీలని, ఇవి నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



## మాచర్ల ఎరుకల కాలనీలో పోలీసుల కార్డన్

**మాచర్ల క్రైమ్ ఆగస్టు 18 ప్రభాత వార్త:** మాచర్ల పట్టణంలోని ఎరుకల కాలనీలో పోలీసులు మంగళవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. తొమ్మిదో వార్డులోని ప్రతి ఇంటినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గురజాల డీఎస్పీ మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మాచర్ల సీఐ నజీర్ బేగ్, రూరల్ సీఐ వేణుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సోదాల్లో సుమారు 40 ద్విచక్ర వాహనాలు, ఓ గొడ్డలి, మరికొన్ని ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎలాంటి మత్తు పదార్థాలు లభించలేదని డీఎస్పీ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే కార్డన్ సర్చ్ నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. మత్తు పదార్థాలను విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేశ్వరరావు



హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి వాహనానికి చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలని డీఎస్పీ సూచించారు.

## పత్తి యాజమాన్యం, ఫార్మర్ ఐడీపై అవగాహన

**దుర్గి ,జులై 18, ప్రభాతవార్త:** దుర్గి మండలం ఓబులేసుపల్లె సచివాలయం పరిధి రాజానగరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రస్తుత పత్తి పంట పరిస్థితులు, సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎల్‌నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫార్మర్ ఐడీ నమోదు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించడంతో పాటు చీడపీడలను నివారించేందుకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలించి అవసరమైనప్పుడు మాత్రమే శాస్త్రీయ సిఫార్సుల మేరకు పురుగుమందులు వాడాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి పంటను నిరంతరం పర్యవేక్షి ంచాలని,



పొలంలో తేమ పరిరక్షణ, కలుపు నియంత్రణ, సిఫార్సు మేరకు పోషకాలు అందించాలని కోరారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతు సేవలు అందించేం దుకు ప్రతి రైతు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై. అమిర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి కె. రంగా నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకుడు టీ. దిలీప్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకయ్య మరియు బృందం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిజ్ఞ, ర్యాలీ

**అచ్చంపేట : ఆగస్టు 18 (ప్రభాత వార్త):** అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామములో ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెదపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. మద్యం, పొగాకు, సిగరెట్లు, గంజాయి, మత్తు మాత్రలు తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. దాసు, పీఈటీ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణరావు, మరియబాబు, అంగన్‌వాడీ టీచర్లు కె. రమాదేవి, డి. భవాని, కె. అనూష, ఎం. జ్యోతిభాయి, ఎన్. వెంకటరావమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



## పత్తి పంటకు బెట్ట ముప్పు.. రైతులు జాగ్రత్తలు పాటించాలి

### పెదమక్కెనలో పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు

**సత్తెనపల్లి (ఆగస్టు 18, ప్రభాతవార్త):** ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంట బెట్టకు గురవుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు సూచించారు. మంగళవారం సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలో పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు ఒక శాతం మల్టీకె లేదా 19:19:19 నీటిలో కరిగే ఎరువును ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి. రవిబాబు, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకురాలు రజిని, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ రైతు విభాగం పట్టణ అధ్యక్షుడు సంకుల తిరుపతిరావుకు సత్కారం

**సత్తెనపల్లి (ఆగస్టు 18, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సంకుల తిరుపతిరావు (తిరుమల)ను మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ తిరుపతిరావు భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షి స్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గార్లపాటి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేదర విభాగం అధ్యక్షులు తుమ్మల వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా బీసీ విభాగం కార్యదర్శి ఉల్లంగుల ప్రసాద్, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు వల్లెం నరసింహారావు, నియోజకవర్గ రజక విభాగం అధ్యక్షులు మందడపు శివసాయి, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు జవ్వంగుల సాయి తదితరులు పాల్గొన్నారు.



# జిందాల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌లో 621 కిలోల గంజాయి ధ్వంసం

**యడ్లపాడు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన మాదక ద్రవ్యాలను ఎడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సందర్భంగా 621.017 కిలోల ఎండు గంజాయి, 327 గంజాయి మొక్కలు, గంజాయి కలిసిన 540 చాక్లెట్లు ధ్వంసం చేశారు. వీటితో పాటు చార్మినార్ గోల్డ్ మున్నక్కా (పసుపు రంగు)



ఫెసిలిటీలో మంగళవారం నిబంధనల మేరకు ధ్వంసం చేశారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఒంగోలు డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె. హేమంత్ నాగరాజు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల ధ్వంసం ప్రక్రియ చేపట్టారు. కమిటీ సభ్యులుగా నెల్లూరు డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ పాల్గొన్నారు.ఈ ప్యాకెట్లు 58, లవారి టిన్లు 59, తెలుపు రంగులో గుండటి బంతి ఆకారంలో ఉన్న పదార్థం ఒక కిలో, 500 గ్రాములు, రాయి మాదిరిగా ఉన్న పదార్థం ఐదు కిలోలను కూడా నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు.మధ్యవర్తుల సమక్షంలో నిర్ణీత విధివిధానాలను పాటిస్తూ మొత్తం మాదకద్రవ్యాల ధ్వంసం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. కార్యక్రమంలో బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నూజెండ్ల ఎంపిడివో సత్యనారాయణకు ఘన సన్మానం

**నూజెండ్ల,ఆగస్టు18,ప్రభాతవార్త:** మండలకేంద్రం నూజెండ్ల ఎంపిడివో కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సింగంశెట్టి సత్యనారాయణకు అభినందన సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లాస్థాయి డిప్యూటీ ఎంపీడీవో మల్లి కార్జునరావు, ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా సింగంశెట్టి సత్యనారాయణ ఉత్తమ



ఎంపీడీవోగా అవార్డు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని ఎంపీడీవో సత్యనారాయణకు బొకేలు అందజేసి పూలమాలలు,శాలువాతో ఘనంగా సన్మానించి అభినందన తెలియజేశారు.

# పల్నాడు జిల్లా వార్త



## నరసరావుపేటలో భారీ అగ్నిప్రమాదం

**- 4కార్లు దగ్ధం - మంటలను అదుపు చేసిన పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు**

**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** స్థానిక వినుకొండ రోడ్డులోని ఎన్.ఎస్.బి కార్ డెకార్స్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు తీవ్రంగా వ్యాపించడంతో కార్ డెకార్స్‌లోని నాలుగు కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. కార్






డెకార్స్‌లో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న బిర్యానీ కేంద్రానికి సైతం వ్యాపించాయి.



దీంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకోవడంతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో రూ. 50 లక్షల విలువైన వాహనాలు, సామాను కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న నరసరావుపేట వన్ టౌన్ సీఐ ఫిరోజ్, టూ టౌన్ సీఐ ప్రభాకర్, రూరల్ సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సిఐ లోకనాథ్ లతో పాటు ఎస్ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను, ఆస్తి నష్టం తదితర వివరాలపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

## ప్రమాదరహిత జిల్లాగా పల్నాడు : కలెక్టర్


**నరసరావుపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని రహదారులలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుని, ప్రమాదరహిత జిల్లాగా చేయటమే తమ ముందున్న లక్ష్యమని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు, ముందస్తు చర్యలు తీసుకునే విధి విధానాలు సూచించారు. జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగిన అక్కడ బ్లాక్ స్పాట్స్ గుర్తించి, మరోసారి అక్కడ జరగకుండా లాక్ బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. రహదారి భద్రతకు ముందస్తు చర్యల్లో భాగంగా వారికి రహదారి భద్రతపై అవగాహన కల్పించడం, వారికి లైసెన్సులు ఇప్పించడం, లైసెన్సు లేని వారికి అపరాధ రుసుము వసూలు చేయడం వంటివి




తయారు చేయాలనిఎంపీ లావు కోరారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ మరియు జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. జిల్లాలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన సమన్వయ కమిటీ జాగ్రత్తలను గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాల గురించి ముందుగానే ప్రజలకు, వాహనదారులకు అవగాహన స్కూలు స్థాయి నుంచే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, వాహనదారులకు అర్థమయ్యేరీతిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చేపట్టాలని సూచించారు. ఈ కమిటీకి మెంబర్ సెక్రటరీగా రవాణా శాఖ జిల్లా అధికారి సంజీవ్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా రోడ్డు ప్రమాదాల గణాంకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ శాఖ నుండి జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 34 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని, అందులో జాతీయ రహదారులు పై 16 ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో దమ్ము చక్రాలు రోడ్లపైకి తీసుకువస్తే పెనాల్టీలు వేయాలని సూచించారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సంస్థ తరపున ఆర్.కనకదుర్గ పద్మజ కమిటీకి కొన్ని సూచనలు చేశారు. బ్లాక్ స్పాట్స్ సరిచేయాలని రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీతారాణి సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమైన అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ ముందుచూపే.. ఎల్ నినో తీవ్రతకు సరైన పరిష్కారం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్ట్18,ప్రభాతవార్త:** వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతుల్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది.. తక్కువ నీటితో సాగయ్యే పంటల సాగు దిశగా రైతాంగాన్ని మళ్లించింది.. రూ.3400 కోట్లతో కూటమి ప్రభుత్వం చేపట్టిన జలధారజలహారతితో సత్ఫలితాలు.. 208 మండలాల్లో కరవు పరిస్థితులుంటే.. హై రిస్క్ లో 122 మండలాలు.వోల్టాచట్టం నిబంధనల్ని రైతులకు అనుకూలంగా సవరించాలి .పశుగ్రాసకొరత, తాగునీటి సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.. రైతులు విధిగా పంటలబీమా చేయించేలా చూడాలి.ఆహార ఉత్పత్తులు, నిత్యావసరాల ధరలు పెరుగుదలపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి.. ఎల్ నినో తీవ్రతపై అసెంబ్లీలో చేపట్టిన లఘుచర్చలో మాట్లాడిన శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.



# స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక అడుగు

## ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ,ఆగస్ట్18,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెంచేలా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతలో మరో చారిత్రాత్మక అడుగు అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.13 శాతం రిజర్వేషన్ల అమలు దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హృదయ పూర్వకంగా స్వాగతించారు. బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసిన




చరిత్ర తెలుగుదేశం పార్టీదేనన్నారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి బలమైన పునాది వేశారన్నారు. ప్రస్తుతంముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పిస్తూ ఆ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఇప్పుడు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా అడుగులు వేయడం ఆ ప్రయాణంలో మరో కీలక మైలురాయి అని పేర్కొన్నారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి కేవలం ఓటు బ్యాంకు కాదని పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన వెన్నెముక అన్నారు. వారి శ్రమకు, త్యాగాలకు రాజకీయ అధికారంతో గౌరవం ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించిన పార్టీ టీడీపీ మాత్రమే అన్నారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన బీసీ నాయకులను చట్టసభలకు పంపడంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీదన్నారు. కొత్త నిర్ణయంతో గ్రామాల్లో పార్టీ జెండా మోసిన సామాన్య కార్యకర్తలు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పట్టణాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎదిగి ప్రజలకు సేవ చేసే అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే కీలక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రివర్గానికి బీసీల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు.

## కంచర్ల మహాలక్ష్మి మృతికి భాష్యం రామకృష్ణ నివాళులు

**చిలకలూరిపేట,ఆగస్ట్18,ప్రభాతవార్త:** కంచర్ల శ్రీనివాసరావు మాతృమూర్తి కంచర్ల మహాలక్ష్మి మృతి విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ



సోమవారం పట్టణంలోని వారి స్వగృహానికి చేరుకుని, మహాలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మహాలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# పట్టణంలో పోలీసుల హెల్మెట్ బైక్ ర్యాలీ

## ర్యాలీలో పాల్గొన్న డిఎస్పీ,సిఐలు,ఎస్ఐలు

**నరసరావుపేట క్రైమ్, ఆగస్టు18 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ ఆదేశాల మేరకు, నరసరావుపేట డిఎస్పి ఎం హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం ట్రాఫిక్ అవేర్నెస్ సందర్భంగా పట్టణంలో పోలీసులు "హెల్మెట్ బైక్ ర్యాలీ" నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి హనుమంతరావు మాట్లాడుతూద్విచక్ర వానదారులు వాహనాలు నడిపే సందర్భంలో తప్పక హెల్మెట్



ధరించాలి అన్నారు. దీనివలన ప్రమాదాలు జరిగే సందర్భంలో విలువైన ప్రాణాలను రక్షించుకోవచ్చు అన్నారు. పల్నాడు జిల్లాల్లో నిత్యం ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి సమయంలో చనిపోతున్నారని తెలిపారు. హెల్మెట్ వాడండి అంటూ గత రెండేళ్లుగా విస్తృతంగా ప్రచారం చేస్తూ, అవగాహన కల్పిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదన్నారు. పెద్ద పెద్ద పట్టణాలలో హెల్మెట్ ధరించి మోటార్ సైకిళ్లను నడుపుతున్నారని తద్వారా అక్కడ ఆక్సిడెంట్ల ద్వారా చనిపోయిన సందర్భాలు చాలా తక్కువ అని తెలియజేశారు. వాహనదారులు మీకోసం మీ కుటుంబ సభ్యులకు కోసం ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని, కచ్చితంగా హెల్మెట్ ధరించి బైక్స్ నడపాలని సూచించారు. కార్యక్రమంలో నరరావుపేట వన్ టౌన్ సిఐ ఫిరోజ్, టూ టౌన్ సిఐ ప్రభాకర్, రూరల్ సిఐ సుబ్బారావు, ట్రాఫిక్ సిఐ లోకనాథం, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శరవేగంగా మైనార్టీ బాలికల కళాశాల పనులు

## ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

**నరసరావుపేట, ఆగస్టు18 ప్రభాతవార్త :** నరసరావుపేటలోని 26వ వార్డులో నిర్మాణంలో ఉన్న ముస్లిం మైనార్టీ బాలికల కస్తూర్బా గాంధీ



గురుకుల రెసిడెన్షియల్ కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మైనార్టీ బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థినులకు వసతి, తరగతి గదులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, పట్టణంలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన అంజుమన్ కాంప్లెక్స్, బాలబాలికల హాస్టల్, ఐటీఐ కళాశాల, పెద్దతురకపాలెం సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల తదితర అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మైనార్టీ సోదరులు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ ప్రభుత్వ కార్యక్రమాలను విజవంతం చేయడానికి సహకరిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


## తాత్కాలిక ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

**నూజెండ్ల,ఆగస్ట్18,ప్రభాతవార్త:** మండలంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులలో అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను( తాత్కాలిక ఉపాధ్యాయులు ) నియమించుకునేందుకు ఆసక్తిగల క్వాలిఫైడ్ అభ్యర్థులనుండి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం ఉన్నట్టు మండల విద్యాశాఖ అధికారులు నలబోలు రవిచంద్ర,కాకర్ల సత్యనారాయణ తెలియజేశారు. అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ గా పని చేయాలనే ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ,బీఈడి కలిగి ఉండాలి. స్థానిక అభ్యర్థులకు,టెట్ అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,నూజెండ్లలో ఒక హిందీ స్కూల్ అసిస్టెంట్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ములకలూరులో ఒక ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్,ముక్కెళ్లపాడు స్కూల్ నందు ఒక హిందీ స్కూల్ అసిస్టెంట్,ఒక బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

## పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా అన్నా మల్లికార్జునరావు ఎన్నిక

### పల్నాడు జిల్లా కోశాధికారిగా రెడ్డినగేష్‌బాబు ఎన్నిక....

**వినుకొండ,ఆగస్ట్18,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన చందోలు సూర్యప్రకాష్‌రావు వినుకొండ పర్యటనలో దాతల సహాయంతో స్థలం కొని నరసరావుపేటలో భవనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షులు గుడివాడ చినగురునాథరావు,ఆర్యవైశ్య సదా వత్తు



భాగంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినుకొండ ఆర్యవైశ్యుల పెద్దల సమక్షంలో ఆర్యవైశ్య సంఘం పల్నాడు జిల్లా కోశాధికారిగా రెడ్డి నగేష్‌బాబును ఎన్నుకోవడం జరిగింది. అలాగే వినుకొండ పట్టణ అధ్యక్షుడిగా అన్నా మల్లికార్జునరావును ఎన్నుకొని వారిద్దరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఏ ఇబ్బంది జరిగినా అండగా ఉంటానని పల్నాడుజిల్లాలో ఆర్యవైశ్య సంఘానికి సంఘం అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి,గౌరవ అధ్యక్షులు పెండ్యాల శ్రీనివాసరావు,తాతా సత్యనారాయణ పెరుమాళ్ళ అమర్నాథ్,మోటమర్రి వెంకట నరసింహారావు,గట్టుపల్లి శ్రీనివాసరావు, అచ్యుత కోటేశ్వరరావు,మేడం రమేష్,రెడ్డి బంగారయ్య, కొల్లిపర సుబ్రహ్మణ్యం,పవన్, సనిశెట్టి లక్ష్మీనారాయణ, మండవ కిరణ్, తాత రమేష్,జీకే అరవపల్లి సైదారావు, నరసింహారావు, పువ్వాడ నాగేశ్వరావు,పొత్తూరి రాము,గర్రె అనిల్,అప్పల రాజా,ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ అస్లామ్‌కు జాతీయ అవార్డు

**చిలకలూరిపేట,ఆగస్ట్18,ప్రభాతవార్త:** ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్ డైరెక్టర్ శ్రీ మహమ్మద్ అస్లామ్ గారికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. విద్యారంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా"చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్-2026 అవార్డును అందుకున్నారు.అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ జాతీయ సామాజిక శ్రేష్ఠతా పురస్కారాలు-2026 కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంతో పాటు విద్య ద్వారా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న మహమ్మద్ అస్లామ్ సేవలను గుర్తించిన జాతీయ సంస్థ ఆయనకు ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందించింది.అనాథ పిల్లలకు ఉచిత విద్యను అందించడం, బాలికల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం, ఆధునిక విద్యను అందరికీ చేరువ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుకుగా భాగస్వామ్యం అవుతున్నారు. విద్య అనేది కేవలం పాఠశాల తరగతి



గదులకే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషి ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యను అందిస్తూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంతో పాటు సామాజిక బాధ్యతతో పలు సేవా కార్యక్రమాలను కొనసాగించడం మహమ్మద్ అస్లామ్ ప్రత్యేకతగా నిలిచింది. సమాజం మరియు దేశ నిర్మాణంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా అందజేశారు.జాతీయ స్థాయిలో లభించిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్‌కు, చిలకలూరిపేట ప్రాంతానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. మహమ్మద్ అస్లామ్‌కు జాతీయ స్థాయిలో ఈ గౌరవం దక్కడం పట్ల ఆక్స్‌ఫర్డ్ ఐఐటి స్కూల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఘనంగా అభినందనలు తెలిపారు.విద్యతో పాటు సామాజిక సేవను సమన్వయం చేస్తూ మరింత మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షిస్తూ మహమ్మద్ అస్లామ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొణిదెల నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపిన మండలనేని చరణ్ తేజ

**చిలకలూరిపేట,ఆగస్ట్18,ప్రభాతవార్త:** చిలకలూరిపేట: జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబును ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నియమించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన యువ నాయకులు ప్రదాత మండలనేని చరణ్ తేజ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కొణిదెల నాగబాబుకు మండలనేని చరణ్ తేజ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ, రాష్ట్రంలో పచ్చదనం విస్తరణ, హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీని మరింత పటిష్టంగా ముందుకు నడిపించడంలో నాగబాబు నాయకత్వ పటిమ, సేవా తత్పరత ఎంతగానో దోహదపడగలవని ఆయన ఆకాంక్షించారు.ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించడంతో పాటు మొక్కల పెంపకం, విస్తృతంగా వృక్షారోపణ, అడవుల అభివృద్ధి వంటి



కార్యక్రమాలను ప్రజా ఉద్యమాలుగా మలచడంలో నాగబాబు విశేషంగా కృషి చేస్తారన్న విశ్వాసాన్ని చరణ్ తేజ వ్యక్తం చేశారు.హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం దిశగా ఆయన ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ సొసైటీ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ కొణిదెల నాగబాబుకు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు

**రొంపిచర్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ నెల 16న జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ లో పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు.వారు వచ్చే నెల 11,12,13 తేదీల్లో విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని, ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ఆడతారని అన్నారు.ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ యిట్టె ఏడుకొండలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 08:45 Page 1



## భూముల రీసర్వేతో రైతులకు ప్రయోజనం

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 18, ప్రభాతవార్త:** భూముల రీసర్వే కార్యక్రమం ద్వారా రైతులకు పూర్తి హక్కులు లభిస్తాయని భట్టి ప్రోలు మండల తహశీల్దార్ జి.నాగరాజు చెప్పారు.మంగళవారం మండలంలోని ఓలేరులో 6వ విడత భూ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నదని చెప్పారు.భూ సంబంధ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో విఆర్వో ఎల్.సురేష్,రెవెన్యూ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.




# బాపట్ల జిల్లా వార్త



## రేపల్లెలో ఎఐటియుసి ధర్నా

**రేపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణంలోని బస్టాండ్ సెంటరు నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్,హమాలీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ధర్నా చేశారు.ఆర్డీవో బి.శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎఐటియుసి బాపట్ల జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని,కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ, సిపిఐ,సిఐటియు,ఎఐటియుసి నాయకులు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

## సామాజిక న్యాయంలో చారిత్రక ముందడుగు

**బాపట్ల,ఆగస్టు18,ప్రభాతవార్త.ప్రతినిధి:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) కు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా ఒక చారిత్రక అడుగని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అభివర్ణించారు.ఈ మేరకు కూటమి ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు.బీసిలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించాలనే బలమైన సంకల్పంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో 33 శాతం చొప్పున బీసీ రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా, ప్రజాస్వామ్య పాలనలో బహుజనుల భాగస్వామ్యం మరింత ఇనుమడించనుందన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వస్తోందన్నారు.తెలుగు జాతి గర్వించదగ్గ మహానేత నందమూరి తారక రామారావు (అన్న ఎన్టీఆర్) నాయకత్వంలోనే బీసీలకు రాజకీయ అధికారంలో సముచిత స్థానం లభించిందన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల సమగ్రాభివృద్ధికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు.



**సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన :** కేవలం రిజర్వేషన్లకే పరిమితం కాకుండా, బీసీల సర్వత్రా అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు.కులకుల వృత్తులకు ప్రోత్సాహం: సాంప్రదాయ చేతివృత్తులకు ఆర్థిక చేయూత.విద్య, నైపుణ్యాభివృద్ధి: బీసీ యువతకు ఉన్నత విద్యలోను, ఉపాధి రంగాల్లోను ప్రత్యేక అవకాశాలు.వసతి గృహాల మెరుగుదల: గురుకు ల ప్రతిగృహాల్లో మౌలిక వసతుల కల్పన.

**ఆర్థిక సాధికారత:** యువత స్వయం ఉపాధి పొందేలా ప్రత్యేక వ్యాపార అవకాశాల కల్పన. "బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కేవలం ఒక ఎన్నికల హామీ మాత్రమే కాదన్నారు.బహుజనులకు రాజకీయంగా పూర్తి సాధికారత కల్పించాలనే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.బీసీలకు న్యాయం.. బీసీలకు అవకాశం.. బీసీలకు అధికారం" అనే స్పష్టమైన లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు.

## ప్రయాణీకుల సమస్యలకు నిలయంగా

# పల్లెకోన రైల్వేస్టేషన్

**రేపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

రేపల్లె-తెనాలి రైలు మార్గంలోని రైల్వే స్టేషన్లు ప్రయాణీకులకు అసౌకర్యంగా మారుతున్నా రైల్వే శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అపరిశుభ్రతకు ఆలవాలంగా మారుతున్నాయి.ప్లాట్‌ఫారాలపై చెట్లు పెరుగుతున్నాయి.మదుగు ఏర్పడటంతో సర్పాలు,తేళ్ళు వంటివి సంచరిస్తున్నాయని ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో రైల్వే శాఖ విఫలమైంది. ఫలితంగా ప్రయాణీకులు సమస్యలతో సతమతమవుతున్నారు. భట్టి ప్రోలు మండలంలోని పల్లెకోన రైల్వే స్టేషన్ ప్రైవేటుపరమైనప్పటి నుండి సమస్యలు మొదలయ్యాయి.రైల్వే స్టేషన్ అభివృద్ధి వ్యవహారంలో రైల్వే శాఖ అధికారులు స్పందించడంలేదని ప్రయాణీకులు పేర్కొంటు న్నారు.రైల్వే ప్లాట్‌ఫారంపై నాపరాళ్ళు కుంగుతున్నాయి.ఖాళీలు ఏర్పడుతున్నాయి.ప్లాట్ ఫారం ఎగుడు దిగుడు కారణంగా ప్రయాణీ కులు పడిపోతున్నారు. గాయపడుతున్నారు.ఈ రైల్వే స్టేషన్‌లో ప్రతి రైలు ఆగివెళ్ళుతోంది .రేపల్లె నుండి వికారాబాద్, సికింద్రాబాద్, మార్కాపురం,గుంటూరు,తెనాలి ప్రాంతాలకు రైలు సర్వీసులు తిరుగుతున్నాయి. రాత్రి సమయంలో సికింద్రాబాద్-రేపల్లె,రేపల్లె- వికారాబాద్,తెనాలి-రేపల్లె, రేపల్లె-మార్కాపురం రోడ్ ఎక్స్‌ప్రెస్,ప్యాసింజరు రైళ్ళపై ఆధారపడుతున్న ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.పల్లెకోన రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై ఆయా సమయాలలో రైలు కోసం వేచి ఉండే ప్రయాణీకులు సర్పాలు,తేళ్ళ వలన అపాయం కలుగుతుందేమోనని భయపడుతున్నారు.ప్లాట్ ఫారంపైనే మద్యం సేవించే వ్యసనపరుల వలన మహిళా ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.కరోనా వచ్చిన దగ్గర్నుంచి రైల్వే సైకిల్ స్టాండ్ మూసివేశారు.ప్రస్తుతం రైల్వే సైకిల్ స్టాండ్‌ను పునరుద్ధరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.రైల్వే వాహనాల స్టాండ్‌లోనే తమ వాహనాలను పార్కింగ్ చేసుకుని రైళ్ళకు వెళుతున్నారు.అయితే ద్విచక్ర వాహనాలలోని పెట్రోల్ చోరుల కారణంగా అపహరణకు గురవుతోందని ప్రయాణీకులు వాపోతున్నారు. కారుమూరు,ఆళ్ళమూడి ,రాచూరు, పదమటపాలెం ,కోనేటిపురం తదితర గ్రామాలకు చెందిన ప్రయాణీకులు పల్లెకోన రైల్వే స్టేషన్ నుండి ప్రయాణిస్తున్నారు.వీరి వాహనాలను రైల్వే స్టాండ్‌లోనే నిలుపుకుని వెళ్ళొస్తున్నారు.రైల్వే స్టేషన్ రోడ్ ప్రారంభంలోని రైల్వే స్థలంలో కూడా వాహనాల పార్కింగ్ కొనసాగుతోంది.రైల్వే శాఖ ఆదాయానికి భారీగానే గండిపడుతోంది.రైల్వే సైకిల్ స్టాండ్‌ను పునరుద్ధరిస్తే రైల్వే శాఖకు ఆదాయం సమకూరుతుందని ప్రయాణీకులు సూచిస్తున్నారు.పల్లెకోన రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్,రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని చెట్లు,పొదలను తొలగించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.మరుగుదొడ్ల సదుపాయాన్ని వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.రైల్వే ప్లాట్‌ఫారాన్ని ఆధునీకరించాలని,అప్రోచ్ రహదారిని హాస్పిటల్ రోడ్‌కు అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు.ఇప్పటికైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.



## ఎన్నికలకు సంబంధించిన విధులు చాలా ముఖ్యమైనవని

# అధికారులు బాధ్యతతో నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,ఆగస్టు18,ప్రభాతవార్త.ప్రతినిధి:**

ఎన్నికలకు సంబంధించిన విధులు చాలా ముఖ్యమైనవని వాటిని అధికారులు బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరంలో ఎన్నికలు, ప్రజా సమస్యల పరిష్కారం, 22ఎ, ఇతరములు, స్థల సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్ పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూఎన్నికలకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్న అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.సంక్లిష్ట ఓటర్ సవరణ జాబితాకు సంబంధించి నోటీసులు ఇచ్చుటలో వాటి పై సంబంధికులతో మాట్లాడు విషయంలో చీరాలలో ఎక్కువగా పెండింగ్ ఉన్నాయన్నారు. హియరింగ్ అనేది ఈఆర్వో ఏఈఆర్ఓ స్థాయిలో జరగాలన్నారు. చిన్న చిన్న తప్పులు ఉంటే వాటిని బిఎల్ఓ స్థాయిలో పరిష్కరించాలన్నారు. దరఖాస్తుదారుని వద్ద నుండి అందుబాటులో ఉన్న పత్రాలను అప్లోడ్ చేయాలన్నారు. ఈఆర్ఓ, ఏఈఆర్ఓ స్థాయిలో నిర్వహించే హియరింగ్ ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు.బిఎల్ఓ వారిగా పెండింగ్ పై ఆయన ఆరా తీశారు. హియరింగ్ కొరకు ప్రణాళిక ఏర్పాటు చేసుకొనిఆప్రణాళిక ప్రకారం వాటిని పూర్తి చేయాలన్నారు.బిఎల్ఓ స్థాయిలోఫామ్ 6,7,8 పెండింగ్ ఉండుటకు కారణాలపై ఆయన ఆరా తీశారు.ఇప్పటికే డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ రోల్ ముద్రితమై ఉండాలని, వాటిని ప్రతి పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ స్టేషన్లో తనిఖీకి వచ్చినప్పుడు డ్రాఫ్ట్ రోల్స్ జాబితా కనిపించని యెడల సంబంధిత బిఎల్ఓ పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల గురించి ఏమైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కొరకు వచ్చే దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్థం చేసుకొని వాటికి సరైన పరిష్కారం చూపాలనిఅధికారులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపరిష్కారంపై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిందన్నారు. అందులో వారు అడిగిన ప్రశ్నలకు నూరు శాతం ప్రతికూలం వచ్చిన మండల విఆర్ఓ లపై ఆయన చర్యలకు ఆదేశించారు.అధికారులు దరఖాస్తు దారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అధికారులు ఇచ్చే సమాధానంపై దరఖాస్తుదారు సంతృప్తి వ్యక్తపరిచే విధంగా వారితో మాట్లాడాలన్నారు. దరఖాస్తుదారులు వచ్చినప్పుడు వారి వద్ద నుండి అవసరమైన పత్రాలు మాత్రమే తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తుదారునికి ఎండార్స్మెంట్ ఇవ్వాలని, అందులో తప్పక తేదీ ఉండాలని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలో జిల్లా కలెక్టర్ స్వయంగా రూపొందించిన చెక్ లిస్ట్ ను అంశాల వారీగా ఆయన వీఆర్వోలకు వివరించారు. లాగిన్ లో వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు చూసుకొని వాటిని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించిన అధికారులకు అవార్డులు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు.ప్రతి కార్యాలయంలో ప్రజలు అధికారులను కలవడానికి సందర్శన వేళలను ఉంచాలని ఆయన చెప్పారు. వాటికి సంబంధించి ఫోటోలు తీసి వారికి పంపాలన్నారు.22ఎ కేసులకు సంబంధించి ఏమైనా సమస్యలు,సందేహాలుఉంటే వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.వీఆర్వో స్థాయిలో ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారాప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వాటిని వినియోగించుకునే విధంగా చూడాలన్నారు.రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించిన భూముల పట్టాదారు పాసు పుస్తకాల్లో ఇతరములు లేకుండా చూడాలన్నారు.జిల్లాలోకార్యాలయాల స్థాపనకు,రైతు బజార్ల ఏర్పాట్లకు కావలసిన భూసేకరణ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, వీక్షణ సమావేశం ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని మండల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వీఆర్వోలు, ఈఆర్వోలు, ఏ ఈ ఆర్ వో లు, మరియు తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ సమావేశాలలో కార్మికుల సమస్యలపై చర్చించాలి

**రేపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కార్మికుల,ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాలలో సమగ్రంగా చర్చ జరపాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.నాగాంజనేయులు కోరారు.మంగళవారం రేపల్లె మండల తహశీల్దార్ కార్యాలయంలో కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తూ కార్పొరేట్ సంస్థల నిర్వాహకులు ఆదానీ అంబానీల లాభాల కోసమే పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.పార్లమెంట్,అసెంబ్లీ సమావేశాలలో ప్రజా ప్రతినిధుల వేతనాల పెంపు కోసం నిర్ణయం తీసుకున్నట్లే కార్మికుల వేతనాల పెంపుపై ఎందుకు చర్యలు తీసుకోరని నాగాంజనేయులు ప్రశ్నించారు.కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. స్కూలు ఆయాల,నైట్ వాచ్‌మెన్స్,పంచాయతీ కార్మికుల వేతన,పిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.రాష్ట్రంలో 73 రకాల షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలను సవరించి 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వేతనాలను సవరించని పరిస్థితి కొనసాగుతున్నదని పేర్కొన్నారు.ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిత్యావసర వస్తువుల ధరలు 300 శాతం పెరిగినా కార్మికుల వేతనాలను పెంచడంలో పాలకులు తాత్సారం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పంజాబ్,రాజస్థాన్, హర్యానా,ఒరిస్సా రాష్ట్రాలలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన కోరారు.ఇటీవల కాలంలో 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు మార్పు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని కార్మికులు ఎప్పటికీ మర్చిపోరని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్లు కార్మికులకు ఇబ్బందికరంగా మారాయన్నారు.కార్మిక చట్టాలు అమలు కావడంలేదని పిఎఫ్,ఈఎస్ఐ సైతం అందటం లేదని ఆయన తెలిపారు.పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాగాంజనేయులు కోరారు.పంచాయతీ కార్మికులకు రూ.6 వేల వేతనం మాత్రమే నిర్ణయించడం, నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడం వంటి పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన పేర్కొన్నారు.హమాలీ,ఆటో వర్కర్లు,వీధి విక్రయదారుల కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నేతలు జి.నాగమల్లేశ్వరమ్మ,అనూష,వై.కనకదుర్గ,ఆదిన,మోహనరాణి,క్రీస్తుదానం,శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



## విద్యా వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

### - బాపట్ల మండలంలో 12 పోస్టులు - ఈనెల 21లోగా దరఖాస్తులు

**బాపట్ల,ఆగస్టు18,ప్రభాతవార్త.ప్రతినిధి:** బాపట్ల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మ్యాథ్స్, బయలాజికల్ సైన్స్, ఇంగ్లీష్, హిందీ, ఇంగ్లీష్ మీడియం బోధనకు వాలంటీర్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా మండల విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ఎస్. నిరంజన్, డి. ప్రసాదరావు తెలిపారు.స్థానిక విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టెట్, బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన జరుగుతాయన్నారు.అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** మొత్తం 12 విద్యా వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిలో మ్యాథ్స్ 1, బయలాజికల్ సైన్స్ 4, ఇంగ్లీష్5, హిందీ2 పోస్టులు ఉన్నాయని ఆయన తెలిపారు.పాఠశాలల వారీగా.జెడ్పీహెచ్‌ఎస్ పూండ్లలో మ్యాథ్స్ 1 పోస్టు, జెడ్పీహెచ్‌ఎస్ జమ్ములపాలెంలో బయలాజికల్ సైన్స్ పోస్టు లేదు, జెడ్పీహెచ్‌ఎస్ వెదుళ్లపల్లిలో ఇంగ్లీష్ పోస్టు లేదు.జెడ్పీహెచ్‌ఎస్ నందిరాజుతోటలో ఇంగ్లీష్1 పోస్టు ఉంది, జెడ్పీహెచ్‌ఎస్ కేబీ పాలెం బాపట్లలో ఇంగ్లీష్1 పోస్టు ఉంది.జెడ్పీహెచ్‌ఎస్ ఎం.పి.వి.పాలెంలో ఇంగ్లీష్1 పోస్టు ఉంది. ఎస్.ఎం. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ 2, ఇంగ్లీష్2, హిందీ/ఇతర భాషా బోధనకు2 పోస్టులు ఉన్నాయన్నారు.మున్సిపల్ హైస్కూల్‌లో బయలాజికల్ సైన్స్ 2 పోస్టులు ఉండగా, ఇంగ్లీష్ పోస్టు ఖాళీ లేదు.అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరారు.



## బాపట్ల మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

### సేవలనుఅందరూ సద్వినియోగం చేసుకోవాలి: స్వర్ణ గ్రామ అధికారి శ్రీరాములు

**బాపట్ల,ఆగస్టు18,ప్రభాతవార్త.ప్రతినిధి:** బాపట్ల మండలంలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు కోరారు. మండలంలోని ఈస్ట్ బాపట్ల,ఈతేరు,వెదుళ్ళపల్లి,అడవి2,కంకటపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో మంగళవారం ఆయన తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ గ్రామ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ ఈ ఆధార్ నమోదు సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన్నారు.ఇంకా ఆధార్ నమోదు కాని విద్యార్థుల కోసం వారు చదువుకుంటున్న పాఠశాలలు, కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.ఈస్ట్ బాపట్లలోని ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి,ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవతోనే ఆత్మ సంతృప్తి

**రేపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:** సమాజంలో పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రేపల్లె చైతన్య వేదిక అధ్యక్షుడు,కొండపల్లి పార్వతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు.మంగళవారం ఇసుకపల్లిలోని ఆంధ్ర క్రైస్తవ లూథరన్ చర్చి ఆవరణలో కొండపల్లి పార్వతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళలు, వితంతువులకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు తోచిన విధంగా సమాజానికి సేవ చేయడమే గొప్ప పుణ్యమని తెలిపారు.సమాజంలోని పేదలు,ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం వలన ఆత్మసంతృప్తి కలుగుతుందని అభిప్రాయపడ్డారు.ఇటువంటి విధానం సామాజిక ఐక్యతకు దోహదపడుతుందని చెప్పారు.సేవా కార్యక్రమాల వలన సమాజంలో అసమానతలు తొలగిపోతాయని మానవత్వం పరిమళిస్తుందని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ చెప్పినట్లు కుల,మత,ప్రాంత భేదాలకతీతంగా ఐక్యతతో దేశ సమగ్రత,సమైక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రజలు గుర్తుంచాలన్నారు.దేశానికి మనమేమిస్తున్నామనే ఆలోచన చేయాలన్నారు.రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావును వృద్ధ మహిళలు,వితంతువులు దుశ్శాలువ,పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి లూథరన్ చర్చి కోశాధికారి అజయ్, బాపట్ల జిల్లా దళిత పోరాట సమితి అధ్యక్షుడు వాగోలు బాబూరావు,రేపల్లె మండల లీగల్ వాలంటీర్ రాచాబత్తుని శ్రీనివాసరావు,కన్నా నటరాజు,గాలి సురేష్,రమేష్,షేక్ కరీముల్లా,మురళి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తు ఆహ్వానం

**నగరం, ఆగస్టు 18, ప్రభాతవార్త:** తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయ నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరం మండల విద్యాశాఖ అధికారి కె. కోటేశ్వరరావు,వి. వీరాంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరం మండలం పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు నెలకు 12,500, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నెలకు 10వేల రూపాయలు గౌరవేతనం ఇవ్వబడుతుందని, మండలంలోని 5 పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తు చేయదలుచుకున్న అభ్యర్థులు ఆగస్టు 21వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు నగరం మండల ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించవలసినదిగా తెలియజేశారు.

## పిఎంఎఫ్‌బివై గడువు పెంపు

**రేపల్లె, ఆగస్టు 18, ప్రభాతవార్త:** వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పిఎంఎఫ్‌బివై) గడువు ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి అవ్వారు మహేష్‌బాబు తెలిపారు.మంగళవారం మండలంలోని కారుమూరు,పేటేరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యూరియా,డిఎపి వంటి సమస్యలు ఉంటే వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు చేయనటువంటి రైతులు ప్రత్యామ్నాయంగా పెసర,మినుము పంటలను సాగు చేయాలని తెలిపారు.పిఎండిఎస్ విత్తనాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఐవో సుమంత్,విఎఎలు యశస్విని,రాయల్‌బాబు, ఎపిసిఎన్ఎఫ్ వినయ్‌కుమార్,రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా జడ్‌పిటిసి సుబ్బయ్య జన్మదిన వేడుకలు

**నిజాంపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :** జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్రా సబ్బయ్య అభిమానులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. సుబ్బయ్యకు, కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో భార్య నాగమణి, కుమారుని సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదెపా కార్యకర్తలు, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.



9 GNTFFF_19-8Pg5.qxd 19/Aug/26 12:32 AM Page 1



# సిజెపి నిరసనలో పోలీసు చర్యలపై విచారణ కమిటీ




## రిటైర్డ్ జడ్జి నాయకత్వంలో ఏర్పాటు: సుప్రీంకోర్టు

## ఆందోళనల్లో 2,873 మంది పాత నేరస్తులు: ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జులై 20న జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు అతిక్రమించారన్న ఆరోపణలను పరిశీలించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి తదితరులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రతిపాదిత ఉన్నత స్థాయి కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు కోరుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నిరసన సందర్భంగా తాము అధిక బలప్రయోగం చేయలేదని ఢిల్లీ పోలీసులు ఖండించినప్పటికీ, జాతీయ రాజధానిలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను పరిశీలన కోసం కమిటీకి అప్పగించాలని ఆదేశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ కమిటీ, మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను, పోలీసుల ప్రతిస్పందనను పరిశీలించి, సుప్రీంకోర్టుకు తగిన చర్యలను సిఫార్సు చేస్తుంది. లైంగిక వేధింపులకు గురయ్యామని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా నిరసనకారుల ఫిర్యాదులను కూడా ఈ ప్యానెల్ పరిశీలిస్తుంది.

జులై 20న జరిగిన నిరసనలో 240 మంది పోలీసులు గాయపడ్డారని, ఆ నిరసనలోకి 'చరిత్ర నేరగాళ్లు' చొరబడ్డారని ఆరోపిస్తూ, హత్య, అత్యాచారం, అపహరణలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన 2,873 మంది వ్యక్తులు మినహా, మిగిలిన వారిపై ఉన్న కేసులను కొట్టివేయవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. 'చలో సంసద్' నిరసన సందర్భంగా బలప్రయోగం చేయడాన్ని ఢిల్లీ పోలీసులు గట్టిగా సమర్థించుకున్నారు. ఈ ఆందోళనను 'అసాంఘిక శక్తులు', 'చరిత్ర నేరస్తులు' హైజాక్ చేశారని, దీని ఫలితంగా శాంతిభద్రతల విఘాతం ఏర్పడి 240 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారని వారు ఆరోపించారు. సంఘటనా స్థలంలో ఉన్న 92 మందిపై 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో 47 మంది 'చరిత్ర నేరస్తులు' అని వారు తెలిపారు.

నిరసనకారులపై మితి మీరిన బలప్రయోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్లకు ప్రతిస్పందనగా న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ దాఖలు చేసిన అఫిడవిట్‌లో, తమ చర్యలను కోర్టు నియమించిన కమిటీ ద్వారా పరిశీలించు కోవడానికి ఢిల్లీ పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంటు వైపు నిరసనకారులు ముందుకు సాగకుండా నిరోధించడానికి పదేపదే చేసిన హెచ్చరికలు, ప్రయత్నాలను పోలీసులు పట్టించుకోక పోవడంతోనే బలప్రయోగానికి పాల్పడ్డారని ఢిల్లీ పోలీసులు సమర్పించారు. "పోలీసులు బలప్రయోగం చేసిన విషయాన్ని న్యాయస్థానం నియమించిన కమిటీ పరిశీలిం చవచ్చు. ఢిల్లీ పోలీసులు అటువంటి కమిటీకి పూర్తి సహకారం అందించి, అవసరమైన అన్ని వివరాలను అందిస్తారు" అని శర్మ అన్నారు.

## పిఎంకేర్స్ ఫండ్ నిధులు రూ.8452.07 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024 -25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ.5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ.479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ.92.83లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ.324.66కోట్ల రిఫండ్లు కూడా ఈ ఖాతాలోచేరాయి. కొవిడ్19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం.

## వందేమాతరం వివాదం: బిజెపిపై ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందేమాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పాడినదే తామూ పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపించిందని గుర్తుచేశారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా అని ప్రశ్నించారు.

## జార్ఖండ్‌లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఆందోళన

**రాంచి,ఆగస్టు 18:** జార్ఖండ్‌లోని రాంచీలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం రాష్ట్ర సచివాలయంఎదుట ఆందోళనకు దిగారు. ఓపక్క జెపిఎస్‌సిని రద్దు చేయాలంటూ ఉద్యోగార్థుల నిరసనతో పరీక్షలను మొత్తం రద్దుచేసిన జార్ఖండ్‌ప్రభుత్వం నిర్ణయంతో ఇపుడు జెపిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనితో జార్ఖండ్ ఉద్యమంలో రివర్స్‌గేర్‌ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షతో పాటు 2014 నుంచి నిర్వహిం చిన అన్ని ఔట్‌సోర్సింగ్ పరీక్షలను రద్దు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి.

# తినేదంతా నెయ్యేనా?



## హైదరాబాద్‌లో విస్తరిస్తున్నకల్తీనెయ్యి మాఫియా

- 130 చోట్ల దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్, హెచ్. ఫాస్ట్
- 36 టన్నుల కల్తీనెయ్యి, రసాయనాలు స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీగా కల్తీ ఆహార ఉత్పత్తులు పట్టుబడ్డాయి. నగర టాస్క్‌ఫోర్స్ పోలీసుల తో పాటు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్ ఫాస్ట్), బల్దియాలోని ఫుడ్ సేఫ్టీ విభాగం నగర వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యితో పాటు దీని తయారీకి వాడే పాం ఆయిల్, డాల్డా సహా రసాయనాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వ్యాపారులు, వీటిని విక్ర యిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని పోలీసు కమి షనర్ వి.సి సజ్జన్నర్ తెలిపారు. మంగళవారం కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు మాఫియాగా మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలతో పాటు వీటి వి క్రయ సంస్థల గురించి సమాచారం అందగానే దాడులు చేబట్టినట్లు తెలిపారు. మొత్తం 130 ప్రాంగణాల్లో 39 తయారీ కేంద్రాలతో పాటు 91 విక్రయ కేంద్రాలలో దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యి పట్టుబడిందని ఆయన తెలిపా రు. పట్టుబడ్డ కల్తీ నెయ్యి శాంపుల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని ఆయన వెల్లడించారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు విచారిస్తున్నారని కమిషనర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యిలో 25,5 టన్నుల వివిధ రకాల నూనెతో పాటు 8.7 టన్నుల క్రీం వు ందని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీ లో వాడేందుకు 1200 లీటర్ల పాం ఆయిల్, 600 లీటర్ల వనస్పతి, కృత్రిమ సువాసన కోసం ఆరు బాటిళ్ల రసాయనాలు, 30 కిలోల పిండి పదార్థం వుందని ఆయన వెల్లడించారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో నేరగాళ్ల పక్కాగా వ్యవహరిస్తు న్నట్లు కమిషనర్ తెలిపారు. నెయ్యి తయారీకి పాల నుంచి వచ్చిన వెన్న ముఖ్యం కాగా కల్తీ నెయ్యిలో దీనికి భిన్నంగా పాం ఆయిల్‌తో పాటు రసాయనాలు, కొద్దిపాటి పాలపొడర్‌ను వాడుతున్నారని ఆయన తెలిపారు. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యి చూసేందుకు అసలైన నెయ్యిలాగే వుండేలా చక్కగా ప్యాకింగ్ చేసి 100 గ్రాముల నుంచి ఒక్క కిలో వరకు డబ్బాలలో వుంచి అమ్ముతున్నారని ఆయన తెలిపారు. వీటికి ప్రీమియం నెయ్యి, ప్యూర్ నెయ్యి, పార్క్ ఫ్రెష్ నెయ్యి, నేచురల్ నెయ్యి అనే పేర్లను వాడుతున్నారని కమిషనర్ తెలిపారు. అయితే వీటిపై ఎ లాంటి లైసెన్స్ నంబర్, బ్యాచ్ నంబర్‌లు వుండడం లేదని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యిని ఎక్కువగా పూజ గదుల్లో వాడే దీపాలకు, రెస్టారె ంట్లకు, టిఫిన్ సెంటర్లకు, స్వీట్ షాపులకు, ఆయుర్వేద మందుల దుకాణాలకు, డెయిరీ షాపులు, స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నట్లు తేలిందని ఆయన తెలిపారు

# 'హర్మజ్' కొత్త అమెరికా ప్రాంతం!

## ట్రూత్‌లో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మజ్ జలసంధిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో హోర్ముజ్ జలసంధిని న్యూ యూఎస్ టెరిటరీగా పేర్కొంటూ ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. వాషింగ్టన్–టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు నిర్ణయించిన 60 రోజుల చర్చల గడువు ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ట్రంప్ షేర్ చేసిన మ్యాప్‌లో పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి చుట్టూ ఓ వృత్తాన్ని గీసి, దానిపై కొత్త యుఎస్‌ప్రాంతం అని పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ మాట్లాడుతూ హర్మజ్ జలసంధిపై ట్రంప్‌కు ఉన్న భ్రమ త్వరలో తొలగిపోతుందని హెచ్చరించారు. త్వరలో హర్మజ్ జలసంధిపై ట్రంప్ భ్రమ తొలగిపోతుంది లేదంటే ఆ భ్రమలో ఉన్న వ్యక్తి భ్రమలను మేమే సరిదిద్దుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. హర్మజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. పోలీస్ అకాడమీ సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఇంటెలిజెన్స్‌లో మాట్లాడుతూ త్వరలోనే హర్మజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అన్నారు. అంతకు ముందు కూడా హర్మజ్‌పై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వారికి నియంత్రణ లేదు. పూర్తి నియంత్రణ మనదే. అది మనదే అని విలేకరులతో అన్నారు. అమెరికా నౌకాదళం జలసంధిలోని మైన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టిందని కూడా వెల్లడించారు. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. హర్మజ్ జలసంధి ఇరాన్‌కు చెందినదే, ప్రస్తుతం కూడా ఇరాన్‌దే, భవిష్యత్తులోనూ ఇరాన్‌దేనని ఘరీబాబాదీ స్పష్టం చేశారు. జలసంధిని ఎప్పుడు మూసివేయాలి, ఎప్పుడు తెరవాలన్నది ఇరాన్ ఆదేశాల ప్రకారమే జరుగుతుందన్నారు. ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంహోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యే ముందు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇక్కడ నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇరాన్ ఈ జల మార్గంలో రవాణాను పరిమితం చేస్తూ యుద్ధంలో ఒత్తిడి పెంచేందుకు దీనిని వ్యూహాత్మక సాధనంగా ఉపయోగిస్తోంది. ట్రాన్సిట్ మార్గంపై ఇరాన్–ఒమన్ ఒప్పందంఇదిలా ఉండగా హర్మజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన ట్రాన్సిట్ మార్గం మ్యాప్‌పై ఇరాన్, ఒమన్ మధ్య అవగాహన కుదిరింది. దీనిపై సంయుక్త ప్రకటనతో కూడిన తుది ఒప్పందాన్ని రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది.

## మూడు రాష్ట్రాలకు పార్టీ కొత్త ఇన్‌ఛార్జిలు: బిజెపి ఎన్నికల గేమ్ ప్లాన్ షురూ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** రాబోయే అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది భారతీయ జనతా పార్టీ. గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులు చేసింది. ఇప్పటికే జాతీయ కార్యవర్గాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. పలు కొత్త ముఖాలకు ఇందులో చోటు కల్పించింది. సీనియర్లకు కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రాల వారీగా సమీకరణాలను బేరీజు వేసుకుని పాత, కొత్త నేతల కలయికతో ఈ నూతన కార్యవర్గాన్ని పునర్నిర్మించుకుంది. దీనికి కొనసాగింపుగా మరిన్ని నిర్ణయాలను తీసుకుంటోంది బీజేపీ హైకమాండ్. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాలకు నూతన ఇన్‌ఛార్జీలను నియమించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌కు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఇన్‌ఛార్జ్ పదవి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినోద్ తావ్డేకు లభించింది. తోడుగా జగదీష్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులు అయ్యారు. యూపీలో క్షేత్రస్థాయి సమీకరణాలను సమన్వయం చేయడంలో వినోద్ తావ్డే అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని భావిస్తోన్నారు. వ్యవస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న పంజాబ్‌లో రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు సతీష్ పూనియా అపాయింట్ అయ్యారు. అదే సమయంలో.. బీజేపీకి తిరుగులేని కోటగా ఉంటూ వస్తోన్న గుజరాత్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను రంగంలోకి దించారు. గుజరాత్‌లో సుదీర్ఘకాలంగా ఉన్న పట్టును మరింత పటిష్టం చేయడానికి ఆయన నాయకత్వాన్ని ఎంచుకుంది పార్టీ హైకమాండ్. ఇక నుంచైనా పార్టీ జాతీయ నూతన కమిటీలో కూడా పలు మార్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు ఇవ్వగా, ఆర్ఎస్ఎస్ మాజీ నేత రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా మరోసారి జాతీయ ఉపాధ్యక్షురాలిగా తన స్థానాన్ని నిలుపుకొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు.



## సిఎం విజయ్ వందరోజులపాలనపై అసెంబ్లీకి నివేదిక



**చెన్నై,ఆగస్టు 18:** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్ విజయవంతంగా 100 రోజుల పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరిపాలనా శైలి, పనితీరుపై మంత్రి ఆధవ్ అర్జున పలు విషయాలను వెల్లడించారు. అసెంబ్లీలో పబ్లిక్ వర్క్స్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయ్ పనితీరు, క్రమశిక్షణ తమను ఆశ్చర్యపరుస్తోందని కొనియాడారు. సాధారణంగా నటుల నుంచి రాజకీయ నాయకులుగా మారినవారు నెమ్మదిగా పరిపాలనను అలవాటు చేసుకుంటారని, విజయ్ మాత్రం దీనికి భిన్నమని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే పూర్తి స్థాయి పాలకుడిగా మారిపోయారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఊహించని పరిణామం విజయ్ ప్రస్తుతం రోజుకు సుమారు 18 నుంచి 20 గంటల పాటు అవిశ్రాంతిగా పని చేస్తోన్నారని, ప్రజా సేవలో తీరిక లేకుండా గడుపుతున్నారని ఆధవ్ అర్జున వెల్లడించారు. విజయ్ దినచర్య ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే వివిధ శాఖల మంత్రులకు స్వయంగా ఫోన్లు చేస్తూ, ఆయా విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాల పురోగతిని, తాజా పరిస్థితులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.



# కొందరు ఔట్.. కొందరికి ప్లేస్‌మెంట్

# కేబినెట్ ప్రక్షాళన!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమైన ప్రధాని మోడీకి ఆ అవకాశం లభించలేదు. దీనికి బిజీ షెడ్యూల్ తో పాటు మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల తర్వాత కేబినెట్ ప్రక్షాళన వాయిదా పడింది. అయితే ఊహించిన విధంగానే ఇప్పుడు కేబినెట్ మార్పులకు పావులు కదులుతున్నాయి. కానీ పార్లమెంట్ సమావేశాలకు ముందు అనుకున్న మార్పులే కాదు, అనుకోని మార్పులు కూడా ఇందులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, పీయూష్ గోయల్‌కు బీజేపీలో కోశాధికారి పదవి, అంతకు ముందే మరో ఇద్దరు కేంద్రమంత్రులు రవ్‌నీత్ బిట్టూ, జార్జి కురియన్‌ల రాజీనామాలు ఇలా ఈ మధ్య కాలంలో చాలా మార్పులు జరిగాయి. ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా పలువురు కేంద్రమంత్రులకు రాష్ట్రాల ఇన్ చార్జ్ బాధ్యతలు కూడా దక్కాయి. దీంతో ఇప్పుడు కేబినెట్ ప్రక్షాళన మరింత ఉత్కంఠ భరింతంగా మారింది. ఇందులో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్‌కు కూడా అవకాశం దక్కబోతోందన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన నిన్న ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఈ ప్రచారాన్ని మరోమారు ముమ్మరం చేశారు. దీంతో ఫడ్నవీస్ స్పందించక తప్పలేదు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడల్లా ఇలాంటి ఊహాగానాలు మొదలవుతాయని, కానీ వాటిలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత మేరకు మహారాష్ట్రలోనే ఉన్నానని, ఇకపైనా ఇక్కడే ఉంటానని ఫడ్నవీస్ తేల్చేశారు. మరోవైపు కేంద్రమంత్రి వర్గంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. ఆమె స్థానంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను నియమించేందుకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్నారు. దీంతో పాటు యూపీ, పంజాబ్ వంటి ఎన్నికలు జరిగే రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ఎంపీల్ని కేబినెట్లోకి తీసుకునే ఛాన్స్ ఉంది. వీరిలోనూ సామాజిక సమీకరణాల వారీగా అవకాశాలు దక్కుతాయని భావిస్తున్నారు. ఇక ఈసారి కేబినెట్ విస్తరణలో తెలుగు రాష్ట్రాలకు అవకాశం ఉండబోదని తెలుస్తోంది.

## ఇమ్రాన్‌ను తక్షణమే ఆస్పత్రికి తరలించండి

## పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశం



**ఇస్లామాబాద్, ఆగస్టు 18:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ కుటుంబసభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పిటిఐ) నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాన్ని ఐటిఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకుని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయనను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని, ఆయన ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నార న్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీనేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి: ఒకరు మృతి



**టెహ్రాన్, ఆగస్టు 18:** హర్మజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తు తెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగు తున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం.

## ప్రధాని కార్యాలయంపై డ్రోన్ల దాడి



**బాగ్దాద్, ఆగస్టు 18:** ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని మస్రూర్ బర్జానీ కార్యాలయంపై సోమవారంరాత్రి డ్రోన్ల దాడి జరిగింది. ఈ దాడులకు ఇరానే కారణమని కుర్దిస్థాన్ భద్రతా సంస్థ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతోపాటు కుర్దిస్థాన్ భద్రత, నిఘా సంస్థ 'పరా స్తిన్' అధిపతి నివాసాన్ని కూడా డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. కీలక ప్రభుత్వ, భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమని తెలిపింది. కుర్దిస్థాన్ ప్రధాని మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

## కేంద్రమంత్రి జెపినడ్డాకు యాంజియోప్లాస్టీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేరిన ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ నిర్వహించారు. ముందురోజు ఈ చికిత్స జరగ్గా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వర్గాలు నేడు ఒక అధికారిక ప్రకటనలో తెలిపాయి. ఆయనను కార్డియాలజీ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొన్నాయి. ఈనెల 13వ తేదీ సాయంత్రం జేపీ నడ్డాకు కాస్త నలతగా అనిపించడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు.

## బీహార్‌లో భారీగా ఐపిఎస్‌ల బదలీలు..

**పాట్నా,ఆగస్టు 18:** బీహార్‌ప్రభుత్వం మంగళవారం భారీస్థాయిలో పోలీసు అధికారుల బదిలీలు చేపట్టింది. మొత్తం 17మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. పోలీసుల చర్యలపై తీవ్ర వివాదాలు చెలరేగిన భోజ్‌పూర్, సివాన్ జిల్లాల ఎస్పీలను కూడా బదిలీ చేయడం గమనార్హం. రాష్ట్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సివాన్ ఎస్పీ పూరణ్‌కుమార్ ఝాను బదిలీ చేశారు. గతనెల 25న సివాన్‌లో విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసు బలగాల ఆధ్వర్యంలో ఏకే47 రైఫిల్‌ను వినియోగించిన ఘటన తీవ్ర దుమారం రేపింది.

## డంపర్‌ను ఢీకొన్న వాహనం: 8 మంది కూలీలు మృతి, 32 మందికి గాయాలు



**గ్వాలియర్,ఆగస్టు 18:** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్ట డంతో ఎనిమిదిమంది కూలీలు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన భింద్‌గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి సుమారు 1 గంటకు ఈ ప్రమాదం జరిగింది.

## చంపత్‌రాయ్, మిశ్రాలకు క్లీన్‌చిట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** అయోధ్యరామాలయంలో విరాళాలను చోరీ చేసిన కేసులో సిట్ తన నివేది కను రిలీజ్ చేసింది. రామ జన్మభూమి ట్రస్టు మాజీ చీఫ్ చంపత్ రాయ్‌తో పాటు మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ఆ కేసులో సిట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో 8 మందిని యూపీ సర్కారు అరెస్టు చేసింది. వాస్తవానికి విరాళాలు చోరీ అయినట్లు తెలిసిన కొన్ని రోజులకే చంపత్ రాయ్ తన రాజీనామాను సమర్పించారు. రామాలయ ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు స్పెషల్ ఇన్‌వెస్టిగేటింగ్ టీమ్ క్లీన్ చిట్ ఇచ్చింది. ట్రస్టులో సభ్యుడిగా ఉన్న అనిల్ మిశ్రాకు కూడా సిట్ క్లియరెన్స్ ఇచ్చింది.

# సుభాష్ చంద్రబోస్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి**

**పొన్నూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి పిలుపునిచ్చారు.



స్థానిక కార్యాలయంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూత్‌రాణి మాట్లాడుతూ సాయుధపోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి, దాన్ని ఆచరణలో పెట్టిన వ్యక్తి నేతాజీ అని చెప్పారు. సుభాష్ చంద్రబోస్ రెండు పర్యాయాలు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీతో సిద్ధాంత పరమైన అభి ప్రాయ బేధాలతో రాజీనామా చేశారన్నారు. సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న తీరు ప్రత్యేకమన్నారు. ఆయన మరణంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ,అధికారిక నివేదికల ప్రకారం 1945 ఆగస్టు 18న తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ఆయన మరణించినట్లు భావిస్తున్నారు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదరించడానికి సాయుధ పోరాటాన్ని ఎంచుకున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని త్యాగనిరతి సుభాష్ చంద్రబోస్ సొంతమన్నారు. తొలుత సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దక్కుమళ్ళ రవి, డాక్టర్ ఎ.రమేష్, అన్నవరపు శ్యామల, వాసిమళ్ళ సరళ, బొనిగల నాగార్జున, ఎం.పద్మ, బి.అనిత, ప్రియదర్శిని తదితరులున్నారు.

# గుంటూరు ఖ్యాతిని నిలబెట్టేందుకు కృషిచేస్తా

**జెకెసీ కళాశాల ఆత్మీయ అభినందన సభలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ..**

**గుంటూరు విద్య ఆగస్టు 18 ప్రభాతవార్త :** దేశంలోనే గుంటూరుకు విద్యాపరంగా, రాజకీయపరంగా మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావడానికి తనవంతు కృషిచేస్తానని రాజ్యసభ సభ్యులు, భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జెకెసీ కళాశాల ఆడిటోరియంలో జెకెసీ కళాశాల యాజమాన్యం, కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎంపీ భాష్యం రామకృష్ణకు ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యాపరంగా తన ఎదుగుదలలో జెకెసీ కళాశాల, అధ్యాపక బృందం భాగమయ్యారని, ఈ సందర్భంగా వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నన్నారు. ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని భాష్యం విద్యాసంస్థలను స్థాపించి వాటిని విస్తరించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల నమ్మకమే పెట్టుబడిగా ప్రారంభమైన భాష్యం విద్యాప్రస్థానం ఈ



రోజు ఈ స్థాయిలో ఎదగడానికి ఎంతో కఠోర శ్రమ ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాజకీయరంగ ప్రవేశం చేయడం జరిగిందన్నారు. చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్2047 లక్ష్యంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో భారతదేశం గొప్ప స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా మన గుంటూరు అభివృద్ధికి తనతో పాటు ఎంపీలు పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణ దేవరాయలు సహకారంతో అభివృద్ధి దిశగా శక్తి వంచన లేకుండా కృషిచేస్తామన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీ భాష్యం రామకృష్ణను జెకెసీ కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జెకెసీ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రెసిడెంట్ డాక్టర్ మాదల శ్రీనివాస్, జెకెసీ కళాశాల కరస్పాంటెంట్ అండ్ సెక్రటరీ జాగర్లమూడి మురళీమోహన్, కళాశాల పూర్వ విద్యార్థులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెకెసీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన ఎన్‌టీటీఎం అధికారుల బృందం

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 18,ప్రభాతవార్త:** భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్(ఎన్‌టీటీఎం)కు చెందిన అధికారుల బృందం గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించింది. ఈ సందర్భంగా ఎన్‌టీటీఎం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ప్రయోగశాలలు, మౌలిక వసతులను అధికారులు పరిశీలించడంతో పాటు విద్యార్థులు, టెక్స్‌టైల్ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ తెలిపారు. ప్రతినిధి బృందానికి భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ భాస్కర్ కల్గా నాయకత్వం వహించారు. ఆయనతో పాటు ఎన్‌టీటీఎం సెక్షన్ ఆఫీసర్ శుభం నర్వాల్, పీడబ్ల్యూసీ/ఎన్‌టీటీఎం కన్సల్టెంట్, సీనియర్ అసోసియేట్ అరుషి సేథి పాల్గొన్నారు. సందర్శనలో భాగంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగంలో ఎన్‌టీటీఎం సహకారంతో ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఎమిషన్ స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రో స్కోప్(ఎఫ్‌ఈఎస్‌ఈఎం)సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ అత్యాధునిక పరికరం ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్,



అనుబంధ రంగాల్లో అధునాతన మెటీరియల్ క్యారెక్టరైజేషన్, పరీక్షలు, పరిశోధన సామర్థ్యం మరింత బలోపేతం కానున్నాయి. సుమారు 200మంది విద్యార్థులతో స్టూడెంట్ ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌లు, అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ, కెరీర్ అవకాశాలపై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా సుమారు 40మంది పరిశ్రమ ప్రతినిధులతో ఇండస్ట్రీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్(పీఎల్ఐ) పథకం, ఎన్‌టీటీఎం కార్యక్రమాలు, టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, ఉత్పత్తుల వైవిధ్యీకరణకు సంబంధించిన ఇతర ప్రభుత్వ పథకాలపై చర్చించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రభుత్వ సహాయ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి, పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టెక్నికల్ టెక్స్‌టైల్ రంగంలో మరింత మంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత పథకాల కింద ఉన్న ప్రక్రియ పరిమితులను తగ్గించడం, సాధ్యమైన చోట్ల మార్గదర్శకాలను సరళీకరించే అంశాలను పరిశీలించాలని ఆయన కోరారు. ఎన్‌టీటీఎం ప్రతినిధి బృందం మిషన్ సహకారంతో అభివృద్ధి చేసిన ప్రయోగశాలలు, పరికరాలు, సంబంధిత ప్రాజెక్ట్ డాక్యుమెంటేషన్‌ను కూడా పరిశీలించింది. భవిష్యత్తులో పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు రూపకల్పన వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానికసంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ పై తెదేపా బీసీ సెల్ హర్షం

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 18(ప్రభాతవార్త):** స్థానికసంస్థల్లో బీసీ లకు 34 రిజర్వేషన్ కల్పించటం పై పట్టణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పణిదపు దుర్గా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, పణిదపు దుర్గా మాట్లాడుతూ, కీశే.స్వర్గీయ నందమూరి తారక రామారావు,బీసీల అభ్యున్నతికి, బీసీలు ఆర్థికంగా బలబడటం కోసం, మరియు రాజకీయంగా ఎదగడం కోసం తెలుగుదేశం పార్టీ ఏర్పాటుచేసి ఎంతోమంది ఎమ్మెల్యేలు,ఎంపీలు మరియు రాజ్యసభ సభ్యులుగా ఎంపికచేశారని, ఆ వరవడి కొనసాగిస్తున్న మన ప్రియతమనేత,ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పదవులు పొందుతూ టీడీపీకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ మరో అడుగు ముందుకు వేసి రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో 34 రిజర్వేషన్ కల్పించటం టీడీపీ వర్గాలైన పార్టీకి, కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని, బీసీ ల అభ్యున్నతికి బాటలు వేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నా మన్నారు.



# తెనాలి వైకుంఠపురంలో హుండీ లెక్కింపు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు 18(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం వైకుంఠపురంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము నందు



మంగళవారం నాడు దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో 4 నెలల 25 రోజుల కాలపరిమితికి భక్తులచే సమర్పించబడిన కానుకలు మరియు మ్రొక్కుబడుల హుండీల లెక్కింపు జరుపగా నగదు రూ.86,14,31700లు, బంగారము 20 గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 206 గ్రాముల 400 మిల్లీగ్రాములు, అన్నదానము హుండీ రూ.72,74100లు ఆదాయముగా వచ్చినది.ఈ కార్యక్రమములో ఎ.పి.సి.ఓ.బి బ్యాంకు, చెంచుపేట సిబ్బంది, భారత్ స్కౌట్స్ గైడ్సు వారు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ తెలియజేసారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తెనాలి ఆగస్టు18(ప్రభాతవార్త):** 16వ తేదీ ఆదివారం, తెనాలి రైల్వే స్టేషన్ నుండి కొరవర వెళ్లే రహదారిలో,ఆంజనేయ డిజైన్ షాపు ఎదురుగా ఉన్న సిమెంట్ రోడ్డుపై సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన, పేరు మరియు చిరునామా తెలియని ఒక గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని ఆటో డ్రైవర్ తన ఆటోను అతివేగంగా మరియు అజాగ్రత్తగా నడుపుతూ సదరు వ్యక్తిని ఢీకొట్టి, వాహనాన్ని ఆపకుండా అక్కడి నుండి వెళ్లిపోయినాడు. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తికి తలకు బలమైన రక్త గాయం కావడంతో, స్థానికులు 108 అంబులెన్స్లో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ 18 తేదీ మంగళవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు. మృతుడు నలుపుతెలుపు గళ్ల డిజైన్ కలిగిన చొక్కా మరియు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి పేరు, చిరునామా మరియు ఇతర వివరాలు తెలియరాలేదు. సదరు మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా అతని కుటుంబ సభ్యులు, బంధువుల గురించి ఏదైనా సమాచారం తెలిసినట్లయితే, తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సాంబశివరావు 9440796274, ఎస్సై కరిముల్లా 9491316341 కి సంప్రదించి పోలీసు వారికి సహకరించవలసిందిగా త్రీ టౌన్ పోలీసులు కోరారు.



# హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

**గుంటూరు, ఆగస్టు18, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ , హ్యూమన్ రైట్స్ కమిషన్, మరియు ఎస్సీ కమిషన్ల అత్యవసర నోటీసులను జిల్లా కలెక్టర్, తహశీల్దార్, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి బేఖాతరు చేస్తూ అర్జీదారులను పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఏపీ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది నాగరాజు మాదిగ మాట్లాడుతూ..గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలంలోని చిలువూరు

- నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించకపోతే కోర్టు ధిక్కార కేసు వేస్తా.
- రాష్ట్ర ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ నాగరాజు మాదిగ.



మాదిగ పల్లెకు సంబంధించి ప్రభుత్వ తుఫాను భవనాన్ని ఆక్రమించుకుని దశాబ్దాల నుండి ఆర్.సి.యం మతానికి చెందిన ప్రార్థన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ కు ఫిర్యాదు చేయగా 2023 జూన్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అత్యవసర నోటీస్లు జారీచేయగా చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను ఆదేశించడమైదని తెలియజేశారు. అలాగే శ్మశానవాటిక పరిసర స్థలాన్ని కొన్ని దశాబ్దాలుగా అగ్రవర్ణా లవారు ఆక్రమించారని, ఆ ఆక్రమణలు యుద్ధ ప్రాతిపదికన తొలగించి సమకాలీన అవసరాల మేరకు శ్మశాన వాటికను విస్తరించి, ఆక్రమణదారులను మరియు అవినీతికి పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా స్థానిక కమ్యూనిటీ హాలు స్థలం కూడా ఆక్రమణకు గురైందని వెంటనే సర్వేచేసి ఆక్రమణలను తొలగించాలని రాతపూర్వకంగా తెలియజేయడం జరిగిందని చెప్పారు. చిలువూరు గ్రామం మాదిగ పల్లెలోని గృహాలపై 2022 అక్టోబర్ 14వ తేదీ వేకువజామున పిడుగు పడింది. దీనితో రోజువారి కూలీపనులు చేసుకుని జీవించే నిరుపేదలు అనారోగ్యానికి గురై, నివాస గృహాలు, గృహోపకరణాలు ధ్వంసం అయ్యాయని వీలైనంత గరిష్ట మొత్తంలో బాధితులకు ఆర్థిక సాయం చేయాలని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు మరియు హ్యూమన్ రైట్స్ కమీషన్ ఎస్సీ కమిషన్లకు ఫిర్యాదు చేయగా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని 2022, 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్ కు అత్యవసరనోటీసులు జారీ అయ్యాయని వివరించారు. తదుపరి కలెక్టర్ తెనాలి సబ్ కలెక్టర్కు, సబ్ కలెక్టర్ దుగ్గిరాల మండల తహశీల్దార్, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారికి నోటీసులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. సుమారు నాలుగేళ్లు కావస్తున్న బాధితులకు ఎలాంటి నష్టపరిహారం ప్రభుత్వం నుండి అందలేదని వెల్లడించారు. ఇలాంటి ముఖ్య సమస్యలను అధికారులు పరిష్కరించక పోవడం, నిర్లక్ష్యానికి, బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట కాదా అని నాగరాజు ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతే కాకుండా మండల అధికారులపై సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ ల పర్యవేక్షణ లోపంతో సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కారణమని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్, ఎంపీడీవో లను ప్రత్యక్షంగా కలిసి సమస్యల తీవ్రతను వివరించినప్పటికీ వారినుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ బాధ్యతలను గుర్తెరిగి దీర్ఘకాలిక సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే అట్టి వారిపై కోర్టుధిక్కార కేసులను వేస్తానని హెచ్చరించారు.

# అంగన్‌వాడీ సేవలో నాణ్యత పెంచండి

**--సిడిపిఐ లక్ష్మీదేవి**

**కొల్లూరు, ఆగస్టు 18 (ప్రభాతవార్త) :** అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలపై ఎలాంటి రాజీ ఉండకూడదని అమృతలూరు ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అమృతలూరు ప్రాజెక్టు అంగన్‌వాడీ



కార్యకర్తల సమావేశం జరిగింది. కొల్లూరు మండల సూపర్‌వైజర్లు సునీత, ఫజరున్నీసా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్ణీత సమయాలకు ఖచ్చితంగా నిర్వహించడంతో పాటు మరుగుదొడ్లు, త్రాగునీరు, ఫ్యాన్లు లాంటి మౌలిక సదుపాయాలు ఉండేలా అంగన్‌వాడీ కార్యకర్తలో చూడాలన్నారు. పిల్లల ఎత్తులు, బరువులను క్రమం తప్పకుండా నమోదు చేసి పోషణ ట్రాక్ యాప్‌లో నిరంతరం అప్డేట్ చేయాలని ఆదేశించారు. ప్రీ స్కూల్ విద్యలో భాగంగా బోధన ఉపకరణాలను వినియోగించి చిన్నారులకు ఆసక్తికరమైన విద్యాబోధన అందించాలన్నారు. పిఎంఎంవివై పథకం, టిహెచ్ఆర్ పంపిణీ, విఆర్ ఎస్ కాల్స్ వాట్సాప్ గ్రూపుల ద్వారా పర్యవేక్షణ, ఇంటింటి సందర్శనలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పిల్లలు, లబ్దిదారులకు అందిస్తున్న సేవలపై సమీక్ష సమావేశం నర్వ్హించారన్నారు. విధులలో అలసత్వం వహిస్తే అంగన్‌వాడీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తద్వారా నేర్చుకున్న ప్రతి అంశం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు యొక్క సమగ్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, అమృతవాణి, విజయలక్ష్మీ, ఫజరున్నీసా, నాంచారమ్మ, శకుంతల, పద్మావతి, సంపూర్ణ, రజని, యోగ లక్ష్మీ. మౌనిక, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ,బీసి ఓటర్లను గుర్తించాలి

**కొల్లిపర, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 22వ తేదీలోపు గ్రామాలలోని ఎస్సీ,ఎస్టీ,బీసి ఓటర్లను గుర్తించాలని ఇన్‌ఛార్జ్ ఎంపిడివో కిశోర్‌కుమార్ చెప్పారు.మంగళవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ,బీసి ఓటర్ల గుర్తింపుపై అధికారులు,పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం



జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీన పంచాయతీలలో పబ్లికేషన్ చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్ళి ఎస్సీ,ఎస్టీ,బీసి ఓటర్లను గుర్తించాలన్నారు.ఈ ప్రక్రియలో ఎటువంటి సమస్యలు ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివోలు భార్గవ్,దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# బైటెక్సల్ భాగస్వామ్యంతో విద్యార్థులకు పరిశ్రమోన్నత భవిష్యత్తుకు బాట

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు18, ప్రభాతవార్త :** బైటెక్సల్, ఇండియా కెపిఎంజిల భాగస్వామ్యంతో విద్యార్థులకు పరిశ్రమోన్నత భవిష్యత్తుకు బాట వేయనున్నట్లు మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామ పరిధిలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బైటెక్సల్, మరియు కేపీఎంజి ఇన్



ఇండియా సహకారంతో ఫ్యూచర్ రెడీ ప్రొఫెషనల్స్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ..కెరీర్ కాటలిస్ట్ 2026లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు, మెరుగైన కెరీర్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియా కేపీఎంజి టెక్నికల్ డైరెక్టర్ అమిత్ చౌదరి హాజరై మాట్లాడుతూ..వాట్ మేక్స్ స్టూడెంట్స్ ఎంప్లాయబుల్ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ? అనే అంశంపై కీలక ఉపన్యాసం అందించారు. మరో అతిథి బైటెక్సెల్ కోఫౌండర్ మరియు సిఎస్ఓ శ్రీ చరణ్ తాడేపల్లి మాట్లాడుతూ.. ఫ్యూచర్ రెడీ ప్రొఫెషనల్స్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ, ప్రాజెక్టులు మరియు అనుభవాత్మక అభ్యాసం అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా కేపీఎంజి ఆధ్వర్యంలో ఇన్సైడ్ ఏ రియల్ కన్సల్టింగ్ ఎంగేజ్మెంట్ అనే పరిశ్రమ వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులు సిమ్యులేటెడ్ బిజినెస్ ఛాలెంజ్‌పై పనిచేస్తూ సమస్య పరిష్కారం, డేటా ఆధారిత నిర్ణయాలు మరియు వ్యాపార సిఫారసులపై ప్రత్యక్ష అనుభవం పొందారని చెప్పారు.అలాగే వాట్ ఉయి విష్ ఉయి కేన్యూ ఇన్ కాలేజీ అనే ఫైర్‌సైడ్ సంభాషణలో కెరీర్, పరిశ్రమ అంచనాలు, ఏఐ మరియు భవిష్యత్ అవకాశాలపై చర్చ జరిగిందని వెల్లడించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు ఇండస్ట్రీ రెడీ ప్లేడ్జి స్వీకరించి నిరంతర అభ్యాసం, సమస్య పరిష్కారం, అనుకూలత మరియు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులను ఫ్యూచర్ రెడీ ప్రొఫెషనల్స్ కోహార్ట్ 2026లోకి అధికారికంగా స్వాగతించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు శిక్షణ, ప్రాజెక్టులు, మెంటారింగ్, పరిశ్రమ అనుభవం, సామర్థ్య అంచనా ద్వారా క్యాంపస్ నుంచి కార్పొరేట్ ప్రపంచానికి బలమైన మార్గాన్ని అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ డాక్టర్ పి. రమేష్ బాబు, వివిధ శాఖల హెచ్ఓడీలు, అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీలు, తదితరులు పాల్గొన్నారు.


# అత్తోటలో వైసీపీ ఫ్లెక్సీ చించివేత

**కొల్లిపర, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండలంలోని అత్తోటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి సమయంలో చించివేసిన సంఘటనపై వైకాపా నాయకులు మంగళవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఆగస్టు 15వ తేదీ తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జన్మదినం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.వైకాపా మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతు రాజు,మండల ప్రధాన కార్యదర్శి చదు గంగాధర్,అత్తోట గ్రామ పార్టీ అధ్యక్షుడు కటికి గోపీచంద్,వైకాపా నాయకులు వరికూటి సుబ్బారావు,రాజు తదితరులు ఎస్ఐ ప్రసాద్‌కు ఫిర్యాదు అందజేశారు.




# రైతుల సమక్షంలో భూ రీసర్వే

**కొల్లిపర, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్లిపర పంట పొలాల్లో రైతుల సమక్షంలోనే భూ సర్వే నిర్వహిస్తామని తహశీల్దార్ సిద్ధార్థ చెప్పారు.మంగళవారం కొల్లిపర సచివాలయంలో రెవెన్యూ శాఖ అధికారులు గ్రామ సభ నిర్వహించారు.రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో భూ



సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ సర్వే ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.సర్వే సమయంలో విధిగా రైతులు వారి పొలాల వద్ద ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ,మండల సర్వేయర్ హరికృష్ణ,విలేజీ సర్వేయర్ శివాబాయ్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరి వెదసాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

**-మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు**

**పొన్నూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త:** ప్రస్తుతం వరి వెద సాగు చేసిన భూముల్లో నీటి ఎద్దడి వల్ల పైరు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని నందూరు, ములుకుదురు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరిపైరు ఎండిపోకుండా పొటాషియం నైట్రేట్ ఎకరాకు కేజి పిచికారి చేయాలన్నారు.వరిపైరు సాగుచేసిన రైతులు బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందిన రైతులు పంటల బీమాలో ప్రీమియం చెల్లించాలన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ నెలాఖరులోపు బ్యాంకు మేనేజర్‌ను కలిసిప్రీమియం చెల్లించేవిధంగా



చూడాలన్నారు. పంట వేయని భూములలో 80శాతం రాయితీపై రైతులు కోరితే అపరాలు విత్తనాలు రాయితీపై ఇవ్వగలమని చెప్పారు. రైతులు వరి సాగుచేసిన భూములను ఈ పంట ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. దీని ద్వారా ఇన్సూరెన్సు పంట నష్టము ప్రభుత్వంవారు చెల్లించుటకు అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు కె.మేఘన, సంధ్య, ఎస్.ప్రవల్లిక, ఎంపీఈఓ సింహాద్రి సురేష్‌బాబు,రైతులు పాల్గొన్నారు.

# పెయిన్ మేనేజ్ చికిత్స అన్ని రకాల నొప్పులకు పరిష్కారం

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 18,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నొప్పుల గురించి ఆరోగ్య సభ జరిగింది.ఈ ఆరోగ్యసభకు పెయిన్ మేనేజ్‌మెంట్ వైద్యులు డాక్టర్ హేమజా మామిడాల ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు.పెద్దల్లో వచ్చే మోకాళ్ళ నొప్పుల గురించి మాట్లాడుతూ మోకాళ్ళలో కీళ్ళ మధ్య నొప్పులు వస్తాయని ఇవి నాలుగు దశలుగా ఉంటాయని మొదటి మూడు దశల్లో శస్త్ర చికిత్స లేకుండా పెయిన్ మేనేజ్‌మెంట్ ద్వారా ఉపశమనం కలిగించవచ్చన్నారు.ఒకవేళ సమస్య నాలుగో దశలో ఉన్నట్లయితే శస్త్ర చికిత్స అవసరం అన్నారు.డయాబెటిక్ న్యూరోపతి సమస్య గురించి మాట్లాడుతూ కాళ్ళకు రక్తం సరఫరా చేసే నరాల్లో మైలిన్ పొర దెబ్బతినడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు.ఈ సమస్యకు పెయిన్ మేనేజ్‌మెంట్ ద్వారా సింపతటిక్ డ్రాప్స్ ఉపయోగించి ఉపశమనం కలిగించవచ్చన్నారు.

# ఆయుర్వేద వైద్యంతో సత్ఫలితాలు

**కొల్లిపర, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఆరోగ్య రీత్యా ఆయుర్వేద వైద్యంతో సత్ఫలితాలు పొందవచ్చని ఆయుర్వేద వైద్యాధికారి అర్చన చెప్పారు.మంగళవారం కొల్లిపరలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.షుగర్,బిపి రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు,సలహాలిచ్చారు.ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ జీవితంలో ఆయుర్వేద వైద్యం వలన మేలు జరుగుతుందన్నారు.చారిత్రాత్మకమైన ఆయుర్వేద వైద్యానికి ప్రజల ఆదరణ పెరుగుతున్నదని చెప్పారు.ఆయుర్వేద వైద్యంలో అన్ని రకాల వ్యాధులకు మందులు ఉన్నాయని తెలిపారు.ఆయుర్వేదం అనేది శరీరం,మనస్సు,ఆత్మ పర్యావరణం మధ్య సమతుల్యతను ప్రోత్సహించే బారతదేశ సాంప్రదాయ వైద్య విధానమన్నారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది అరుణకృష్ణా,ఎ.కృష్ణప్రసాద్,ప్రముఖులు కల్లం వీరారెడ్డి,కొల్లి సాంబిరెడ్డి,జొన్నల బసివిరెడ్డి,షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



11gnt:MN 11PAGE-GNTv 01/01/2001 10:02 Page 1



## ప్రతి రైతు పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి

**నగరం, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ప్రతి రైతు పంట బీమా తప్పనిసరిగా చేయించాలని మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిధిలో ని సిరి పూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026




27 సంవత్సరంలో నైరుతి ఋతుపవనాలు అనుకూలంగా లేని పరిస్థితుల వల్ల వర్షపాతం తక్కువగా నమోదవుతుందని రైతులు ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. వరి పంటకు 800 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే 40 వేల రూపాయలు వరకు పంట బీమా వర్తిస్తుందని, ఈ పథకానికి ఆగస్టు 15వ తేదీ లోపు పంట బీమా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక రైతు ఏ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, విఏఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంచి మార్కులు వచ్చే విధంగా పరీక్షలు వ్రాయాలి

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

**పొన్నూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త:** విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు సాధించేవిధంగా పరీక్షలను వ్రాయాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలవుతుందా...లేదా..? అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. రుచి, శుచికి సంబంధించిన



మండల పరిధిలోని ములుకుదురు ఎంపియుపి స్కూల్లో జరుగుతున్న ఎఫ్ఏ-1పరీక్షను ఆయన పరిశీలించారు. విద్యార్థులు ఏ విధంగా పరీక్షలు వ్రాస్తున్నారన్న విషయాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, మరగుదొడ్లు, తదితర మౌళిక వసతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులను హాజరును, వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లీప్ యాప్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు డౌన్‌లోడ్ చేసుకొన్నారా.. ? వారు దాన్ని ఏ విధంగా ఉపయోగించుకు ంటున్నారన్న విషయాలను అడిగి తెలుసుకొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించాలి

### -ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి

**చేబ్రోలు(పొన్నూరు), ఆగస్టు 18,ప్రభాతవార్త:** రైతుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు, శేకూరు గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలను పండించుకోవచ్చ న్నారు. కూరగాయల తోటల్లో పూత, పిందె రాలకుండా అరికట్టడానికి సులభమైన మార్గాలను రైతులకు వివరించారు. శేకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో కోడిగుడ్డు నిమ్మరం ద్రావణం తయారు చేశారు. పూత పిందె రాలకుండా ఉండడం కోసం కోడుగుడ్డు నిమ్మరం ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఒక ఎకరానికి



250ఎంఎల్ సరిపోతుందన్నారు. వంద లీటర్ల నీటిలో కలిపి సాయంత్రం వాడుకున్నట్లయితే పూత, పిందె రాలకుండా నిలబడటానికి అవకాశం ఉంటుందన్నారు. ద్రవ జీవామృతముతో కలిపి వాడితే బెట్ట నుంచి పంటను తక్కువ ఖర్చుతో కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని, జంపని రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**మంగళగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త :** మంగళగిరి పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ సేవా స్ఫూర్తితో మంగళగిరి మండల టీడీపీ



నాయకులు మర్రి ఏసుబాబు రూ.10,000 విలువైన పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా మర్రి ఏసుబాబు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పౌర గ్రంథాలయ సిబ్బంది, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ నిర్ణయం...

## బీసీలలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతోంది

### టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు



మంగళగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందంజలోనే ఉంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి తాజాగా తీసుకున్న నిర్ణయాలు బీసీల రాజకీయ సాధికారతకు మరింత బలమైన పునాది వేస్తున్నాయని టిడిపి పోలీస్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ రావు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమైన అడుగు. ఈ నిర్ణయం ద్వారా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లతో పాటు పట్టణ స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు మరింత విస్తృతమైన రాజకీయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఏర్పడుతుంది.స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివి. గ్రామస్థాయి నుంచి ప్రజలకు దగ్గరగా పాలన సాగించే వ్యవస్థలో బీసీల భాగస్వామ్యం పెరగడం వల్ల వారి సమస్యలను వారు స్వయంగా పాలనా వ్యవస్థలో ప్రస్తావించి పరిష్కారాల దిశగా తీసుకెళ్లే అవకాశం మరింత బలపడుతుందన్నారు. ఇది కేవలం రిజర్వేషన్ మాత్రమే కాదు.. బీసీలకు రాజకీయ నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించే సామాజిక న్యాయ ప్రక్రియ అన్నారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ఎంతో ప్రాధాన్యత కలిగినది. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పిస్తూ, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయానికి కొత్త దిశను చూపుతున్నాయ న్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ కూటమి ప్రభుత్వానికి మంత్రి వర్గానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రత పై బాధ్యతగా ఉండాలి

### రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ తప్పనిసరిగా వినియోగించాలి

### -అసెంబ్లీ జీరో అవర్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, ఆగస్టు 18,ప్రభాతవార్త :** రోడ్డు భద్రత పై అధికారులు తీసుకోవాల్సి న జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సి న నియమాల గురించి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అసెంబ్లీ సాక్షి=గా ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రసంగించారు. బుధవారం అసెంబ్లీ



సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ అంశంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు పై జరిగే ఒక ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, దీనిపై ఎప్పటికప్పుడు చైతన్యం తీసుకురావాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు. 2023లో 19497 రోడ్డు ప్రమాదాలలో 8147 మంది మరణించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తున్నామని, అయితే ప్రమాదాల సంఖ్య తగ్గినప్పటికీ మరణాల సంఖ్య పదిహేను శాతం పెరిగిందని చెప్పారు. ఇది దేశంలోని సగటు కంటే ఎక్కువని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం చేపడుతూనే భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలని చెప్పారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేని వాహనాలకు లైసెన్స్ రద్దు చేస్తున్నారని ఇది ప్రతినిత్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ వాహనాల నుంచి ఊడిపోతే తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రహదారుల నుంచి చిన్న పల్లెటూర్లకు వెళ్లే రోడ్ల వరకు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పని చేస్తోందని తెలిపారు. హైవేలపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో 79 శాతం రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడమే కారణమన్నారు. దీనిపై పటిష్టమైన చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.

## నారు మొక్కలను నాశనం చేసిన దుండగులను శిక్షించాలి

### -రైతు సంఘ నాయకులు ఉలవలపూడి రాము

**వినుకొండ, ఆగస్ట్18,ప్రభాతవార్త:** గడ్డి మందుచల్లి మిరప,టమోటా,పొగాకు,సిట్రడోర నారు మొక్కలను నాశనం చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనిపై రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవపూడి రాము ఆందోళన వ్యక్తం అన్నారు. దుండగులు దుశ్చర్యతో నష్టపోయిన రైతులను మంగళవారం కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పి పల్నాడు జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్,చెన్ను రమేష్, కమతం పెద్దవెంకటరామి రెడ్డి,వినుకొండ



ప్రాంతంలో నర్సరీలో నార్లు పెంచుతున్న రైతులు,విత్తనాల కంపెనీల ప్రతినిధులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు ఎస్సై ఉదయలక్ష్మి,విఆర్ఓతిరుపతమ్మ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి బాధితుల నుండి వాంగ్మూలం తీసుకున్నారు.

## 34 శాతం స్థానిక బీసీ రిజర్వేషన్ల మంత్రి మండలి తీర్మానం పై హర్షం : కేసన శంకరరావు

**తాడేపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలకు 34 శాతం రిజర్వేషన్లు వెనుకబడిన తరగతులైన బీసీలకు అమలు జరపాలని రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించడాన్ని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసర శంకరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చట్టంలో ఉన్న నిబంధనల మేరకు బీసీలకు 34 శాతం గ్రామీణ స్థానిక సంస్థలలోనూ,331/3 శాతం పట్టణ స్థానిక సంస్థలలోనూ రిజర్వేషన్ ఇవ్వాలని తీర్మానించడాన్ని బీసీ సమాజం ధన్యవాదాలు తెలుపుతుందన్నారు. ఎట్టి పరిస్థితులలోనూ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించ కూడదన్న సుప్రీంకోర్టు సీలింగ్ తో నిమిత్తం లేకుండా,పంచాయతీరాజ్ చట్టం మేరకు 34 శాతం బీసీ రిజర్వేషన్ల కేటాయింపు సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వం 24 శాతం అమలు జరపడం వల్ల అన్ని స్థానిక సంస్థలలో కలిపి 16 వేల రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారన్నారు. ఈసారి ఎన్నికలకు ఆ పరిస్థితి తలెత్తకుండా చట్టం లో పేర్కొన్న మేరకు న్యాయపరమైన చిక్కులు లేకుండా, 34 శాతం అమలు కావడం వల్ల వెనుకబడిన తరగతులకు రాజకీయంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనితో పాటు బాగా వెనుకబడిన తరగతులైన ఎంబీసీలకు సామాజిక న్యాయం అందేలా స్థానిక సంస్థల రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ రంగాలలో మాదిరిగా ఏబిసిడిలుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలు జరపాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరిపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తుందని శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఎస్ఆర్ఎం డ్రోన్ కార్పొరేషన్ల నడుమ ఎంవోయు

**మంగళగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ల నడుమ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం కర్నూలు జిల్లా ఓర్వకల్లు డ్రోన్ సిటీలో జరిగిన జాతీయస్థాయి డ్రోన్ సమ్మిట్ లో ఈ ఒప్పందం జరిగింది కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కేరామ్మోహన్ నాయుడు సమక్షంలో జరిగిన ఎంఓ యు కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తరఫున రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ గీతాంజలి శర్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం ద్వారా వ్యవసాయం, మౌలిక వసతులు, విపత్తుల నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవలు, మెడికల్ డెలివరీ, అధునాతన వైమానిక రవాణా వంటి వివిధ రంగాల్లో అంతర శాఖ పరిశోధనలు, డ్రోన్ ఆధారిత అప్లికేషన్లు, సాంకేతిక ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి ఆవిష్కరణలకు మరింత బలం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రీసర్చ్ డీన్ ఆచార్య రంజిత్ తాపా, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## వేద స్కూల్లో ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపికలు

**చిలకలూరిపేట, ఆగస్ట్18,ప్రభాతవార్త:** చిలకలూరిపేట స్థానిక వేద స్కూల్లో ఆగస్టు 17.2026 అనగా సోమవారం ఎన్ సి సి క్యాడెట్ల ఎంపికలు జరిగాయి . ఈ సందర్భంగా విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి క్యాడెట్లలను ఎంపిక చేశారు . ఈ ఎంపికలలో 25 ఆంధ్ర బెటాలియన్ నుండి ఎస్ ఎం బెటాలియన్ అధికారులు పాల్గొని ఎంపికలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీగిరి డేవిడ్ స్నేహల్ ఎంపికైన విద్యార్థులు అభినందించారు అలాగే పాఠశాల సి ఈ ఓ శామ్యూల్ రాజు ఎంపికైన



విద్యార్థులను అభినందిస్తూ ఎన్ సి సి అనేది క్రమశిక్షణకు సేవ దృక్పథానికి అకుంఠిత దీక్షకు పరోపకారశీలతకు నిదర్శనము అని కొనియాడారు అలాగే చాలా అకడమిక్ డైరెక్టర్ సత్య దీప్తి ఎన్ సి సి అనేది దేశభక్తి తో పాటు ట్రిబుల్ ఐటీ లలో సీట్లు సాధించడానికి దోహదం చేస్తుంది అలాగే ఇంటర్ విద్యార్థులకు ఆర్మీ ,హోంగార్డు, ఉద్యోగాలకు దోహదం చేస్తుందని తెలిపారు . పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఎంపికైన విద్యార్థులు అందరిని ప్రత్యేకంగా అభినందిస్తూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎన్ సి సి వల్ల కలుగుతుందని తెలిపారు .ఎన్సిసి ఏ ఎన్ ఓ ఎస్ అప్పారావు పాల్గొన్నారు .

## వైభవంగా పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షికోత్సవాలు

**రాజుపాలెం, ఆగస్టు 18 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో కొలువుదీరిన పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 14వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని వివిధ గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఈ సందర్భంగా నిత్యారాధన, మంగళస్నానం, నవకలశ స్థాపన, చక్రతీర్థోత్సవం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు భజన సామ్రాట్, గాన సరస్వతి, అభినయ కళా విశారద చీమకుర్తి సుజాత బృందం ఆధ్వర్యంలో బృందావనం భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ అధినేత పొత్తూరి వెంకట రమ సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం పౌరాణిక నాటకాలు, కోలాట ప్రదర్శనలు, స్వామివారి సంకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్నాం : ఎమ్మెల్యే అరవిందబాబు

**నరసరావుపేట, ఆగస్టు 18 ప్రభాతవార్త :::** పట్టణంలోని 18వ వార్డు అరండల్‌పేట ప్రాంతంలో మంగళవారం సాయంత్రం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబుకు, పార్టీ నాయకులకు ఘన స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. గత మూడేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేశామని పేర్కొన్నారు. శాసనసభలో బీసీలకు రిజర్వేషన్లు, రక్షణ చట్టం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.2028 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు అంకితం చేస్తామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని, స్పీడ్ యాక్సెస్ రహదారుల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందన్నారు. రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు రాకెట్ వేగంతో అమలవుతున్నాయని



పేర్కొన్నారు. మంచి పాలన అందిస్తున్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు తమ మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అరవిందబాబు కోరారు.కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, నల్లపాటి రాము, చేకూరి కోటేశ్వరరావు, వాసిరెడ్డి రవి, సీపీఐ నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

**చిలకలూరిపేట, ఆగస్ట్18,ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, ఎడవల్లి గ్రామ పరిధిలోని విస్తరణ ప్రతిపాదనకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం పల్నాడు జిల్లా కలెక్టర్ మరియు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ప్రస్తుతం గని ద్వారా సంవత్సరానికి 600 క్యూబిక్ మీటర్ల బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తి జరుగుతుండగా, ఈ విస్తరణ ప్రతిపాదన ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని సంవత్సరానికి 10,006 క్యూబిక్ మీటర్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20.00 లక్షలుగా ఉంది.ఈ పర్యావరణ



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మరియు ఆర్‌డీఓ శ్రీ బాలకృష్ణ హాజరై, తిశిశిదితీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలు, స్థానికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని, ప్రతిపాదిత గని విస్తరణకు సంబంధించి తమ అభిప్రాయాలు, సూచనలు మరియు అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు అధికారులు అవకాశం కల్పించగా, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలు మరియు అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేశారు.పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో, ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది.

## సాగర్ కుడికాలువకు నీరు విడుదల చేయాలి : గోపిరెడ్డి

**నరసరావుపేట, ఆగస్టు 18 ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు, తాగునీరు విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్



చేశారు. మంగళవారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుడికాలువకు 130 టీఎంసీల నికర జలాల కేటాయింపు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున పత్తి, మిర్చి, జొన్న, కందులు, మినుములు వంటి ఆరుతడి పంటలకు కనీసం నీరు విడుదల చేయాలని కోరారు. సాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ కుడికాలువ రైతులకు నీరు అందకపోవడం బాధాకరమన్నారు. ఎగువనున్న పోతిరెడ్డి రెగ్యులేటర్ నుంచి పదివేల క్యూసెక్కులు హంద్రీనీవా నుంచినుంచి 3000 క్యూసెక్కుల నీటిని రాయలసీమ ప్రాంతానికి రిలీజ్ చేశారు . ఈ నీరు తాగునీటికి కావచ్చు సాగునీటి కోసం కావచ్చు, దేనికి అనేది మేము అడగటం లేదు. తాగునీటికి రిలీజ్ చేసినా ఆ ప్రాంత ప్రజలు అక్కడ ఆరుతడి పంటలు వేసుకుంటున్నారు. అంతేకాకుండా తెలంగాణ నుంచి భీమ1,భీమా 2, నెట్టెం వాగు ,కోయిల్ సాగర్ ఈ నాలుగు లెఫ్ట్ ఇరిగేషన్ ల ద్వారా తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి నీటిని విడుదల చేసుకున్నారు.శ్రీశైలం ప్రాజెక్టులో 176 టీఎంసీలు ఉన్నా సరే ఈ నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా తెలంగాణలో నాలుగు ప్రాంతాలకు మరియు రాయలసీమ ప్రాంతానికి నీరు వెళ్తున్నాయి. ఒక్క నాగార్జునసాగర్ కుడి కాలువ ,ఎడమ కాలువలకు మాత్రమే నీరు వదలలేదు, ఎడమ కాలువకు తెలంగాణ ప్రభుత్వం ఎలాగైనా విడుదల చేసుకుంటారు . గుర్తుగా నష్టపోయేది నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు రైతులు మాత్రమే.ఈరోజు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ రైతుల సమస్యపై స్పందించకపోవడం విచారకరమన్నారు.తక్షణమే నీటిని విడుదల చేయకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని గోపిరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, నరసరావుపేట మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో సామాజిక న్యాయం : ఎమ్మెల్యే అరవిందబాబు



నరసరావుపేట, ఆగస్టు 18 ప్రభాతవార్త ::ఆంధ్రప్రదేశ్ శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టడం సామాజిక న్యాయానికి దోహదపడుతుందని అన్నారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడంలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల ఆర్థికాభివృద్ధికి అనేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.2019 ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా సమస్యలపై ఐదేళ్ల పాటు పోరాడానని, 2024లో నరసరావుపేటలో టీడీపీ విజయానికి అవకాశం కల్పించిన చంద్రబాబు, నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి విజయానికి పవన్ కళ్యాణ్ కీలకంగా నిలిచారని పేర్కొంటూ, బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వానికి సభాముఖంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ధన్యవాదాలు తెలిపారు.

## మిరప నాట్లకు వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలి

### రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి: గద్దె చలమయ్య

**సత్తెనపల్లి (ఆగస్టు 18, ప్రభాతవార్త):** మిరప నాట్లకు వెంటనే నాగార్జునసాగర్ జలాలను విడుదల చేసి రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని పల్నాడు జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షులు గద్దె చలమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పల్నాడు జిల్లాలో గత ఏడాది సుమారు 1.13 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారని, పత్తి సహా ఇతర పంటలు దెబ్బతిన్నప్పటికీ మిర్చి పంట కొంతమేర రైతాంగాన్ని ఆదుకుందని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు చివరికి వస్తున్నా ఇంతవరకు మిర్చి నాట్లు ప్రారంభం కాలేదన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోయినా రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి భూగర్భ జలాలతో షెడ్డు నెట్ కింద మిరప నారును పెంచారని, ప్రస్తుతం మొక్కలు నాటే దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. సాగర్ నీటిని విడుదల చేస్తే నారును కాపాడుకోవడంతో పాటు పొలాల్లో నాటుకోవచ్చని రైతులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో అలమట్టి, నారాయణపూర్, జూరాల రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగాయని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోనూ ప్రస్తుతం అవసరమైన నీటి నిల్వలు ఉన్నాయని చలమయ్య పేర్కొన్నారు. కృష్ణా నదికి సెప్టెంబర్ వరకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున సాగర్ ఆయకట్టుకు మిరప నాట్ల కోసం నీటిని విడుదల చేయాలని కోరారు.ప్రస్తుతం వర్షాలు లేక పొలాల్లో గడ్డి కూడా ఎండిపోయి ఎండాకాలాన్ని తలపిస్తోందని, పశువులకు తాగునీరు అందే పరిస్థితి కూడా లేకుండా పోయిందని అన్నారు. పత్తి మొలకెత్తకపోగా, మొలకెత్తిన పంటలు సైతం ఎండిపోతున్నా యని తెలిపారు. వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కనీసం మిరప పంటనైనా సాగు చేసుకుని జీవనం కొనసాగించాలని రైతులు భావిస్తున్నారని, ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని గద్దె చలమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14